శుక్రవారం
01-03-2024
విజయవాడ ప్రచురణ
సంపుటి : 72, సంచిక : 249
పేజీలు : 8, వెల: రూ.5.00
Simultaneously published from Vijayawada, Hyderabad, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam

www.visalaandhra.com
స్థాపితం : 1952

విశాలాంధ్ర

VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

మే నుంచి సర్వీసులన్నీ నిలిపివేస్తాం

న్యూఢిల్లీ: నూతన పింఛన్ విధానాన్ని రద్దు చేసి దాని స్థానంలో పాత పింఛన్ విధానాన్ని పునరుద్ధరించాలని రైల్వే ఉద్యోగ, కార్మిక సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. కేంద్రప్రభుత్వం తమ డిమాండ్‌ను నెరవేర్చకపోతే మే 1 నుంచి దేశ వ్యాప్తంగా అన్ని రైళ్ల సర్వీసుల్ని నిలిపివేస్తామని హెచ్చరించాయి. ఈమేరకు జాయింట్ ఫోరం ఫర్ రెస్టోరేషన్ ఆఫ్ ఓల్డ్ పెన్షన్ స్కీమ్ కన్వీనర్ శివగోపాల్ మిశ్రా తెలిపారు. మార్చి 19న కేంద్ర రైల్వేశాఖను కలిసి సమ్మెపై నోటీసు ఇవ్వాలని నిర్ణయించినట్లు చెప్పారు. తమ పోరాటంలో కలిసి రావాలని ఇతర ప్రభుత్వ సంఘాలకు పిలుపునిచ్చారు. కొత్త పింఛను విధానం ఉద్యోగుల ప్రయోజనాలకు అనుగుణంగా లేదన్నారు.

ఈసారి అధికారం 'ఇండియా'దే

ఎన్డీయేకి ప్రత్యామ్నాయంగా ప్రతిపక్ష కూటమి

బీజేపీని గద్దె దించాల్సిందే : వినయ్ విశ్వం

తిరువనంతపురం: సార్వత్రిక ఎన్నికల తర్వాత దేశంలో 'ఇండియా' కూటమి అధికారంలోకి రాబోతోందని భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) జాతీయ కార్యదర్శి, కేరళ రాష్ట్ర కార్యదర్శి వినయ్ విశ్వం విశ్వాసం వ్యక్తంచేశారు. 2019లో వలే కాకుండా 2024లో ప్రతిపక్ష కూటమి గెలుపు తథ్యమన్నారు. ప్రతిపక్షాలు కూడా గెలుపుపై ధీమాగా ఉన్నట్లు చెప్పారు. ఎన్డీయేకి సమర్థ ప్రత్యామ్నాయం ఇండియా కూటమి అని అన్నారు. ఎన్నికల వేళ విపక్షాల్లో ఐక్యత అత్యవసరమన్నారు. భారత రాజ్యాంగాన్ని, లౌకికవాదాన్ని, ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించుకోవడం కోసం ఆర్‌ఎస్‌ఎస్ మద్దతున్న బీజేపీ గద్దె దించడం అత్యవసరమని నొక్కిచెప్పారు. ఇండియా కూటమిలో కొన్ని లోటుపాట్లు ఉన్నప్పటికీ సమర్థంగా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయగలదన్నారు. '2019లో బీజేపీకి సమర్థ ప్రత్యామ్నాయం ఎవరన్న ప్రజల ప్రశ్నకు సమాధానం లభించలేదు కానీ ఇప్పుడు ఇండియా కూటమి ప్రత్యామ్నాయంగా ఉంది' అని పీటీఐకిచ్చిన ఇంటర్వ్యూలో రాజ్యసభ ఎంపీ వినయ్ విశ్వం చెప్పారు. ఎన్డీయే ప్రభుత్వ గుట్టు పూర్తిగా రట్టు కానున్నట్లు తెలిపారు. ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాల్లో, పౌరుల ఖాతాల్లో రూ.15లక్షల జమ, అన్ని గ్రామాల్లో ఫైబర్ కనెక్టివిటీ వంటివన్నీ ఏమయ్యాయని బీజేపీని ప్రశ్నించారు. ఇచ్చిన హామీల సమాధిపై

- మిగతా 2 లో

డిమాండ్ల సాధనపై వెనక్కి తగ్గం

- శంభు, ఖనౌరిలో పోరు ఆగదు : పంధేర్
- నిపుణులతో చర్చించాకే కేసు నమోదు : పంజాబ్ సీఎం
- శుభకరణ్ కుటుంబానికి పరిహారం, సోదరికి ఉద్యోగం హామీ
- భటిండాలో ముగిసిన యువ రైతు అంత్యక్రియలు

చండీగఢ్/జలంధర్: తమ డిమండ్లను పరిష్కరించేంత వరకు వెనక్కి తగ్గేది లేదని, శంభు, ఖనౌరి సరిహద్దుల వద్ద ఆందోళన కొనసాగుతుందని రైతు నేత శర్వన్ సింగ్ పంధేర్ తెలిపారు. ఉద్యమ భవిష్యత్ కార్యాచరణను త్వరలోనే ప్రకటిస్తామన్నారు. పోలీసుల దాడిలో ప్రాణాలు కోల్పోయిన శుభకరణ్ సింగ్ సంస్మరణ సభ మార్చి 3న భటిండాలోని బల్లో గ్రామంలో ఎస్‌కేఎం (నాన్ పొలిటికల్), కిసాన్ మజ్దూర్ మోర్చా అధ్వర్యంలో జరుగుతుందని, పెద్ద సంఖ్యలో పాల్గొని అమర రైతుకు ఘనంగా నివాళులర్పించాలని ఆయన పిలుపునిచ్చారు. న్యాయ నిపుణులతో సంప్రదింపులు జరిపిన తర్వాత కేసు నమోదు చేసినట్లు పంజాబ్ ముఖ్యమంత్రి భగవంత్ మాన్ గురువారం తెలిపారు. శుభకరణ్ కుటుంబానికి రూ.కోటి పరిహారంతో పాటు ఆయన సోదరికి

- మిగతా 2 లో

మేనిఫెస్టోపై వైసీపీ కసరత్తు



- సీనియర్ ఐఏఎస్‌లతో సీఎం భేటీ
- నవరత్నాల కొనసాగింపు
- యువత, మహిళలు, రైతులకు కొత్త పథకాలపై దృష్టి!

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాబోయే సార్వత్రిక ఎన్నికల మేనిఫెస్టోపై వైసీపీ తుది కసరత్తు చేపట్టింది. ఉన్న పథకాలతోపాటు కొత్త వాటిని చేర్పించే అంశంపై చర్చించింది. తాడేపల్లి క్యాంపు కార్యాలయంలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అధ్యక్షతన గురువారం కీలక సమావేశం నిర్వహించారు. దీనికి సీనియర్ ఐఏఎస్ అధికారులు, ప్రభుత్వ సలహాదారులు హాజరయ్యారు. గతానికి కంటే మెరుగ్గా ఈ విడత

- మిగతా 2 లో

సీపీఐ, సీపీఎంకు చెరో రెండు స్థానాలు

తమిళనాట డీఎంకేతో కుదిరిన పొత్తు

చెన్నై: సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తుండటంతో తమిళనాడులో పోటీ చేసే స్థానాలపై సీపీఐ, సీపీఎం, డీఎంకే మధ్య ఒప్పందం కుదిరింది. చెరో రెండు స్థానాల నుంచి సీపీఐ, సీపీఎం పోటీ చేయనున్నాయి. ఈ మేరకు సీట్ల సర్దుబాటు ఖరారైనట్లు డీఎంకే గురువారం వెల్లడించింది. ఆ పార్టీలు పోటీ చేసే స్థానాలు ఏవన్నది తర్వాత నిర్ణయించనున్నట్లు తెలిపింది. డీఎంకే కేంద్ర కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఈ నిర్ణయం జరిగినట్లు పేర్కొంది. ఒప్పందంపై డీఎంకే అధ్యక్షుడు ఎంకే స్టాలిన్, సీపీఐ, సీపీఎం రాష్ట్ర కార్యదర్శులు ఆర్.ముథరాసన్, కె.బాలకృష్ణన్ సంకతాలు చేసినట్లు ప్రకటన తెలిపింది. 2019లో సీపీఐ... తిరుప్పూర్, నాగపట్టణం నుంచి పోటీ చేయగా సీపీఎం... మధురై, కోయంబత్తూర్ నుంచి పోటీ చేసింది. కాగా, ఐయూఎంఎల్, కొందు దేశీయా మర్నొక్కు కజగం (కేఎండీఎకే)తో డీఎంకే ఇప్పటికే సీట్ల సర్దుబాటు చేసుకున్న విషయం తెలిసిందే.

పాక్‌లో కొత్త ప్రభుత్వం

- కొలువుదీరిన 16వ నేషనల్ అసెంబ్లీ
- పోటాపోటీ నినాదాలతో పార్లమెంటు రసాభాస

2లో

నేటి నుంచి ఇంటర్ పరీక్షలు

- 10,52,221 మంది దరఖాస్తు, 1,559 పరీక్షా కేంద్రాలు
- 144 సెక్షన్ అమలు... పకడ్బందీ ఏర్పాట్లు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఏపీ ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలు మార్చి ఒకటో తేదీ నుంచి ప్రారంభమవుతాయి. ఈ ఏడాది రాష్ట్ర వ్యాప్తంగా ఇంటర్ పరీక్షలకు 1,559 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారు. మొత్తం 10,52,221 మంది విద్యార్థులు పరీక్షలకు దరఖాస్తు చేశారు. గతేడాదితో పోలిస్తే 47,921 మంది అధికంగా పరీక్షలు రాయనున్నారు. పరీక్షా కేంద్రం వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుంది. జిరాక్స్ షాపులు తెరవకూడదు. పరీక్షా కేంద్రంలోకి ఫోన్లు అనుమతించబోరు.

- మిగతా 2 లో

ఆ ఎమ్మెల్యేలపై అనర్హత

హిమాచల్ స్పీకర్ సంచలన నిర్ణయం

ఆరుగురు కాంగ్రెస్ శాసనసభ్యుల సభ్యత్వం రద్దు

తక్షణం అమల్లోకి వస్తుందని ప్రకటన

షిమ్లా: హిమాచల్‌ప్రదేశ్‌లో ఒక్క స్థానానికి జరిగిన రాజ్యసభ ఎన్నికల్లో క్రాస్ ఓటింగ్‌కు పాల్పడిన ఆరుగురు కాంగ్రెస్ ఎమ్మెల్యేలపై అనర్హత వేటు పడింది. కాంగ్రెస్ గుర్తుపై పోటీ చేసిన ఆరుగురు ఎమ్మెల్యేలు ఫిరాయింపుల నిరోధక చట్టం నిబంధనలను ఉల్లఘించినందుకు అనర్హత వేటు వేస్తున్నట్లు అసెంబ్లీ స్పీకర్ కుల్దీప్ సింగ్ పథానియా స్పష్టం చేశారు. అనర్హత వేటు పడిన ఎమ్మెల్యేలను రాజిందర్ రాణా, సుధీర్ శర్మ, ఇందర్ దత్ లఖన్‌పాల్, దేవిందర్ కుమార్ భూటూ, రవి ఠాకూర్, చెతన్య శర్మగా స్పీకర్ వెల్లడించారు. తక్షణమే అమల్లోకి వస్తుందని మీడియా ముఖంగా ప్రకటించారు. ఎమ్మెల్యేల అనర్హతపై బుధవారం తన తీర్పును రిజర్వ్ చేసిన స్పీకర్ కుల్దీప్ సింగ్ పఠానియా- హస్తం పార్టీ గుర్తుపై ఎన్నికైనందున ఈ శాసనసభ్యులు కాంగ్రెస్ విప్‌ను ధిక్కరించి ఫిరాయింపు నిరోధక చట్టాన్ని ఉల్లంఘించారని షిమ్లాలో ఏర్పాటు చేసిన

- మిగతా 2 లో

ఓట్ల కోసం బీజేపీ కుయుక్తులు

- విద్వేషాలు రెచ్చగొట్టేందుకే సీఏఏ, ఎన్ఆర్సీ
- గ్రూపు-1 పరీక్ష నిర్వహణలో కుట్ర కోణం
- రైతులందరికీ లబ్ధి చేకూర్చాలి
- హోదాపై నేటి కాంగ్రెస్ సభకు సీపీఐ మద్దతు
- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

విశాలాంధ్ర- విజయవాడ: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం దేశంలో ప్రజాసమస్యలను పరిష్కరించి తద్వారా ఓట్లు పొందాలనే ఆలోచన చేయకుండా ప్రజల మధ్య చీలిక తీసుకువచ్చి మెజార్టీ ప్రజల ఓట్లు పొంది అధికారం నిలబెట్టుకోవాలని కుయుక్తులకు పాల్పడుతోందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ ధ్వజమెత్తారు. స్థానిక దాసరి భవన్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మైనార్టీలకు వ్యతిరేకంగా మెజార్టీ హిందువులను రెచ్చగొట్టి అధికారంలోకి రావాలని ప్రయత్నిస్తోందన్నారు. ఎన్నికలు సమీపిస్తున్న వేళ కేంద్ర హోంమంత్రి పదే పదే సీఏఏ, ఎన్ఆర్సీ గురించి మాట్లాడుతూ... మైనార్టీలను కించపర్చటానికి యత్నిస్తున్నారు తప్ప ప్రజల సమస్యలపై వారిచ్చిన వాగ్దానాలను అమలు చేయాలనే ఆలోచన చేయకపోవటం దుర్మార్గం అన్నారు. ఏపీకి ప్రత్యేక హోదా కోసం 2019 ఎన్నిక సందర్భంగా ఆనాటి ముఖ్యమంత్రి చంద్రబాబు ఎన్డీఏ నుంచి బయటకు వచ్చి ఢిల్లీస్థాయిలో కేంద్రానికి వ్యతిరేకంగా ధర్నా చేశారని చెప్పారు. అప్పటి ప్రతిపక్ష నేత వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి తనకు ఎమ్మెల్యే సీట్లతో పాటు అధిక సంఖ్యలో ఎంపీ సీట్లు ఇస్తే కేంద్రంలో ఎవరు అధికారంలో ఉన్నా మెడలు వంచి ప్రత్యేక హోదా తీసుకువస్తానని వాగ్దానం చేశారని గుర్తు చేశారు. తరువాత వైసీపీ, టీడీపీలు రెండూ ప్రత్యేక హోదా గురించి మాట్లాడకపోవటం విచారకరం అన్నారు. ఈ నేపథ్యంలో విద్యార్థి, యువజన సంఘాల జేఏసీ రాష్ట్రానికి ప్రత్యేక హోదా కావాలనే డిమాండ్‌తో మార్చి ఒకటవ తేదీన చేయ తలపెట్టిన 'చలో ముఖ్యమంత్రి కార్యాలయం' ఆందోళనకు సీపీఐ తరపున సంపూర్ణ మద్దతు ప్రకటించారు. అదే విధంగా మార్చి 1వ తేదీన కాంగ్రెస్ పార్టీ ప్రత్యేక హోదా డిక్లరేషన్ కోసం తిరుపతిలో ఏర్పాటు చేసిన సభకు సీపీఐ మద్దతు ఇస్తుందన్నారు. ఆ సభలో సీపీఐ జాతీయ కార్యదర్శి కే నారాయణ తోపాటు రాష్ట్ర నాయకులు, జిల్లా నాయకులు పాల్గొంటారని తెలిపారు. ఇప్పటికైనా ప్రత్యే హోదా అంశంపై ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయాలని రామకృష్ణ డిమాండ్ చేశారు. 2019 ఎన్నికల సందర్భంగా... ఏటా జాబ్ క్యాలెండర్ విడుదల చేసి గ్రూపు1, గ్రూపు 2 ఉద్యోగాలు, డీఎస్సీ ద్వారా ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేస్తామని చెప్పిన జగన్... యువతను నిలువునా మోసం చేశారని మండిపడ్డారు. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో

- మిగతా 2 లో

ఇదీ లోకం!

పోరాటాలతోనే సంక్షేమ బోర్డు కాపాడుకోగలం

రాష్ట్ర వ్యాప్తంగా భవన నిర్మాణ కార్మికుల ధర్నాలు

సంక్షేమ నిధుల మళ్లింపుపై నేతల ఆగ్రహం

విశాలాంధ్ర నెట్‌వర్క్: పోరాటాల ద్వారానే సంక్షేమబోర్డును కాపాడుకోగలమని ఏఐటీయూసీ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి ఎస్.వెంకట సుబ్బయ్య స్పష్టం చేశారు. భవన నిర్మాణ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యల్ని పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ... భవన నిర్మాణ కార్మిక సంఘం దేశవ్యాప్త పిలుపులో భాగంగా భవన కార్మికులు గురువారం రాష్ట్ర వ్యాప్తంగా ధర్నాలు నిర్వహించారు. బిల్డింగ్ అండ్ కన్స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ ఎన్టీఆర్, కృష్ణాజిల్లాల సమితుల అధ్వర్యంలో విజయవాడ ధర్నా చౌక్ వద్ద ధర్నా జరిగింది. యూనియన్ అధ్యక్షుడు సోనా రాజు అధ్యక్షతన జరిగిన ధర్నాలో ఏఐటీయూసీ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి ఎస్.వెంకట సుబ్బయ్య మాట్లాడుతూ... వైసీపీ ప్రభుత్వం భవన కార్మికుల సంక్షేమ నిధులు రూ. 1600 కోట్లు దారి మళ్లించిందని, సంక్షేమ బోర్డును పూర్తిగా నిర్వీర్యం చేసిందని ఆందోళన వ్యక్తం చేశారు. వచ్చే ఎన్నికల్లో ఏ రాజకీయ పార్టీ అయితే భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరించి అమలు చేస్తుందో ఆ పార్టీకే భవన నిర్మాణ కార్మికులు అండగా ఉంటారని చెప్పారు. ఈ మేరకు వారివారి

- మిగతా 2 లో

'సూర్యఘర్'కు కేబినెట్ ఆమోదం

- సోలార్ ప్యానళ్ల ఏర్పాటుకు రూ.78 వేల వరకు సబ్సిడీ
- పీ & కే ఎరువులపై రూ.24,420 కోట్లు

8లో

'పీఎం సూర్యఘర్: ఉచిత సౌర విద్యుత్ యోజన'కు కేంద్ర కేబినెట్ గురువారం ఆమోదం తెలిపింది. ఇంటి పైకప్పుపై సోలార్ ప్యానళ్ల ఏర్పాటుకు రూ.78వేల వరకు సబ్సిడీ ఇచ్చేందుకు అంగీకరించింది. కోటి ఇళ్లకు నెలకు 300 యూనిట్ల ఉచిత విద్యుత్ అందించేందుకు ఈ పథకం దోహదమవుతుందని పేర్కొంది.

Form IV

Statement about ownership and other particulars about newspaper **VISALAANDHRA**

1. Place of publication	:	Vijayawada
2. Periodicity of its publication	:	Daily
3. Printer's Name	:	Edupuganti Nageswara Rao
Nationality	:	India
Address	:	33-22-2, VISALAANDHRA ROAD, CHUTTUGUNTA. VIJAYAWADA-5200004, A.P.
4. Publisher's Name	:	Edupuganti Nageswara Rao
Nationality	:	India
Address	:	33-22-2, VISALAANDHRA ROAD, CHUTTUGUNTA, VIJAYAWADA - 5200004, A.P.
5. Editor's Name	:	R.V.RAMARAO
Nationality	:	India
Address	:	33-22-2, VISALAANDHRA, Chandram Buildings, CHUTTUGUNTA, VIJAYAWADA - 5200004, A.P.
6. Names and addresses of individuals Who own the newspaper and partners or shareholders holding More than one percent of the total capital.	:	**VISALAANDHRA VIGNANASAMITHI**

Members of the Governing Body

President	:	**Muppalla Nageswara Rao** Kothapeta-Guntur
Secretary	:	**Jalli Wilson** D.No.32-11-34, Mogalrajpuram, Vijayawada- 520004
Treasurer	:	**G. Obulesu** D.No.14-9-14, Dasari Bhavan, Hanumanpet, Vijayawada

Members :

K. Ramakrishna	Hanumanpet, Vijayawada
P. Harinatha Reddy	Chandram Buildings, Vijayawada
P. Kameswara rao	Srungavarapukota, Vizainagaram
Katti Narasimhareddy	Hanumanpet, Vijayawada
Chalasani Ajay Kumar	Suryaraopet - Vijayawada
P. Durga Bhavani	Ramakrishnapuram, VJA
P.V. Mallikarjunarao	Arundalpet, Guntur

I, Edupuganti Nageswara Rao, hereby declare that the particulars given above are true to the best of my knowledge and belief.

Sd/-
Edupuganti Nageswara Rao
Signature of Publisher

Date : 29-02-2024

పాక్‌లో కొత్త ప్రభుత్వం

- **కొలువుదీరిన 16వ నేషనల్ అసెంబ్లీ**
- **పోటాపోటీ నినాదాలతో పార్లమెంటు రసాభాస**
- **గందరగోళం నడుమ సభ్యుల ప్రమాణ స్వీకారం**

ఇస్లామాబాద్: పాకిస్థాన్‌లో కొత్త ప్రభుత్వం ఏర్పాటైంది. గురువారం 16వ నేషనల్ అసెంబ్లీ కొలువుదీరింది. కొత్తగా ఎన్నికైన సభ్యులతో స్పీకర్ రాజా పర్వేజ్ అష్రాఫ్ ప్రమాణ స్వీకారం చేయించారు. ఇదే క్రమంలో ఇమ్రాన్ ఖాన్ అనుకూల-వ్యతిరేక నినాదాలతో సభ రసాభాస అయ్యింది. గందరగోళం నడుమ ప్రమాణ స్వీకారం జరిగింది. మాజీ ప్రధానులు నవాజ్ షరీఫ్, షెహబాజ్ షరీఫ్ సభకు రాగానే 'ఓట్ల దొంగ' అని పాకిస్థాన్ తెహ్రీక్ ఏ ఇన్సాఫ్ పార్టీ (పీటీఐ) సభ్యులు నినాదాలు చేశారు. షరీఫ్ సోదరుల ప్రమాణ స్వీకారం, రిజిస్టర్లలో సంతకాల అనంతరం 'లాంగ్ లివ్ షరీఫ్' నినాదంతో సభ దద్దరిల్లింది. పాకిస్థాన్ పీపుల్స్ పార్టీ చైర్మన్ బిలావల్ భుట్టో జర్దారీ వర్గీల్లాలని కూడా మద్దతుదారులు నినదించారు. ప్రమాణ స్వీకారం చేసిన వారిలో సున్నీ ఇతేహాద్ కౌన్సిల్ (ఎస్ఐసీ) బ్యానర్ కింద అసెంబ్లీకి చేరిన పీటీఐ నాయకులు బారిస్టర్ గోహర్ ఖాన్, అలీ మహమ్మద్ ఖాన్, ఒమర్ అయూబ్ ఖాన్, షేర్ అఫ్జల్ మర్వత్ కూడా ఉన్నారు. పీఎంఎల్-ఎన్ అధినేత నవాజ్ షరీఫ్ ఏడేళ్ల తర్వాత పార్లమెంటులో అడుగు పెట్టడంతో ఈ సభకు ప్రాధాన్యత ఏర్పడింది. సభ కార్యకలాపాల ప్రారంభానికి ముందు 'ఇమ్రాన్ ఖాన్ జిందాబాద్... వచ్చింది, వచ్చింది పీటీఐ' అంటూ ఎస్ఐసీ సభ్యులు నినదాలు చేశారు. పీటీఐ, ఎస్ఐసీ నినాదాలకు పోటీగా నవాజ్ -షెహబాజ్ వర్గీయులు 'పులి వచ్చింది' అని నినదాలిచ్చారు. 'గడియారం దొంగ' అని ఇమ్రాన్ ఖాన్‌పై తోషాఖానా కేసునుద్దేశించి పీఎంఎల్-ఎన్ సభ్యులు నినాదాలు చేయగా 'పాకిస్థాన్‌ను కాపాడేది ఎవరు? ఇమ్రాన్ ఖాన్. ఇమ్రాన్ ఖాన్' అని ఎస్ఐసీ సభ్యులు ప్రతి నినాదమిచ్చారు. ఇమ్రాన్ ఖాన్‌ను విడుదల చేయాలన్న పోస్టర్లు, బ్యానర్లను కూడా ఎస్ఐసీ సభ్యులు ప్రదర్శించారు.

ఇరాన్ ఉపగ్రహాన్ని నిర్ణీత కక్ష్యకు చేర్చిన రష్యా రాకెట్

మాస్కో: ఇరాన్ ఉపగ్రహాన్ని నిర్ణీత కక్ష్యలోకి రష్యా రాకెట్ గురువారం విజయవంతంగా ప్రవేశపెట్టింది. మాస్కో టెహ్రాన్ మధ్య సాన్నిహిత్యం, సహకారాన్ని మరింత పెంచుకునేలా తాజా ప్రయోగం జరిగింది. సోయుజ్ రాకెట్ ద్వారా ఇరాన్ ఉపగ్రహంతో పాటు 18 రష్యన్ ఉపగ్రహాలను నిర్ణీత కక్ష్యకు చేర్చిందని రష్యా అంతరిక్ష కేంద్రం 'రాస్‌కాస్మోస్ కార్పొరేషన్' ప్రకటించింది. వొటోచ్ని ప్రయోగ కేంద్రం నుంచి ఈ ప్రయోగం జరిగిందని తెలిపింది. కాగా, 110కిలోల బరువుగల ఉపగ్రహాన్ని పర్యావరణం, వ్యవసాయంతో పాటు ఇతరత్ర అవసరాల కోసం ప్రయోగించినట్లు ఇరాన్ తెలిపింది. ఉపగ్రహంలో మూడు కెమెరాలు ఉన్నాయని పేర్కొంది. అధ్యక్షుడు ఇబ్రహీం రైసీ హయాంలో ప్రయోగించిన 12తో కలిపి 23 అంతరిక్ష ప్రయోగాలను ఇరాన్ స్పేస్ ప్రోగ్రామ్ చేపట్టిందని మంత్రి ఈసా జరేపూర్ వెల్లడించారు. 2022లో ఇరాన్‌కు చెందిన ఖయ్యామ్ ఉపగ్రహాన్ని నిర్ణీత కక్ష్యలోకి రష్యా ప్రవేశపెట్టిన విషయం తెలిసిందే.

సోవియట్ మాజీ ప్రధాని నికోలై రిజ్‌కోవ్ మృతి

మాస్కో: సోవియట్ మాజీ ప్రధాని నికోలై రిజ్‌కోవ్ (94) కన్నుమూశారు. రిజ్‌కోవ్ మరణ వార్తను రష్యా పార్లమెంటు ఎగవ సభ స్పీకర్ వలెంటీనా మ్యాట్‌వియెంకో ప్రకటించారు. రాజకీయ కురవృద్ధుడిగా రిజ్‌కోవ్ అక్టోబరు వరకు పార్లమెంటు సభ్యునిగా ఉన్నారు. రిజ్‌కోవ్ ఏ కారణాలతో చనిపోయారన్నది వలెంటీనా తెలుపలేదు. రిజ్‌కోవ్ సోవియట్ ప్రధానిగా ఆర్థిక మాంద్యం నుంచి దేశాన్ని గట్టెక్కించేందుకు తుది వరకు యత్నించారు. తన ఆరేళ్ల పదవీ కాలంలో మైఖెల్ గోర్బచేవ్ ఉదారవాద సంస్కరణల అమలునకు పాటు పడ్డారు. కమ్యూనిస్టు పార్టీ కేంద్ర కమిటీ ఆర్థిక శాఖాధిపతిగానూ సేవలు అందించారు. 1985లో అధికారంలోకి వచ్చిన గోర్బచేవ్...'పెరెస్ట్రోయికా' ఆధునికీకరణ అమలునకు రిజ్‌కోవ్‌ను ఇన్‌చార్జిగా నియమించారు. గోర్బచేవ్ రాజకీయ సంస్కరణలతో కమ్యూనిస్టు పార్టీకి ప్రజాస్వామిక ప్రతిపక్షం ఏర్పాటు కాగలిగింది. పార్లమెంటులో వాడీవేడి చర్చలో భాగంగా తడబాటుకు గురైన క్రమంలో 'క్రైయింగ్ బోల్‌షెవిక్' అంటూ రిజ్‌కోవ్‌ను అనేక మంది ఎద్దేవా చేశారు.

తీవ్రస్థాయిలో విమర్శలను ఆయన ఎదుర్కొన్నారు. అనంతరం గుండెపోటుకు గురైన కారణంగా రిజ్‌కోవ్ 1991 జనవరిలో తన విధుల నుంచి తప్పుకున్నారు. యూఎస్ఎస్ఆర్ ముక్కలైన తర్వాత రాజకీయాలకు దూరమయ్యారు. 1995లో తిరిగి రష్యా రాజకీయాల్లోకి అడుగు పెట్టారు. పార్లమెంటు దిగువ సభకు ఎన్నికై 2003 వరకు సభ్యునిగా ఉన్నారు. ఆ తర్వాత ఎగువ సభకు వెళ్లారు. క్రెమ్లిన్ నియంత్రిత పార్లమెంటులో చాలా మంది సభ్యుల వలే రిజ్‌కోవ్ కూడా పుతిన్ విధానాలకు మద్దతిచ్చారు.

ఆ ఎమ్మెల్యేలపై అనర్హత

(మొదటిపేజీ తరువాయి)

మీడియా సమావేశంలో పేర్కొన్నారు. ఈ ఆరుగురు ఎమ్మెల్యేలపై అనర్హత వేటు తక్షణమే అమల్లోకి వస్తుందని చెప్పారు. స్పీకర్ నిర్ణయంతో హిమాచల్ లో బీజేపీ సృష్టించిన రాజకీయ సంక్షోభానికి తెరపడినట్లయింది. కాగా అనర్హత వేటుపడ్డ ఎమ్మెల్యేలందరూ హైకోర్టు లేదా సుప్రీంకోర్టును ఆశ్రయించే అవకాశాలు కనిపిస్తున్నాయి. గురువారం ఉదయం ముఖ్యమంత్రి సుఖ్‌వీందర్ సింగ్ సుఖు తన అధికార నివాసంలో ఎమ్మెల్యేలతో అల్పాహార సమావేశం నిర్వహించారు. 'ఇది కేవలం అందరం కలవడం కోసమే...సమావేశంలో ఏం జరుగుతుందనేది చూద్దాం' అని సమావేశానికి ముందు షిమ్లా అర్బన్ ఎమ్మెల్యే హరిష్ జనార్థా వ్యాఖ్యానించారు. ప్రభుత్వం స్థిరంగా ఉందని, పూర్తి కాలం కొనసాగుతుందని పలువురు ఎమ్మెల్యేలు పేర్కొన్నారు. కాగా ఈ సమావేశం కొనసాగుతుండగానే ఆరుగురు ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేసినట్లు స్పీకర్ ప్రకటించడం గమనార్హం.

బీజేపీ విఫలయత్నం

హిమాచల్‌ప్రదేశ్‌లో మంగళవారం జరిగిన రాజ్యసభ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి హర్ష్ మహాజన్‌కు అనుకూలంగా ఈ ఆరుగురు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు క్రాస్ ఓటింగ్ చేశారు. అనంతరం ఆ రాష్ట్ర అసెంబ్లీలో బడ్జెట్‌పై ఓటింగ్‌కు వీరు దూరంగా ఉన్నారు. క్రాస్ ఓటింగ్ నేపథ్యంలో కాంగ్రెస్‌పై అవిశ్వాస తీర్మానం చేపట్టాలని ఆ రాష్ట్ర గవర్నర్ శివ్ ప్రతాప్ శుక్లాను కలిసిన బీజేపీ నేతలు అసెంబ్లీలో బడ్జెట్ ఆమోదం పొందకుండా చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. సభలో నినాదాలు చేసిన 15 మంది బీజేపీ ఎమ్మెల్యేలను పఠానియా సస్పెండ్ చేశారు. అనంతరం వాయిస్ ఓటింగ్ ద్వారా ఆర్థిక బిల్లును సభ ఆమోదించింది. ఆ తర్వాత సభను స్పీకర్ నిరవధికంగా వాయిదా వేశారు. ఆరుగురు ఎమ్మెల్యేలపై అనర్హత వేటు తర్వాత హిమాచల్ ప్రదేశ్ అసెంబ్లీ బలం 68 నుంచి 62కి తగ్గింది. మెజారిటీ సంఖ్య కూడా 35 నుంచి 32 తగ్గింది. ప్రస్తుతం 34 మంది ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌తో ఉన్నారు.

పరిస్థితి పూర్తిగా అదుపులో ఉంది: కాంగ్రెస్

హిమాచల్ ప్రదేశ్‌లో పరిస్థితి పూర్తిగా అదుపులో ఉందని, ప్రజలచేత ఎన్నుకోబడ్డ ప్రభుత్వాన్ని అస్థిరపరిచే ప్రయత్నంలో బీజేపీ విఫలమైందని కాంగ్రెస్ పార్టీ స్పష్టం చేసింది. కొంతమంది ఎమ్మెల్యేలు బీజేపీ ప్రలోభాలకు లొంగిపోయి క్రాస్ ఓటింగ్ పాల్పడటంతో సంఖ్యాబలం ఉన్నప్పటికీ ఏకైక రాజ్యసభ సీటును అధికార కాంగ్రెస్ కోల్పోవాల్సి వచ్చిందని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి (కమ్యూనికేషన్స్) జైరామ్ రమేశ్ పేర్కొన్నారు. క్రాస్ ఓటింగ్ చేసిన ఆరుగురు ఎమ్మెల్యేలను స్పీకర్ అనర్హులుగా ప్రకటించారన్నారు. ఇతర రాష్ట్రాల్లో మాదిరిగానే బీజేపీ ధనబలం, అధికార బలంతో ఆట ప్రారంభించిందని అన్నారు. అయితే హిమాచల్ ప్రదేశ్‌లో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని అస్థిరపరిచేందుకు ఆ పార్టీ చేసిన యత్నం విఫలమైందని తెలిపారు.

నేటి నుంచి ఇంటర్ పరీక్షలు

(మొదటిపేజీ తరువాయి)

ఇటీవల పరీక్షల నిర్వహణపై అన్ని జిల్లాల కలెక్టర్లతో విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ సమీక్షా సమావేశం నిర్వహించారు. పరీక్షల నిర్వహణకు సంబంధించిన విధివిధానాలు, అధికారులు సమన్వయంగా పని చేస్తూ పరీక్షలు ప్రశాంతంగా నిర్వహించాలని సూచించారు. పరీక్ష కేంద్రాల్లో సీసీ కెమెరాలు, మంచి నీరు, ప్రథమ చికిత్స వంటి సౌకర్యాల ఏర్పాట్లు చేపట్టారు. ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సర పరీక్షలకు వేర్వేరుగా షెడ్యూలు జారీజేశారు. ఒకటో తేదీ నుంచి 19 వరకు ఇంటర్ ప్రథమ సంవత్సర జనరల్, ఒకేషనల్ పరీక్షలు జరుగుతాయి. రెండో తేదీ నుంచి 20 వరకు ఇంటర్ ద్వితీయ సంవత్సర జనరల్, ఒకేషనల్ పరీక్షలు కొనసాగుతాయి. ప్రథమ సంవత్సర పరీక్షలను ప్రతిరోజూ ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంట వరకు నిర్వహిస్తారు. ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలు పూర్తయ్యాయి. ఏపీ టెట్ పరీక్షలు ప్రారంభమయ్యాయి. 15 నుంచి డీఎస్సీ పరీక్షల షెడ్యూలు కొనసాగుతుంది. 18 నుంచి టెన్త్ పరీక్షలు ప్రారంభమవుతాయి. విద్యాశాఖ యంత్రాంగం పరీక్షల నిర్వహణపై సన్నద్ధమైంది.

గుర్మీత్‌కు పెరోల్ ఇవ్వొద్దు
హర్యానా ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం

చండీగఢ్: అత్యాచారం కేసులో జైలు శిక్ష అనుభవిస్తున్న డేరా సచ్చా సౌదా చీఫ్ గుర్మీత్ రామ్ రహీమ్‌కు పదే పదే పెరోల్ మంజూరు చేయడంపై పంజాబ్-హర్యానా హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. ఇకపై కోర్టు అనుమతి లేకుండా ఆయనకు పెరోల్ మంజూరు చేయవద్దని హర్యానా ప్రభుత్వాన్ని ఆదేశించింది. అత్యాచారం కేసులో 20 ఏళ్ల జైలు శిక్ష పడిన గుర్మీత్ రామ్ రహీమ్ ఇప్పటి వరకు పెరోల్‌పై 91 రోజుల పాటు జైలు బయట గడిపారు. గత నాలుగేళ్లలో తొమ్మిదిసార్లు ఆయనకు పెరోల్ మంజూరు చేశారు. ఈ ఏడాదిలో ఏకంగా 50 రోజులు పెరోల్‌పై జైలు నుంచి బయటకు వచ్చారు. గత పది నెలల్లో ఇది ఏడవ పెరోల్. కాగా, గుర్మీత్ రామ్ రహీమ్‌కు హర్యానా ప్రభుత్వం అడిగినప్పుడల్లా పెరోల్ మంజూరు చేయడం, ఎన్నికల సమయంలో ఎక్కువగా జైలు నుంచి ఆయన బయటకు రావడంపై పంజాబ్-హర్యానా హైకోర్టులో ఎస్‌జీపీసీ పిటిషన్ దాఖలు చేసింది. దీనిపై విచారణ జరిపిన కోర్టు... తాజా పెరోల్ గడువు ముగిసే మార్చి 10న గుర్మీత్ లొంగిపోయేలా చూడాలని హర్యానా ప్రభుత్వాన్ని ఆదేశించింది.

బీజేపీ కుయుక్తులు

(మొదటిపేజీ తరువాయి)

తూతూమంత్రంగా డీఎస్సీ, గ్రూపు 1, గ్రూపు 2 పోస్టులు ప్రకటిస్తున్నారని చెప్పారు. రాష్ట్రంలో 7 లక్షల మంది డీఎస్సీ రాసేందుకు సన్నద్ధం అయ్యారని అనేక మంది శిక్షణ కూడా తీసుకున్నారని చెప్పారు. అయితే ప్రభుత్వం కేవలం 6,100 పోస్టుల భర్తీ కోసం నోటిఫికేషన్ ఇచ్చి నిరుద్యోగ యువతను మోసం చేసిందని విమర్శించారు. సాక్షాత్తు ఏపీపీఎస్సీ చైర్మన్ గౌతమ్ సవాంగ్ గ్రూపు 1, గ్రూపు 2 పరీక్షలను శాస్త్రీయంగా, సమర్థవంతంగా నిర్వహిస్తామని సాక్షి పేపర్‌లో ప్రకటించారని తెలిపారు. సాక్షి పేపర్ ప్రభుత్వ డబ్బులతో నడుస్తోందన్నారు. దీంతో 1,48,880 మంది అభ్యర్థులు సవాంగ్ ప్రకటన మేరకు కొత్త సిలబస్‌తో పరీక్షకు సిద్ధమయ్యారని చెప్పారు. ఇప్పుడు పాత సిలబస్ ప్రకారం గ్రూపు1 పరీక్ష నిర్వహిస్తున్నట్లు ఏపీపీఎస్సీ ప్రకటించటంపై సందేహం వెలిబుచ్చారు. ప్రభుత్వం తన అనుయాయులకు పాత పద్ధతిలో పరీక్ష ఉంటుందని ముందే చెప్పి ఆ విషయాన్ని పరీక్షలకు ముందు ప్రకటించి కుట్రలకు పాల్పడుతోందని విమర్శించారు. గ్రూపు-1 పరీక్ష నిర్వహణలో మోసం, దగా ఉందన్నారు. ఈ అంశంపై ప్రభుత్వం, ఏపీపీఎస్సీ చైర్మన్ వివరణ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఒకవేళ పాత సిలబస్ ప్రకారం గ్రూపు-1 నిర్వహించాలనుకుంటే పరీక్షకు మరో మూడు నెలలు సమయం ఇవ్వాలని డిమాండ్ చేశారు. సీఎం జగన్ రైతుల ఖాతాల్లో డబ్బు జమ చేస్తున్నట్లు ప్రచారార్భాటం చేశారని విమర్శించారు.

రాష్ట్ర వ్యాప్తంగా రైతులకు వడ్డీ చెల్లింపు కింద రూ.3వేల కోట్లు జమ చేయాల్సి ఉంటే...కేవలం 20శాతం మందికే డబ్బు వేశారని...ప్రచారం మాత్రం వంద శాతం చేశారని ధ్వజమెత్తారు. మిగిలిన 80 శాతం మంది రైతులు బ్యాంకులకు వెళ్లి డబ్బులు జమ కాలేదని నివ్వెరపోయారని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం రైతులందరికీ లబ్ధి చేకూరేలా డబ్బులు జమ చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం విలేకర్ల ప్రశ్నలకు సమాధానం ఇస్తూ... కాంగ్రెస్, సీపీఐ, సీపీఎం కలిసి ఎన్నికల్లో పోటీ చేయాలని నిర్ణయించుకోవటం జరిగిందన్నారు. మార్చి మొదటి వారంలో పొత్తులు, సీట్లపై స్పష్టత ఇవ్వటం జరుగుతుందన్నారు. రాష్ట్ర విభజనకు కాంగ్రెస్ పార్టీ ఒక్కటే కారణం కాదన్నారు. సీపీఎం తప్ప అన్ని పార్టీలు విభజనకు అనుకూలంగా వ్యవహరించాయని గుర్తు చేశారు. తెలుగుదేశం పార్టీ విభజనకు అనుకూలంగా రాతపూర్వకంగా లేఖ ఇచ్చిన తరువాత విభజన ప్రక్రియ వేగవంతం అయిందన్నారు. పార్లమెంట్‌లో ప్రతిపక్ష బీజేపీ మద్దతుతోనే రాష్ట్ర విభజన జరిగిందన్నారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా, విభజన హామీలు అమలు, రాజధాని నిర్మాణం , పోలవరం ప్రాజెక్టు తదితర రాష్ట్ర సమస్యలపై అజెండా రూపొందించుకుని ఎన్నికలకు వెళ్లనున్నట్లు చెప్పారు. వైఎస్.షర్మిల కాంగ్రెస్ పార్టీలో చేరటానికి సీఎం జగన్‌మోహన్‌రెడ్డే కారణం అన్నారు. వైసీపీని అధికారంలోకి తీసుకురావటానికి మూడువేల కిలోమీటర్లకు పైగా పాదయాత్ర చేసిన షర్మిలకు ఆ పార్టీ సరైన ప్రాధాన్యత ఇవ్వలేదన్నారు. ఈ సమావేశంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జల్లి విల్సన్, అక్కినేని వనజ పాల్గొన్నారు.

ఈసారి అధికారం 'ఇండియా'దే

(మొదటిపేజీ తరువాయి)

నుంచి కొత్త హామీలు గుప్పిస్తోందని ఎద్దేవా చేశారు. బీజేపీ మాటల్లో గొప్ప చేతల్లో కాదని ప్రజలు గ్రహించారన్నారు. 'భిన్నత్వంలో ఏకత్వానికి భారత్ ప్రతీక. ఇలాంటి దేశంలో భిన్న ఆలోచనలు సహజం. భిన్న ఆలోచనలు సమ్మిళితమై ఇండియా కూటమిగా రాణించగలం' అని విశ్వం అన్నారు. కూటమిలో పటిష్ఠ, న్యాయమైన స్వరం అవసరమన్న దృష్ట్యా లెఫ్ట్‌పార్టీలు కలిసి వచ్చాయని చెప్పారు. సార్వత్రిక ఎన్నికలప్పుడు కాంగ్రెస్ ఎంపీలు పిల్లిమొగ్గలు వేసే అవకాశం లేకపోలేదన్నారు. బీజేపీ అతిపెద్ద పార్టీగా అవతరించి, హంగ్ ప్రభుత్వం ఏర్పాటు కావచ్చన్నారు. కేరళ, వాయనాడ్ నుంచి రాహుల్ గాంధీని పోటీ చేయించడం వ్యూహాత్మక తప్పిదమని కాంగ్రెస్ పార్టీని విమర్శించారు. కాంగ్రెస్‌కు నిజమైన ప్రత్యర్థి బీజేపీనా లేక లెఫ్ట్ పార్టీలా అన్నది తేల్చాలన్నారు. 'దేశంలో ఎక్కడ నుంచైనా రాహుల్ పోటీ చేయొచ్చు కానీ వాయనాడ్ నుంచి పోటీ కోసం ఒత్తిడి చేస్తున్న నాయకులు... వారి పోరాటానికి ప్రధాన బరి ఏదో తేల్చాలి. పార్లమెంటుకు 200 మంది ఎంపీలను బీజేపీ నుంచి పంపించే ఉత్తర భారతమా లేక కేవలం 20 స్థానాలు ఉండి బీజేపీ ఒక్కటి గెలవలేని కేరళ రాష్ట్రమా? అన్నది స్పష్టంచేయాలి' అని విశ్వం అన్నారు. వాయనాడ్ ప్రజలకు వారి ఎంపీ అందుబాటులో లేకుండా పోయారని, అందుకు కారణం ఆయన అవసరం జాతీయ స్థాయిలో ఎక్కువగా ఉండటమేనని చెప్పారు.

అలాంటి వ్యక్తిని వాయనాడ్ నుంచి పోటీకి బలవంతం చేయడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. కేరళలోని సీపీఎం-ఎల్డీఎఫ్ ప్రభుత్వంలో సీపీఐ కీలక భాగస్వామి అని వినయ్ విశ్వం చెప్పారు. ఎల్డీఎఫ్‌పై ఆరోపణలు కొత్తేమీ కాదని, వాటిని విజయవంతంగా ఎల్డీఎఫ్ అధిగమించగలదన్నారు. ఎల్డీఎఫ్ నిజాయితీ ప్రజలకు తెలుసునని, దానికి అండగా నిలుస్తారన్నారు. కేరళలో రెండంకెల విజయాన్ని బీజేపీ నమోదు చేస్తుందని ప్రధాని మోదీ హాస్యం పడించారని ఎద్దేవా చేశారు. కేరళలో బీజేపీ రెండంకెల విజయం సాధిస్తుందనడం హాస్యాస్పదమని, అదే జరిగితే కేరళలో కాకి తలకిందులుగా ఎగురుతుందని వినయ్ విశ్వం వ్యంగ్యంగా అన్నారు.

సంక్షేమ బోర్డు కాపాడుకోగలం

(మొదటిపేజీ తరువాయి)

మేనిఫెస్టోల్లో పొందుపర్చాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ విజయవాడ నగర ప్రధాన కార్యదర్శి మూలి సాంబశివరావు, నగర అధ్యక్షులు కేఆర్ ఆంజనేయులు, బిల్డింగ్ అండ్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ నాయకులు సీహెచ్‌వీ రమణ, ఎల్.శివకుమార్, రామస్వామి, ప్రభుదాసు, కోటేశ్వరరావు, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

గుంటూరులో...

భవన నిర్మాణ కార్మిక సంఘం ఆధ్వర్యంలో గుంటూరు కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు ఆకిటి అరుణ్‌కుమార్ అధ్యక్షతన జరిగిన ధర్నాలో భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు పుప్పాల సత్యనారాయణ, ఏఐటీయూసీ రాష్ట్ర గౌరవాధ్యక్షులు వెలుగూరి రాధాకృష్ణమూర్తి, పాల్గొని ప్రసంగించారు. రాష్ట్రంలోని జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం పవర్ ఫైనాన్స్ పేరుతో భవన నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డులో ఉన్న నిధులను దారిమళ్లించి నవరత్నాలకు వాడుకుంటోందని విమర్శించారు. కార్మికుల సంక్షేమం కోసం సభ్యత్వ రూపంలో, యజమాని నుంచి సెస్ రూపంలో వసూలు చేసిన కోట్ల రూపాయాల నిధులను కార్మికవర్గ సంక్షేమానికి ఖర్చు పెట్టాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం భవన నిర్మాణ సంక్షేమ బోర్డును పునరుద్ధించాలని, లేనిపక్షంలో ఎనికల్లో బుద్ధి చెబుతామని హెచ్చరించారు. ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి మేడా హనుమంతరావు మాట్లాడుతూ 55 సంవత్సరాలు నిండిన కార్మికులకు రూ.5 వేలు పెన్షన్ మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆరేటి రామారావు, కాయల రామారావు, కప్పల శివ, ప్రవీణ్, బొట్టు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

భీమవరంలో...

భీమవరంలోని పశ్చిమగోదావరి జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద భవన నిర్మాణ కార్మికులు ధర్నా నిర్వహించారు. ఏఐటీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డి.సోమసుందర్, జిల్లా అధ్యక్షుడు కోనాల భీమారావు మాట్లాడుతూ... భవన కార్మికుల సంక్షేమ బోర్డులో పెండింగ్‌లో ఉన్న దాదాపు నలభై వేల క్లెయిమ్‌లను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. మాట్లాడుతూ భవననిర్మాణ కార్మికుల పేరుతో వసూలు చేసిన వెల్ఫేర్ బోర్డు నిధులను దారి మళ్ళించే అధికారం ప్రభుత్వానికి ఎవరిచ్చా రని ప్రశ్నించారు. కార్మికుల ప్రమాద మరణానికి, సహజ మరణానికి, వివాహానికి, ప్రసూతికి, పిల్లల చదువులకు ఇవ్వాల్సిన నిధులను ప్రభుత్వం వాడుకోవడం దుర్మార్గమన్నారు. ఏఐటీయూసీ భీమవరం ఏరియా కార్యదర్శి చెల్లబోయిన రంగారావు, భవననిర్మాణ కార్మికసంఘం జిల్లా కార్యదర్శి బొల్లాడ నాగరాజు జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి పోలిరాతి ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఒంగోలులో...

ఒంగోలులో కర్నూలు రోడ్డు ఫ్లై ఓవర్ వద్ద భవన నిర్మాణ కార్మికులు పెద్ద ఎత్తున నిరసన ధర్నా నిర్వహించారు. ఏఐటీయూసీ జిల్లా గౌరవాధ్యక్షులు ఎస్‌డి సర్దార్ మాట్లాడుతూ దేశంలో అన్ని రాష్ట్రాల్లో భవన నిర్మాణ కార్మికులు సంక్షేమ బోర్డుద్వారా అనేక సౌకర్యాలు పొందుతుంటే మన రాష్ట్ర ప్రభుత్వం భవన నిర్మాణ కార్మికులకు బోర్డు లో ఉన్న ఏ ఒక్క పథకాన్ని కూడా అమలుపరచడం లేదన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి భవన నిర్మాణ కార్మికుల నోట్లో మట్టి కొట్టి సంక్షేమ బోర్డులో డబ్బులు మొత్తం నవరత్నాల పథకాలకు మళ్ళించుకోవడం దుర్మార్గమన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ బోర్డును పునరుద్ధరించి సంక్షేమ పథకాలు అమలు చేయాలని కోరారు. ఏపీ భవన నిర్మాణ కార్మికుల సంఘం జిల్లా కార్యదర్శి బూదూరి హరికృష్ణ మాట్లాడుతూ... భవన నిర్మాణ కార్మికులు రిజిస్ట్రేషన్ ఫీజు ద్వారా దాదాపు 250 కోట్లకు పైగా చెల్లించారని... దాదాపు ప్రకాశం జిల్లాలో పదివేలకు పైగా పెండింగ్ క్లెయిమ్స్ నిలిచిపోవడం వల్ల కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని మండిపడ్డారు. సంక్షేమ బోర్డును పునరుద్ధరించకపోతే రాష్ట్ర ప్రభుత్వం కార్మికుల వ్యతిరేకతను చవిచూడవలసి వస్తుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయుసి జిల్లా నాయకులు పీవీఆర్ చౌదరి, వెంకటేశ్వర్లు, లక్ష్మయ్య, శ్రీను, సుబ్బారావు, ఎస్‌కే బాషా, బాలాజీ, బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

డిమాండ్ల సాధనపై వెనక్కి తగ్గం

(మొదటిపేజీ తరువాయి)

ప్రభుత్వ ఉద్యోగమిస్తామని తెలిపారు. శుభకరణ్ కేసులో జీరో ఎఫ్ఐఆర్ నమోదైందని పంజాబ్ ఐజీ సుఖ్‌చెయిన్ సింగ్ వెల్లడించారు. పాటియాలాలోని పట్రన్ పోలీసు స్టేషన్‌లో హత్య కేసును నమోదు చేశారు. దీంతో బుధవారం రాత్రి శుభకరణ్ సింగ్ భౌతికకాయానికి పోస్టుమార్టం జరిగింది. ఎఫ్ఐఆర్ నమోదు చేసిన తర్వాతే పోస్టుమార్టం నిర్వహించేందుకు అంగీకరిస్తామని రైతులు ఇంతకుముందే తేల్చిచెప్పారు. శుభకరణ్ సింగ్ అంత్యక్రియలు గురువారం భటిండా జిల్లాలోని బల్లో గ్రామంలోగల రామ్‌పురా ఫుల్‌లో ముగిశాయి. ఎస్‌కేఎం, కేఎంఎం నాయకుల సమక్షంలో అంతిమ సంస్కారాలు జరిగాయి. తొలుత పాటియాలాలోని రాజింద్రా మెడికల్ ఆసుపత్రి నుంచి శుభకరణ్ భౌతికకాయాన్ని ఖనౌరి సరిహద్దుకు తీసుకెళ్లగా రైతులు కన్నీటి వీడ్కోలు పలికారు. భౌతికకాయంపై రైతు సంఘాల జెండాలు కప్పి నివాళు లర్పించారు.

అంబులెన్స్ వెంట కొద్ది దూరం నడిచారు. శుభకరణ్ మరణానికి బాధ్యులైన వారిపై కఠిన చర్యలకు డిమాండ్ చేశారు. అనంతరం భటిండాలోని బల్లో గ్రామంలో శుభకరణ్ సింగ్ అంత్యక్రియలు నిర్వహించారు. ఈనెల 21న పంజాబ్-హర్యానా 'ఖనౌరి' సరిహద్దు వద్ద పోలీసులు పేల్చిన తూటా తలకు తగిలి శుభకరణ్ సింగ్ చనిపోయారు. రైతుల డిమాండ్ క్రమంలో తొమ్మిది రోజుల తర్వాత జీరో ఎఫ్ఐఆర్‌ను పంజాబ్ పోలీసులు దాఖలు చేశారు. ఐపీసీలోని 302 సెక్షన్ కింద హత్యారోపణలు నమోదయ్యాయి.

పాస్‌పోర్టు-వీసాలు రద్దు చేస్తాం: హర్యానా పోలీసుల హెచ్చరిక

ఆందోళనల్లో పాల్గొనే క్రమంలో జరిగే నష్టానికి మూల్యం చెల్లించాలని, ఇందుకోసం రైతుల ఆస్తులు జప్తు చేస్తామని ఇటీవల ప్రకటించిన హర్యానా పోలీసులు తాజాగా నిరసనకారుల వీసాలు రద్దు చేస్తామని, పాస్‌పోర్టులు స్వాధీన పర్చుకుంటామని హెచ్చరించారు. పంజాబ్ నుంచి హర్యానాకు వచ్చి హింసలో పాల్గొంటే సీసీటీవీ ఫుటేజీ, డ్రోన్ కెమెరాల ఆధారంగా గుర్తించి, వారి ఫొటోలు, పేరు, చిరునామాను పాస్‌పోర్టు కార్యాలయాలకు పంపుతామని బెదిరించారు. తాజా పరిణామంపై విదేశీ వ్యవహారాల శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైశ్వాల్‌ను విలేకరులు ప్రశ్నించగా 'అన్ని పాస్‌పోర్టు లేక వీసా వ్యవహారాలు నిబంధనావళి ప్రకారం జరుగుతాయి. సంబంధిత నిబంధనలు, మార్గదర్శకాలు, చట్టాలను ఉల్లంఘించినట్లు రుజువైతే వాటిని రద్దు చేసేందుకు అవకాశం ఉంటుంది' అని చెప్పారు. బీకేయూ (ఎస్‌బీఎస్) నేత ఒకరు స్పందిస్తూ 'ఆందోళనకారుల పాస్‌పోర్టులు స్వాధీనం చేసుకుంటామని, వీసాలు రద్దు చేస్తామని హర్యానా పోలీసులు బెదిరిస్తున్నారు. పంజాబ్ ప్రభుత్వానికి తెలిసే ఇదంతా జరుగుతుందా అన్న అనుమానం కలుగుతుంది' అని అన్నారు. దిల్లీ చలోను నీరుగార్చే విధంగా రైతులను భయపెట్టే ప్రయత్నం ఆక్షేపణీయమని కొందరు రైతు నేతలు, సానుభూతిపరులు అన్నారు. 'దిల్లీ చలో' పోరు ఉధృతం కాగలదనే దానిని నీరుగార్చేందుకు ప్రయత్నిస్తున్నారని, ఇప్పటికే ఆరుగురు అన్నదాతలు అమరులయ్యారని, వారి త్యాగాలను వృథా కానివ్వబోమని నాయకులు తేల్చిచెప్పారు.

మేనిఫెస్టోపై వైసీపీ కసరత్తు

(మొదటిపేజీ తరువాయి)

మేనిఫెస్టో ఉండేలా దృష్టి పెట్టారు. టీడీపీ, జనసేన కూటమికి ధీటుగా మేనిఫెస్టోను ప్రకటించనుంది. జాతీయ రాజకీయ పార్టీలైన కాంగ్రెస్, బీజేపీ ప్రకటించబోయే హామీలను వైసీపీ పరిగణలోకి తీసుకోనుంది. ప్రధానంగా మహిళలు, యువత, రైతులను ఆకట్టుకునేలా మేనిఫెస్టోలో అదనపు అంశాలను చేరుస్తారని సమాచారం. ప్రస్తుతం అమలు చేస్తున్న మేనిఫెస్టోలోని నవరత్నాలతోపాటు మరిన్ని పథకాలపై చర్చించినట్లు తెలిసింది.

ఎన్నికల షెడ్యూల్ రాకముందే వీలైనంత వరకు మేనిఫెస్టోను ప్రకటించేలా వైసీపీ నిమగ్నమైంది. రైతులు, యువత, మహిళల కోసం కొత్త పథకాలను ప్రవేశపెట్టే ఆలోచనలో ఉంది. రైతు, డ్వాక్రా రుణమాఫీ తదితర అంశాలపై మేనిఫెస్టోలో పెట్టే అంశంపై వైసీపీ కసరత్తు చేస్తోంది. ఇప్పుడున్న డీబీటీతోపాటు అదనంగా మరికొన్ని సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టే యోచనలో ఉంది. ఉన్న పథకాలతోపాటు కొత్తవాటిని ప్రవేశపెడితే, రాష్ట్రంపై పడే ఆర్థిక భారం, సాధ్యాసాధ్యాలు తదితర అంశాలపై చర్చించారు.

2019 మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను 99 శాతం అమలు చేశామని సీఎం జగన్ పదేపదే చెబుతున్నారు... ప్రధానంగా నవరత్నాల పేరుతో అనేక సంక్షేమ పథకాలను అందజేశామని, వాటిని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని పార్టీ శ్రేణులకు ఆయన పిలుపునిస్తున్నారు. మూడు విడతలుగా జరిగిన సిద్ధం సభల్లోనూ ఇవే అంశాల్ని ప్రస్తావించారు. ఇటీవల మంగళగిరిలో పార్టీ శ్రేణులతో నిర్వహించిన సమావేశంలోనూ వారికి మేనిఫెస్టోలో అమలు చేసిన అంశాలపై దిశానిర్దేశం చేశారు.

గత మేనిఫెస్టో అమలులో ప్రభుత్వానికి ఎక్కడా నిధులకు ధోకా రాలేదు. అప్పులు చేసైనా సరే కొనసాగించారు. ఆర్థికశాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి నిత్యం కేంద్రానికి వెళ్తూ, కొత్త అప్పుల కోసం ప్రయత్నించారు. కేంద్రం నుంచి రాష్ట్రానికి వచ్చిన నిధులన్నిటినీ సంక్షేమ పథకాలకే ఖర్చు చేశారని, అభివృద్ధిని విస్మరించారని ప్రతిపక్షాలు దుమ్మెత్తిపోస్తున్నాయి. రాబోయే మేనిఫెస్టోల్లో ఒక్క సంక్షేమమే ఉంటుందా... దానికితోడు రాష్ట్రాభివృద్ధికి అవసరమైన కీలక అంశాలను జోడిస్తారా అనేదీ స్పష్టం కావాల్సి ఉంది.

భారీ భద్రత నడుమ...

'టూరిజం గెస్ట్ హౌస్' ప్రారంభం

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: రుషికొండను బోడికొండ చేసి తీవ్ర ఆంక్షలు నడుము నిర్మించిన భవనాలకు హడావుడిగా, గుట్టుచప్పుడు కాకుండా భారీ భద్రత నడుమ మంత్రులచే గురువారం ప్రారంభోత్సవం జరిపించారు. రుషికొండపై హరిత రిసార్ట్ స్థానంలో అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో ఏపీటీడీసీ నిర్మించిన ఏడు బ్లాక్‌లను శారదా పీఠం పీఠాధిపతి స్వరూప నందేంద్ర స్వామితో కలిసి రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి ఆర్.కె.రోజా, రాష్ట్ర పరిశ్రమలు, ఐటీ శాఖ మంత్రి గుడివాడ అమర్నాథ్, రాజ్యసభ సభ్యుడు వై.వి. సుబ్బారెడ్డి ప్రారంభోత్సవం చేశారు. మీడియాకు కూడా అనుమతి లేకపోవడం విశేషం. రూ.450 కోట్ల వ్యయంతో సీఎం క్యాంప్ కార్యాలయం పేరిట హడావిడి చేసి నిర్మించిన వైసీపీ ప్రభుత్వం చివరకు టూరిజం గెస్ట్ హౌస్ పేరుతో ప్రారంభోత్సవం చేయాల్సి వచ్చింది.

వినియోగంపై సీఎందే తుది నిర్ణయం

రుషికొండపై నిర్మించిన భవనాలను ఏవిధంగా వినియోగించాలన్న అంశంపై త్వరలోనే సీఎం జగన్ నిర్ణయం తీసుకుంటారని మంత్రి గుడివాడ అమర్నాథ్ వెల్లడించారు. 9.88 ఎకరాల్లో టూరిజం ప్రాజెక్టు నిర్మించామని, గతంలో ఈ ప్రాంతంలో ఉన్న హరిత రిసార్ట్స్‌స్థానే ఈ నిర్మాణాలు జరిగాయని తెలిపారు. అత్యంత సుందరమైన విశాఖ నగరానికి తగ్గట్టుగా అంతర్జాతీయ నాణ్యత ప్రమాణాలతో ఈ నిర్మాణాలు జరిగాయని చెప్పారు. పర్యాటకంగా విశాఖను తీర్చిదిద్దడంలో భాగంగా ఈ భవనాలు రూపుదిద్దుకున్నాయని మంత్రి వివరించారు. ఈ భవన నిర్మాణాలకు ప్రతిపక్ష పార్టీలన్నీ అనేక అడ్డంకులు కల్పించాయనీ, కుట్రలు పన్నాయని, వాటన్నింటినీ దాటుకుంటూ ప్రాజెక్ట్ ను పూర్తిస్థాయి అనుమతులతో పూర్తి చేశామని చెప్పారు. విశాఖపట్నం రాజధానిగా చేయాలని సంకల్పించిన సీఎం జగన్ ఈ విషయమై ఇప్పటికే ముగ్గురు సీనియర్ ఐఏఎస్ అధికారులతో కమిటీని ఏర్పాటు చేశారని, ఈ భవనాలను పూర్తిగా పర్యాటకం కోసం వినియోగించాలా లేదా ముఖ్యమంత్రి కార్యాలయంగా ఉపయోగించాలా అన్న అంశంపై త్వరలోనే స్పష్టత వస్తుందని మంత్రి తెలియజేశారు. ఏపీటీడీసీ చైర్మన్ ఎ.వరప్రసాద రెడ్డి, జడ్పీ చైర్‌పర్సన్ జల్లేపల్లి సుభద్ర, ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ, శాసనమండలి సభ్యులు వరుదు కళ్యాణి, కె.రవిబాబు, శాసనసభ్యులు ముత్తంశెట్టి శ్రీనివాసరావు, రాష్ట్ర పర్యాటకశాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి రజత్ భార్గవ, మేనేజింగ్ డైరెక్టర్ కె.కన్నబాబు, జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్, పర్యాటక శాఖ ఆర్‌డీ శ్రీనివాస్, లొడగల అప్పారావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

వైసీపీలోకి సీనియర్ ఐఏఎస్ అధికారి ఇంతియాజ్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఏపీలో సీనియర్ ఐఏఎస్ అధికారిగా పనిచేసిన ఎండీ ఇంతియాజ్ వైసీపీలో చేరారు. తాడేపల్లి క్యాంపు కార్యాలయంలో గురువారం సీఎం జగన్ ఆయనకు పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ఈనెల 28న ఆయన ఐఏఎస్ పదవికి స్వచ్ఛంద పదవీ విరమణ చేశారు. కర్నూలు జిల్లాకు చెందిన ఇంతియాజ్ సెర్ప్ సీఈవోగా, మైనార్టీ సంక్షేమ శాఖ కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహించారు. అంతకు ముందు ఉమ్మడి కృష్ణాజిల్లా కలెక్టరుగా పనిచేశారు. ఇంతియాజ్‌కు కర్నూలు ఎమ్మెల్యే టికెట్ దాదాపు ఖరారైనట్లు సమాచారం. అధిష్ఠానం అధికారికంగా ప్రకటించాల్సి ఉంది. వైసీపీ రీజనల్ కో ఆర్డినేటర్ రామసుబ్బారెడ్డి, కర్నూలు ఎమ్మెల్యే హాఫీజ్ ఖాన్, కర్నూలు మేయర్ బీవై రామయ్య, మాజీ ఎమ్మెల్యే ఎస్వీ మోహన్‌రెడ్డి పాల్గొన్నారు. ఇంతియాజ్ మీడియాతో మాట్లాడుతూజగన్ ప్రభుత్వం అసమానతలు లేని సమాజం కోసం కృషి చేస్తోందన్నారు. తన రాజకీయ ప్రస్తానంలో అందరి సహకారం, మద్దతు లభిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

5న విజయవాడలో 30 గంటల నిరాహార దీక్ష

- వీఆర్ఏలకు వేతనం పెంచకపోవడం దుర్మార్గం
- భరోసా ఇచ్చి సమస్యలు పరిష్కరించని అధికారులు, మంత్రులు
- హామీ విస్మరించిన జగన్: ఈశ్వరయ్య

విశాలాంధ్ర-కడప రూరల్: గ్రామ రెవెన్యూ సహాయకుల (వీఆర్ఏ) దీర్ఘకాలిక సమస్యలు పరిష్కరించాలని, ముఖ్యమంత్రి ఇచ్చిన హామీలు నెరవేర్చాలని వీఆర్ఏల సంక్షేమ సేవా సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు గుజ్జుల ఈశ్వరయ్య డిమాండ్ చేశారు. స్థానిక హోచ్ మెన్ భవన్‌లో సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బాణాల శ్రీనివాసులు అధ్యక్షతన రాష్ట్ర సమితి సమావేశం జరిగింది. గుజ్జుల మాట్లాడుతూ, మార్చి ఐదో తేదీన విజయవాడ ధర్నా చౌక్ వద్ద వీఆర్ఏలు తమ కుటుంబ సభ్యులతో కలిసి ఉదయం 10 గంటల నుంచి 30 గంటలకు పాటు నిరాహార దీక్ష చేపడుతున్నట్టు తెలిపారు. రాష్ట్రంలో సుమారు 20వేల మందికి పైగా వీఆర్ఏలు రెవెన్యూ శాఖలో పనిచేస్తున్నారని, దశాబ్దాలు గడిచిపోతున్నా, ప్రభుత్వాలు మారుతున్నా వారి బతుకులు మాత్రం మారలేదన్నారు. అభివృద్ధికి ఆమడ దూరంలో ఉన్నారన్నారు. రెవెన్యూ వ్యవస్థలో కీలకంగా పని చేస్తూ ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధిగా ఉంటున్నారన్నారు. బతుకులు మారుస్తామని పాలకులు ఉత్తర కుమార ప్రగల్భాలు పలికి వీఆర్ఏలను అబద్ధాలతో మోసం చేస్తున్నారే తప్ప సమస్యలను పట్టించుకోవడం లేదన్నారు. గ్రామాల్లో చావు పుట్టుకల సమాచారం మొదలుకొని అన్ని పనులకు వీఆర్ఏలే కీలకమన్నారు. పకృతి వనరులు, ప్రమాద విపత్తులు, పంటల బీమా, భూకొలతలు, రీ సర్వే, చివరకు నిత్యావసర సరుకులు పంపిణీ చేసే రేషన్ షాపు ఇన్‌ఛార్జి డీలర్లుగా ప్రభుత్వానికి ఊడిగం చేస్తున్నారు. దాదాపు 54 శాఖలకు సంబంధించిన విధులు నిర్వహిస్తున్నారన్నారు. కేవలం రూ.10,500 వేతనంతో ఇంటిల్లపాది అర్ధాకలితో అలమటిస్తున్నారన్నారు.

గత టీడీపీ ప్రభుత్వం ఇచ్చిన కరువు భత్యం రూ.300, దశాబ్దాల కాలంగా పోరాడి సాధించుకున్న డీఏ సైతం రద్దు చేసిన పాపం ఎవరిది? వీఆర్ఏల ముక్కు పిండి రికవరీ చేసిన ప్రత్యేక ప్రభుత్వంగా వైసీపీ ఘనతకెక్కిందన్నారు. అధికారంలోకి వచ్చిన వారం రోజుల్లోని రూ.15,000 వేతనాలు పెంచుతామని, అన్ని సమస్యలు పరిష్కరిస్తామని జగన్ హామీ ఇచ్చి ఐదేళ్లు గడుస్తున్నా ఐదు రూపాయలు కూడా వేతనం పెంచకపోవడం దుర్మార్గమన్నారు. నా ఎస్సీ, నా ఎస్టీ, నా బీసీ, నా మైనార్టీలు అంటున్న జగన్... వీఆర్ఏలంతా వెనుకబడిన దళిత కులాలకు చెందిన వారు అన్న సంగతి గుర్తెరగాలని హితవు పలికారు. సమస్యలు పరిష్కరించాలని రాష్ట్ర ఉన్నతాధికారులు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, రెవెన్యూ శాఖ మంత్రి, ప్రభుత్వ ప్రత్యేక సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డిని సంఘ నేతలతో కలిసి పదేపదే విజ్ఞప్తులు చేస్తే భరోసా ఇచ్చారే తప్ప సమస్యల పరిష్కారానికి చొరవ చూపలేదని ధ్వజమెత్తారు. హక్కుల సాధనకు విజయవాడ ధర్నాచౌక్‌లో చేస్తున్న నిరాహారదీక్షకు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న వీఆర్ఏలు తమ కుటుంబ సభ్యులతో పెద్దఎత్తున తరలివచ్చి జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. తొలుత దీక్షకు సంబంధించి కరపత్రాలను ఆవిష్కరించారు. సమావేశంలో సంఘ రాష్ట్ర అధ్యక్షుడు నల్లిపోగు నాగేశం రాష్ట్ర సహాయ కార్యదర్శి కోదూరు పుల్లయ్య, రాష్ట్ర ఉపాధ్యక్షుడు సీ మణికుమార్, బి.శ్రీనివాసులు, నెల్లూరు సురేశ్, కొరముట్ల సుధాకర్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ ఆశావాహులతో షర్మిల ముఖాముఖి

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ నుంచి పోటీ చేసేందుకు దరఖాస్తు చేసిన ఆశావాహులతో పార్టీ అధ్యక్షులు షర్మిల ముఖాముఖి నిర్వహిస్తున్నారు. విజయవాడ ఆంధ్రరత్న భవన్‌లో ఆమె రెండు రోజుల నుంచి ఈ కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నారు. నర్సాపురం, ఏలూరు, నరసరావుపేట, బాపట్ల, గుంటూరు, మచిలీపట్నం పార్లమెంటు నియోజకవర్గాలకు సంబంధించి ఆశావాహులను ఆమె నేరుగా పిలిపించి మాట్లాడుతున్నారు. ఈ ఏడు పార్లమెంటు స్థానాల్లో ఉన్న 49 అసెంబ్లీ నియోజక వర్గాలలో పోటీ చేసేందుకు 280 మంది దరఖాస్తు చేశారు. గురువారం మరో తొమ్మిది పార్లమెంటు స్థానాల పరిధిలోని అసెంబ్లీలకు దరఖాస్తు చేసుకున్న వారితో షర్మిల చర్చించారు. శ్రీకాకుళం, అరకు, విజయనగరం, ఒంగోలు, అనకాపల్లి, రాజమండ్రి, కాకినాడ, అమలాపురం పార్లమెంటు నియోజక వర్గాల పరిధిలోని 67 అసెంబ్లీ నియోజకవర్గాలకు చెందిన ఆశావాహులతో ఆమె ముఖాముఖీ నిర్వహించారు. ఆశావాహుల రాకతో ఆంధ్రరత్న భవన్ సందడిగా మారింది. పార్లమెంటు, అసెంబ్లీ సీట్లకు పోటీ చేసేందుకు వచ్చిన దరఖాస్తులను పీసీసీ నాయకత్వం వడబోత పోసి, రెండు, లేదా మూడు పేర్లను ఏఐసీసీకి పంపనుంది.

18 సర్క్యూట్లలో టెంపుల్ టూరిజం

దేవదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఆధ్యాత్మిక పర్యాటకానికి రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న విప్లవాత్మక చర్యలతో నూతన శకానికి నాంది పలుకుతున్నామని, 18 సర్క్యూట్లలో టెంపుల్ టూరిజం ఏర్పాటుకు కృషి చేస్తున్నామని ఉప ముఖ్యమంత్రి, దేవదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ అన్నారు. విజయవాడ ఏపీ పర్యాటకాభివృద్ధి సంస్థ డివిజన్ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన టెంపుల్ టూరిజం ప్యాకేజీలు, వాహనాల ప్రారంభోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేశారు. తొలుత ఏపీటీడీసీ ఏర్పాటు చేసిన వాహనాలను మంత్రి, ఎమ్మెల్యే మల్లాది విష్ణు జెండా ఊపి లాంఛనంగా ప్రారంభించారు. ప్రముఖ దేవాలయాల దర్శనాలను సులభతరం చేయటంలో భాగంగా దేవదాయ శాఖ, ఏపీ పర్యాటక అభివృద్ధి సంస్థ, పిల్‌గ్రిమ్ పాత్‌వేస్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థల సమన్వయంతో ముందుకు వెళ్తున్నామన్నారు. ఒక రోజు, రెండు రోజుల ప్యాకేజీలను రూపొందించి ప్రస్తుతం 18 సర్క్యూట్‌లలో అందుబాటులోకి తీసుకొచ్చామని వివరించారు. ప్యాకేజీలో భోజనం, వసతి ఏర్పాట్లు తదితర సేవలను కూడా అందిస్తామన్నారు. రాష్ట్ర ప్రణాళికాబోర్డు ఉపాధ్యక్షుడు, ఎమ్మెల్యే మల్లాది విష్ణు మాట్లాడుతూ వృద్ధులు, చిన్నారులను సైతం వెంట తీసుకువెళ్లినా ఎటువంటి ఇబ్బందులు పడకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుందని చెప్పారు. ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఏఏఎల్ పద్మావతి, జనరల్ మేనేజర్ (ట్రాన్స్ పోర్ట్) ఆర్.శశిధర్, డివిజనల్ మేనేజర్ పి.ఎస్. కృష్ణ చైతన్య, అసిస్టెంట్ మేనేజర్ కె. శ్రీధర్, సెంట్రల్ రిజర్వేషన్ మేనేజర్ ఎం.సురేశ్, ఏపీటీడీసీ అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

ప్రత్తిపాటి శరత్ అరెస్ట్

విశాలాంధ్ర-విజయవాడ: జీఎస్టీ ఎగవేశారన్న ఆరోపణలపై మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు కుమారుడు శరత్‌ను పోలీసులు అరెస్టు చేశారు. శరత్‌పై జీఎస్టీ అధికారులు ఫిర్యాదు చేయడంతో విచారణ జరిపిన పోలీసులు శరత్‌ను గురువారం అరెస్ట్ చేశారు. ఏపీ డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటలిజెన్స్ అధికారులు ఫిర్యాదు మేరకు మాచవరం పోలీస్ స్టేషన్‌లో శరత్‌పై కేసు నమోదైంది. నిధులు మళ్లించి పన్ను ఎగవేశారనే ఆరోపణలపై శరత్‌తో పాటు మొత్తం ఏడుగురిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఐపీసీలోని 420, 409, 467,471, 477(ఏ),120బీ రెడ్ విత్ 34 ఐపీసీ సెక్షన్లపై కేసు ఫైల్ అయింది. ఎఫ్ఐఆర్‌లో మాజీ మంత్రి పుల్లారావు భార్య, బావమరిదితో పాటు మరో ఐదుగురిపై కేసు నమోదు అయ్యింది. అలెక్సా కార్పొరేషన్ ప్రైవేట్ లిమిటెడ్‌లో పన్ను ఎగవేశారని ఎఫ్ఐఆర్‌లో పోలీసులు పేర్కొన్నారు.

అధికార పార్టీ కుట్రలో భాగమే: టీడీపీ

శరత్ అరెస్టుపై టీడీపీ నేతలు భగ్గుమన్నారు. పోలీసులతో కుమ్మక్కై అధికార పార్టీ నేతలు కావాలనే టీడీపీ నేతలను వేధిస్తున్నారని మండిపడ్డారు. ప్రత్తిపాటి పుల్లారావు స్పందిస్తూ... తన కుమారుడిపై అక్రమ కేసులు బనాయించి, అన్యాయంగా అరెస్టు చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తన కుమారుడు ఏ కంపెనీలోనూ డైరెక్టర్‌గా లేడని... కనీసం షేర్ హోల్డర్‌గా కూడా లేడని స్పష్టం చేశారు. ఏ కంపెనీతో లావాదేవీలు లేని తన కుమారుడికి జీఎస్టీ ఎగవేతతో సంబంధమేంటని ప్రశ్నించారు. ఎన్నికల వేళ అక్కసుతో తమపై బురద జల్లాలని ప్రయత్నిస్తున్నారని మండిపడ్డారు. అక్రమ కేసులకు భయపడేది లేదని స్పష్టం చేశారు.

వైసీపీ ఎనిమిదో జాబితా

ఒంగోలు ఎంపీ అభ్యర్థిగా చెవిరెడ్డి

గుంటూరుకు ఎమ్మెల్యే కిలారు రోశయ్య

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: వైసీపీ స్వల్ప మార్పులు, చేర్పులతో ఎనిమిదో జాబితా విడుదల చేసింది. ఈ జాబితాలో రెండు పార్లమెంట్, మూడు అసెంబ్లీ స్థానాల్లో అభ్యర్థులకు చోటు దక్కింది. గుంటూరు ఎంపీ ఇన్‌చార్జిగా పొన్నూరు ఎమ్మెల్యేగా ఉన్న కిలారు రోశయ్యను నియమించారు. ఇంతకుముందు నియమించిన ఉమ్మారెడ్డి వెంకట రమణను తప్పించి ఆయన స్థానంలో రోశయ్యకు అవకాశం కల్పించారు. రోశయ్య వైసీపీ సీనియర్ నేత, ఎమ్మెల్సీ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లుకు అల్లుడు అవుతారు. ఇప్పటికే గుంటూరు ఎంపీ స్థానానికి ఇద్దరి అభ్యర్థుల్ని మార్చారు. మొదటగా భారత మాజీ క్రికెటర్ అంబటి రాయుడును బరిలోకి ఆధిష్ఠానం దించింది. కొంతకాలం తర్వాత ఆయనను మచిలీపట్నం ఎంపీగా పోటీ చేయాలని సూచించడంతో నిరాసక్తి చెంది పార్టీకి రాజీనామా చేశారు. ఆ తర్వాత ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు తనయుడు వెంకటరమణ పేరును వైసీపీ ప్రకటించింది. ఆయన చురుగ్గా రాజకీయ కార్యకలాపాలు చేపట్టకపోవడంతో రోశయ్యను నియమించారు. ఒంగోలు ఎంపీ ఇన్‌ఛార్జిగా చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి పేరు ఖరారు చేశారు.

పొన్నూరు అసెంబ్లీ సమన్వయకర్తగా అంబటి మురళిని నియమించారు. ఆయన రాష్ట్ర మంత్రి అంబటి రాంబాబు సోదరుడు. కందుకూరు అసెంబ్లీ సమన్వయకర్తగా బుర్రా మధుసూదన్ యాదవ్‌కు చోటు దక్కింది. జీడీ నెల్లూరు అసెంబ్లీ అభ్యర్థిగా ఉప ముఖ్యమంత్రి నారాయణ స్వామి కుమార్తె కల్లత్తూర్ కృపాలక్ష్మిని నియమించారు. ఒంగోలు వైసీపీ సిట్టింగ్ ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి పార్టీకి రాజీనామా చేశారు. ఆయన రాజీనామా చేసిన రోజే చెవిరెడ్డి పేరును ఖరారు చేశారు. ఆయన పేరును మొదట్లో ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని వ్యతిరేకించినప్పటికీ, ఆ తర్వాత సర్దుకుపోయారు. స్వయంగా ఒంగోలు పార్టీ కార్యక్రమాల్లో చెవిరెడ్డి, బాలినేని హాజరవ్వడంతో అక్కడితో సమస్య సద్దుమణిగింది. నెల్లూరు ఎంపీ అభ్యర్థిపై ఆధిష్ఠానం ఒక స్పష్టతకు వచ్చింది. ఇప్పటికే నియమించిన ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి టీడీపీలో చేరికకు సిద్ధమయ్యారు. ఆయన వెళ్లిన రోజు, అంతకంటే ముందస్తుగా ఎంపీ అభ్యర్థిని వైసీపీ ప్రకటించనుందని సమాచారం.

జామాయిల్ కలప వేలాన్ని నిలిపి వేయాలి

రైతు సంఘాల డిమాండ్

విశాలాంధ్ర-మంగళగిరి: ఆంధ్రప్రదేశ్ అటవీ అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జామాయిల్ కలప వేలంలో కొందరు గుత్తేదారులు సిండికేట్‌గా ఏర్పడి కారుచౌకగా టెండర్లు దక్కించుకుంటున్నారని, మార్చి ఒకటి, 14వ తేదీన నిర్వహించే కలప వేలం పాటను నిలుపుదల చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గుజ్జల ఈశ్వరయ్య, కేవీవీ ప్రసాద్ డిమాండ్ చేశారు. ఈ మేరకు స్థానిక అటవీశాఖ కార్యాలయం వద్ద గురువారం ధర్నా నిర్వహించారు. అనంతరం ఫారెస్ట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ అండ్ చైర్మన్ మధుసూదన్ రెడ్డికి వినతిపత్రాన్ని అందజేశారు. ఈశ్వరయ్య, ప్రసాద్ మాట్లాడుతూ, మార్కెట్‌లో సుమారు టన్ను రూ.ఆరువేలు ఉండగా వేలంలో కొందరు గుత్తేదారులు సిండికేట్‌గా మారి రూ.3,460కే కారుచౌకగా టెండర్లు దక్కించుకున్నారని ఆరోపించారు. నెల్లూరు, తిరుపతి, పల్నాడు జిల్లాల్లో సంస్థ నిర్వహించిన వేలంలో కేవలం ముగ్గురు వ్యాపారులు పాల్గొనడం సిండికేట్‌గా మారడానికి నిదర్శనమని అన్నారు.

గతంలో ఫారెస్ట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, జామాయిల్ కలప అమ్మిన కారణంగా రూ.600లకు పైగా ధర తగ్గి రైతులు తీవ్ర నష్టానికి గురయ్యారన్నారు. ధరలు మరింత పతనమై రైతులు తీవ్రంగా నష్టపోయే పరిస్థితి ఉందని, ఎండాకాలంలో కలప అమ్మకం వల్ల బరువు తగ్గి ప్రభుత్వానికి కూడా నష్టం జరిగే పరిస్థితి ఉందని చెప్పారు. వేలం విరమించుకొని రైతులకు నష్టం జరగకుండా కాపాడాలని వారు కోరారు. ఫారెస్ట్ కార్పొరేషన్ భూముల్లో జామాయిల్ కర్ర పెంపకాన్ని విరమించుకొని ఫలసాయం ఇచ్చే పండ్ల తోటలను పెంచడం వల్ల పర్యావరణ పరిరక్షణకు, మార్కెట్లో కలప ధర తగ్గి రైతులకు నష్టం జరగకుండా ఉంటుందన్నారు. గత తొమ్మిది సంవత్సరాల నుంచి ఒప్పంద ధరలు అమలు జరగని కారణంగా జామాయిల్ రైతులు ఎకరానికి సుమారు రూ.60 వేలు నష్టపోయారన్నారు. దీంతో జామాయిల్ సాగు రాష్ట్రంలో 1/3 వంతు అనగా సుమారు 1.50 లక్షల ఎకరాలకు పైగా తొలగించారని వివరించారు. గత సంవత్సరం నుంచి ధరలు సుమారు రూ.6 వేల వరకు పెరిగి రైతులకు ఎంతో కొంత ఉపశమనం కలిగే సమయంలో గతంలో కంటే ధరకు కలప వేలం పాటలను ఖరారు చేసిన కారణంగా టన్నుకు రూ.1,000 వరకు ధర తగ్గి రైతులు తీవ్ర నష్టాలకు గురౌతున్నారని అన్నారు. చైర్మన్ మధుసూదన్ రెడ్డి స్పందిస్తూ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సంబంధిత అధికారులకు, మంత్రులకు తెలియజేసి పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. జామాయిల్ కలపకు రేటు వచ్చే విధంగా చూస్తానని చెప్పారు. ఏపీ సామాజిక వన రైతుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు తాళ్లూరి బాబురావు, కార్యదర్శి వి.హనుమారెడ్డి, ఆంధ్రప్రదేశ్ కౌలు రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.జమలయ్య, ప్రకాశం జిల్లా రైతు సంఘ ప్రధాన కార్యదర్శి వీరారెడ్డి, గుంటూరు జిల్లా రైతు సంఘం అధ్యక్షుడు కొల్లి రంగారెడ్డి, లక్ష్మణరావు, దొంత కృష్ణ, యార్లగడ్డ వెంకటేశ్వరరావు, గుంటక సాంబిరెడ్డి, జె.సాంబశివరావు, చిన్ని సత్యనారాయణ, బి.శ్రీనివాసరావు, ఎం.సుధాకర్ రావు, జాలాది జాన్ బాబు, ఎన్.పెద్దబ్బాయి, కె.ఇర్మియ, వెంకట్రావు, పాపారావు పాల్గొన్నారు.

ఇ-వేలం నిలిపివేత : సుబాబుల్ కలప కొనుగోలు నిమిత్తం కొనుగోలు పోర్టల్‌లో మార్చి 01, 14, 22 తేదీల్లో నిర్వహించ తలపెట్టిన ఇ-టెండరు కమ్ ఇ-వేలంను వాయిదా వేస్తున్నట్లు ఆంధ్రప్రదేశ్ అటవీ అభివృద్ధి కార్పొరేషన్ ప్రకటించింది. కొత్త తేదీలను త్వరలో ప్రకటిస్తామని వెల్లడించింది.

ఆస్తి పన్ను బకాయిలపై వడ్డీ మాఫీ చేస్తూ ఉత్తర్వులు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి : ఆస్తి పన్ను బకాయిలపై వడ్డీ మాఫీ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. భవనాలు, ఖాళీ స్థలాల పన్నుల బకాయిలపై ఒన్ టైమ్ సెటిల్ మెంట్ ద్వారా వడ్డీ మాఫీ అమలు చేస్తూ రాష్ట్ర పట్టణాభివృద్ధి, మున్సిపల్ ముఖ్య ప్రధాన కార్యదర్శి వై.శ్రీలక్ష్మీ గురువారం ఉత్తర్వులు జారీజేశారు. ఈ ఏడాది మార్చి 31లోగా ఇది వర్తించనుంది. 2023-24 ఆర్థిక సంవత్సరంలో బకాయిలు, ప్రస్తుత సంవత్సరం ఆస్తి పన్ను డిమాండ్‌పై ఇప్పటికే పన్ను చెల్లింపుదారులు చెల్లించిన వడ్డీ మొత్తం భవిష్యత్ ఆస్తి పన్ను చెల్లింపులకు సర్దుబాటు చేస్తారు. నగదును వాపసు చేయరు.

విద్యారంగాన్ని నాశనం చేసిన జగన్‌ను ఇంటికి పంపండి

విద్యార్థి లోకానికి ఏఐఎస్ఎఫ్ పిలుపు

విశాలాంధ్ర-విజయవాడ: రాష్ట్రంలో విద్యారంగాన్ని పూర్తిగా నాశనం చేసిన జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వానికి వచ్చే ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పి ఇంటికి పంపించాలని విద్యార్థి లోకానికి ఏఐఎస్ఎఫ్ పిలుపునిచ్చింది. ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సమావేశం గురువారం స్థానిక దాసరి భవన్‌లో జరిగింది. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు జాన్సన్ బాబు, ప్రధాన కార్యదర్శి శివారెడ్డి మాట్లాడుతూ జగన్‌మోహన్ రెడ్డి పాదయాత్ర చేసిన సందర్భంగా రాష్ట్రంలో విద్యారంగ అభివృద్ధికి పెద్ద పీట వేస్తానని మాట ఇచ్చి అధికారంలోకి వచ్చిన తరువాత మడమ తిప్పి విద్యా వ్యవస్థను నిర్లక్ష్యం చేశారని విమర్శించారు. రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాల్లో రాజకీయంగా జోక్యం చేసుకుని వైసీపీ కార్యకర్తలను కింది స్థాయి ఉద్యోగులుగా నియమిస్తున్నారని తెలిపారు. విశ్వవిద్యాలయాలను వైసీపీ కార్యాలయాలుగా మార్చారని విమర్శించారు. రాజకీయ జోక్యం ద్వారా విశ్వవిద్యాలయాలను భ్రష్టు పట్టించారని ధ్వజమెత్తారు. రాష్ట్ర ప్రభుత్వం ఐదు వైద్య కళాశాలలను ఏర్పాటు చేసి ప్రారంభించిన నేపథ్యంలో ఒక్కొక్క సీటు 60 లక్షల రూపాయలకు అమ్ముకున్నారని తెలిపారు. ఎటువంటి మౌలిక సదుపాయాలు లేకుండా వైద్య కళాశాల నిర్వహణ చేస్తున్నారని విమర్శించారు. రాష్ట్రంలో వైద్య కళాశాలలకు నిధులు కేటాయించి అభివృద్ధి చేయాలని, రాష్ట్ర వ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న హాస్టల్ విద్యార్థుల మెస్, కాస్మోటిక్ బిల్లులు తక్షణమే విడుదల చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో రాష్ట్ర ఆఫీస్ బేరర్లు రాజేంద్రప్రసాద్, నాసర్‌జీ, వలరాజు, నాగభూషణం, మస్తాన్, షబీర్ బాషా, సాయికుమార్ వివిధ జిల్లాల నుంచి కార్యవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

మీ నిర్ణయాలు మీ చేతుల్లో ఉండవుగదా!

పవన్ కల్యాణ్‌కు ముద్రగడ ఘాటు లేఖ

విశాలాంధ్ర-కిర్లంపూడి: జనసేన అధినేత పవన్ కల్యాణ్‌కు గురువారం కాపు నేత ముద్రగడ పద్మనాభం ఘాటు లేఖ రాశారు. అన్ని వర్గాలకు న్యాయం జరగడం కోసం, పార్టీని ముందుకు తీసుకెళ్లేందుకు ఎటువంటి ఫలితం ఆశించకుండా నా వంతు కృషి చేయాలని అనుకున్నా, మన ఇద్దరి కలయిక జరగాలని యావత్ జాతి బలంగా కోరుకున్నారు. వారందరి కోరిక మేరకు మీతో ప్రయాణం చేయడానికి సిద్ధపడ్డానని ముద్రగడ లేఖలో వివరించారు. రాష్ట్రంలో ఒక కొత్త రాజకీయ వరవడి తీసుకురావాలని చాలా బలంగా ప్రయత్నం చేద్దామని ఆశించా, మీరు కూడా అదే ఆలోచనలో ఉన్నారని నమ్మా, కానీ నాకు ఆ అవకాశం మీరు ఇవ్వలేదని పేర్కొన్నారు. పవర్ షేరింగ్‌కు ప్రయత్నం చేసి 80 అసెంబ్లీ సీట్లు, రెండు సంవత్సరాల ముఖ్యమంత్రి పదవి మిమ్మల్ని చేయమని కోరి ఉండాలని, ఆ సాహసం మీరు చేయకపోవడం చాలా బాధాకరమని ముద్రగడ పేర్కొన్నారు. మీరు మా ఇంటికి వస్తానని చెప్పించి రాలేకపోయారు... మీ నిర్ణయాలు మీ చేతుల్లో ఉండవు కదా? మీరు ఎన్నో చోట్ల పర్మిషన్ తీసుకోవాలని పవన్ కల్యాణ్‌ను ఉద్దేశించి ముద్రగడ లేఖ రాశారు. మీ పార్టీ నుంచి పోటీ చేసే 24 మందికి నా అవసరం రాదు, రాకూడదని ఆ భగవంతుడిని ప్రార్థిస్తున్నా, ఆల్ ది బెస్ట్ అని ముగించారు.

సమస్యల పరిష్కారానికి చిత్తశుద్ధితో కృషి

ఏపీ ఎన్జీవో నూతన అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శివారెడ్డి, పురుషోత్తమ నాయుడు

విశాలాంధ్ర-విజయవాడ (గాంధీనగర్): రాష్ట్ర జేఏసీలోని 108 సంఘాల నాయకత్వాల సహకారంతో రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు, ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్టు విధానంలో ప్రభుత్వంలోని వివిధ విభాగాలలో సేవలందిస్తున్న కార్మికుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా చిత్తశుద్ధితో బాధ్యతలు నిర్వహిస్తామని ఏపీ ఎన్జీజీవో నూతన అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.వి.శివారెడ్డి, చౌదరి పురుషోత్తమ నాయుడు తెలిపారు. గురువారం గాంధీనగర్‌లోని ఎన్జీవో కార్యాలయంలో రాష్ట్ర సంఘం నూతన అధ్యక్ష, కార్యదర్శులుగా కో ఆప్షన్ విధానంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఏకగ్రీవంగా వారిని ఎన్నుకున్నారు. హామీలన్నిటిని ప్రభుత్వం నుంచి రాబట్టడమే తమ మొదటి కార్యక్రమమని తెలిపారు. మాజీ అధ్యక్షులు బండి శ్రీనివాసరావు మాట్లాడుతూ తన పదవీకాలంలో తనకు అండదండగా నిలిచిన జేఏసీలోని ఉద్యోగ సంఘాల నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

సంపాదకీయం

ఎందుకింత అత్యుత్సాహం?

జమిలి ఎన్నికలపై మోదీ ప్రభుత్వం అత్యుత్సాహం ప్రదర్శిస్తోంది. వారి ఆలోచనలకు అనుగుణంగా వచ్చిన కొన్ని కథనాలు అధ్యక్షపాలన దిశగా బీజేపీ ప్రభుత్వం పావులు కదుపుతున్న తీరుకు అద్దంపడుతున్నాయి. తాజాగా విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ రుతురాజ్ అవస్థీ నేతృత్వంలోని న్యాయ కమిషన్ జమిలి ఎన్నికలపై కొన్ని సిఫార్సులు చేస్తూ ఒక నివేదికను సిద్ధం చేస్తోంది. నివేదిక ఇంకా సమర్పించకుండానే, కొన్ని కీలక సిఫార్సులంటూ వివిధ అంశాలు వెలుగులోకి వచ్చాయి. రేపోమాపో ఈ నివేదిక రాకమానదు. ఈలోగా జమిలి ఎన్నికలపై మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ నేతృత్వంలోని ఉన్నతస్థాయి కమిటీ కూడా ప్రత్యేక నివేదికను రూపొందిస్తోంది. అది ఏ క్షణానైనా విడుదల కావచ్చు. జమిలిపై మోదీ తెగ ఆరాటపడుతున్న విషయాన్ని ఈ నివేదికల పరంపర చెప్పకనే చెపుతోంది. ఇది పార్లమెంటరీ ప్రజాస్వామ్య వ్యవస్థా లేక అధ్యక్ష తరహా పాలనా వ్యవస్థా? రాష్ట్రపతి పేరుతో దేశాధ్యక్షుడు ఉన్నంత మాత్రాన ఆ పదవి పరిధి ఎంతవరకు ఉండాలో అంతవరకే ఉంచిన రాజ్యాంగ నిర్మాతల ముందుచూపు మహోన్నతమైనది. మన రాజ్యాంగం ప్రకారం దేశ పార్లమెంటరీ వ్యవస్థలో సమాఖ్య వ్యవస్థ అంతర్లీనంగా కొనసాగుతూ ఉంటుంది. అదే మన ప్రజాస్వామ్య వ్యవస్థ గొప్పదనం. అది విజయవంతంగా సాగుతున్న దశలో 70 ఏళ్ల దాటిన తర్వాత జమిలి మంత్రాన్ని జపించడంలో అర్థం లేదు. జమిలి ఎన్నికల వల్ల కేవలం ఎన్నికల వ్యయం తగ్గుతుందని ఒకే ఒక్క కారణంతో చాలామంది న్యాయనిపుణులు తమ ఆలోచనలను అటువైపు పరుగులు పెట్టిస్తున్నారు. ఒకేసారి ఎన్నికలు జరిగినా, కనీసం 10 వేల కోట్ల రూపాయల ఖర్చు తప్పదని గ్రహించాలి. పైగా మోదీ ఆలోచన వెనుక దాగివున్న 'గొప్ప కుట్ర'ను న్యాయనిపుణులు గ్రహించలేకపోవడం దురదృష్టకరం. ఈసారికి ఏకకాలంలో ఎన్నికలు సాధ్యం కాకపోయినా, 2029 నుంచి జమిలి ఎన్నికలు జరుపుకోవచ్చని న్యాయ కమిషన్ సిఫార్సు చేయనున్నదని తెలిసింది. అంతేతప్ప జమిలి ఎన్నికలే ఉత్తమం అని సిఫార్సు చేయకుండా ఉంటుందని ఆశించడం తప్ప ఇప్పటికిప్పుడు మనం చేసేదేమీ లేదు. అయినప్పటికీ, జమిలి వల్ల లాభం కన్నా నష్టమే ఎక్కువ జరుగుతుందని రొడ్డకొట్టుడు మాదిరి ఒకే దృక్పథంతో తలలు బాదుకుంటున్న న్యాయ నిపుణులు గ్రహించాల్సిన అవసరమైతే అత్యవసరం.

జమిలి ఎన్నికలు బీజేపీ సిద్ధాంతాల్లో ఒకటి. ఇది సర్వవిదితం. ఒకే దేశం ఒకే ఎన్నిక నినాదాన్ని 2014లో అధికారంలోకి వచ్చినప్పటి నుంచి బీజేపీ నేతలు ఏదో ఒక సందర్భంలో చెపుతూనే ఉన్నారు. కొన్ని రోజుల క్రితం ప్రత్యేక పార్లమెంటు సమావేశాల నిర్వహణకు పూనుకోవడంతో ఉన్నట్టుండి జమిలి తెరపైకి వచ్చింది. న్యాయ కమిషన్, కోవింద్ కమిషన్‌లకు బాధ్యతలు అప్పగించిన తర్వాత ఇదేదో అనివార్యమైన ప్రక్రియ అని అందరికీ అర్థమైపోయింది. దేశ వ్యాప్తంగా ఒకేసారి పార్లమెంటు, అసెంబ్లీలకు ఎన్నికలు జరగడమే జమిలి ఎన్నికలు లేదా ఒకే దేశం ఒకే ఎన్నిక విధానం. దేశంలో అన్ని రాష్ట్రాల్లోని అసెంబ్లీలతోపాటు లోక్‌సభకు కూడా ఒకే సమయంలో ఎన్నికలు జరుగుతాయన్నమాట! ఇదంత తేలికైన పని కాదు కాబట్టే రామాలయం, 370 రద్దు వంటి అజెండాలను అమలు చేసినంత త్వరగా జమిలిని బీజేపీ ప్రభుత్వం పరిపూర్తి చేయలేకపోతున్నది. దీనికి సంబంధించిన బిల్లు పార్లమెంటులో ఆమోదం పొందాలంటే రాజ్యాంగ సవరణలు చేయాల్సి ఉంటుంది. ఈ సవరణలకు లోక్‌సభలోని 543 స్థానాల్లో కనీసం 67 శాతం మంది సభ్యులు బిల్లుకు అనుకూలంగా ఓటు వేయాలి. అటు రాజ్యసభలోని 245 సీట్లలో 67 శాతం ఈ బిల్లును సమర్థించాల్సి ఉంటుంది. దీనికి అదనంగా దేశంలో ఉన్న రాష్ట్రాల్లో కనీసం సగం రాష్ట్రాల అసెంబ్లీలు ఈ ఒకే దేశం ఒకే ఎన్నిక బిల్లుకు ఆమోద ముద్ర వేయాల్సి ఉంటుంది. కనీసం 14 రాష్ట్రాలు ఈ బిల్లును సమర్థిస్తూ తీర్మానం చేయాలి. లోక్‌సభలో ఎన్డీఏ కూటమికి దాదాపు 333 సీట్ల బలం ఉంది. 543 స్థానాలకు గానూ ఈ 333 సీట్లు అంటే 61శాతానికి సమానం... అయితే మరో 6 శాతం ఓటింగ్‌ను సంపాదించడం ఎన్డీఏ కూటమికి కష్టమే. ఇక రాజ్యసభలో ఈ మధ్యనే 56 సీట్లకు జరిగిన ఎన్నికలు కలుపుకొని ఎన్‌డీఏ బలం 117కి పెరిగిన మాట వాస్తవం. కాకపోతే మెజారిటీ మార్కు 121కి ఇంకా 4 సీట్లు తక్కువే ఉంది. క్రాస్ ఓటింగ్‌కు ఎంత ప్రయత్నించినా కర్నాటకలో బెడిసికొట్టడంతో బీజేపీ కాస్త అసంతృప్తికి లోనైంది. రాజ్యసభ ఎన్నికల ఫలితాలు వెలువడిన 24 గంటల్లోపే జమిలిపై న్యాయకమిషన్ సిఫార్సుల పేరుతో కథనం విడుదలైన విషయాన్ని గమనించాలి. అసెంబ్లీల్లో బలాబలాలను పరిశీలిస్తే, 2023 ఆఖరులో ముగిసిన 5 రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల తర్వాత బీజేపీ, దాని మిత్రుల (ఎన్‌డీఏ) పాలిత రాష్ట్రాల సంఖ్య 17కి పెరగగా, కాంగ్రెస్ పార్టీ, దాని మిత్రపక్షాల (ఇండియా కూటమి) పాలిత రాష్ట్రాల సంఖ్య 9కి చేరింది. శాసనసభలు కలిగిఉన్న రెండు కేంద్ర పాలిత ప్రాంతాల్లో ఒకటి ఎన్‌డీఏ చేతిలోనూ, ఇంకొకటి ఇండియా కూటమి చేతిలోనూ ఉంది. ఈ మధ్యనే బీహార్‌ను పాలిస్తున్న నితీశ్‌కుమార్ ఎన్‌డీఏ పంచన చేరడంతో 'ఇండియా'కు ఒక రాష్ట్రం తగ్గినట్లుగా భావించాలి. ఆంధ్రప్రదేశ్, ఒడిశా వంటి రాష్ట్రాలూ తటస్థంగా ఉన్నాయి. ఏపీలో ఇండియా కూటమి తప్ప ఎవరు అధికారంలోకి వచ్చినా బీజేపీ చెప్పులు మోయాల్సిందేనని ఆ పార్టీ నేతలే బహిరంగంగా చెపుతున్నారు. అందుకే న్యాయకమిషన్ చెపుతున్నదాని ప్రకారం, 2029 నుంచి జమిలి ఎన్నికలను అమలు చేయాలంటే, 2024 సార్వత్రిక ఎన్నికల్లో ఎన్‌డీఏ కూటమి తన బలాన్ని మరింత పెంచుకోవాల్సి ఉంటుంది. అంటే జమిలి ఎన్నికల ప్రక్రియ కార్యరూపం దాలుస్తుందా లేదా అన్నది రెండు నెలల్లో జరగబోయే ఎన్నికలపైనే ఆధారపడి ఉంటుందని స్పష్టమవుతున్నది.

ఎన్నికల నిర్వహణ వ్యయం కన్నా ఎన్నికల్లో పార్టీలు పెట్టే ఖర్చు ఎక్కువ. సెంటర్ ఫర్ మీడియా స్టడీస్ ప్రకారం 2019 లోక్‌సభ ఎన్నికలకు అన్ని పార్టీలు కలిపి దాదాపు రూ. 60 వేల కోట్లు ఖర్చుచేశాయి. దేశ చరిత్రలోనే అత్యంత ఖరీదైన ఎన్నికలు అవే. పార్టీల ఖర్చును తగ్గించుకోవడానికి ప్రయత్నించాలే తప్ప ఎన్నికల నిర్వహణ వ్యయం పేరుతో జమిలికి ఆస్కారమిచ్చి, నియంతృత్వ పాలన దిశగా దేశాన్ని నడిపించే యత్నాన్ని ఆపాలి. జమిలికి ఆమోదం తెలపాలంటే, రాజ్యాంగ సవరణలతోపాటు ప్రజాప్రాతినిధ్య చట్టాన్ని, పార్లమెంటరీ ప్రొసీజర్లను సవరించాలి. దీనికీ రాష్ట్రాల అంగీకారం ఉండాలి. జాతీయ అంశాలకే ప్రాధాన్యత పెరిగి, స్థానిక సమస్యలు పెద్దగా పట్టవు. ప్రాంతీయ పార్టీలు పూర్తిగా తమ ప్రాధాన్యతను కోల్పోతాయి. మనమూ, మన రాష్ట్రమూ, మన అభివృద్ధి అనే మాటలే ఇకపై ఉండవు. అనివార్య కారణాల వల్ల అసెంబ్లీలు రద్దయితే, రాష్ట్రపతి పాలన విధిస్తారు. ఐదేళ్లూ ఆ పాలనలోనే బతుకీడ్చే పరిస్థితి దాపురించవచ్చు. ఇది అత్యయిక పరిస్థితులకు దారితీస్తుంది. అసంతృప్తులు పెరిగి, ఉగ్రవాదం, తీవ్రవాదం పెరుగుతుంది. రాష్ట్రాలు తమ హక్కులన్నీ కోల్పోతాయి. కేంద్రీకృతపాలన బలపడుతుంది. సమాఖ్య వ్యవస్థ నాశనమవుతుంది. అందుకే జమిలి జనరంజకం కాదు. 1967 నాటి పరిస్థితులు ఈనాడు లేవు. జమిలి ఎన్నికలు అనేది బీజేపీ అజెండాయే తప్ప జనం అజెండా కాదని గుర్తెరగాలి.

వ్యక్తిగత రుణాలపై ఆంక్షలు

భారతీయ బ్యాంకుల్లో పెరిగిపోతున్న వ్యక్తిగత(పర్సనల్) రుణాల నియంత్రణకు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా చర్యలు తీసుకుంటున్నది. అధిక వడ్డీలతో బ్యాంకుల లాభదాయకతను పెంచుతున్న ఈ రుణాల మంజూరు పట్ల బ్యాంకుల మధ్య పోటీ ఏర్పడి అడ్డు అదుపు లేకుండా పంపిణీ జరుగుతోంది. దీంతో వాయిదాలు చెల్లింపుల్లో అవరోధాలు ఏర్పడి నిరర్థక ఆస్తులు (ఎన్ పీ ఏ) కూడా బాగా పెరిగిపోవడంతో బ్యాంకింగ్ రంగం ఒక కుదుపునకు గురి అయింది.వ్యక్తిగత రుణాలు కట్టు తప్పడం, వాటి చెల్లింపుల్లో జాప్యం నెలకొనడం, దేశ ఆర్థికాభివృద్ధికి ఇది ఎంత మాత్రం సమంజసం కాదన్న విషయాన్ని ఆర్బీఐ గుర్తించి దిద్దుబాటు చర్యలు చేపట్టింది. ప్రస్తుతం నాలుగు శాతం రుణాలు చెల్లింపులు సక్రమంగా సాగడం లేదని పరిశీలనలు చెబుతున్నాయి. క్రెడిట్ కార్డు బకాయిలు రూ .1.94 లక్షల కోట్లకు చేరాయి. రుణ సంస్థలు జాగ్రత్తలు పడకపోతే అవి ఇంకా పెరిగిపోయే ప్రమాదం ఉంది. పారు బాకిలతో సతమతమవుతున్న బ్యాంకులకు వ్యక్తిగత రుణాలు గుదిబండగా మారితే దాని పర్యవసానం చాలా తీవ్రంగా ఉంటుంది. ఈ ఏడాది రెండో త్రై మాసికంలో వసూలు కావలసిన వ్యక్తిగత రుణాలు రూ. 48.26 లక్షల కోట్లకు చేరుకున్నాయి. కొన్ని రకాల వ్యక్తిగత రుణాలు వేగంగా పెరిగిపోతుండడంపై జాగ్రత్త వహించాలని గతంలో రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా గవర్నర్ శక్తి కాంత్ దాస హెచ్చరించినా కొన్ని బ్యాంకులు తేలికగా తీసుకున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో వ్యక్తిగత రుణాల విషయంలో బ్యాంకులు, ఆర్థిక సంస్థలు, బ్యాంకింగేతర ఆర్థిక సంస్థల దూకుడును నిలువరించడానికి రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కొత్త మార్గదర్శకాలను జారీ చేసింది. గృహ, విద్య, వాహన రుణాలు, బంగారం కొదవతో తీసుకున్న రుణాలను మినహాయిస్తూ వ్యక్తిగత రుణాల రిస్క్‌ను పెంచింది. ప్రతి వ్యక్తిగత రుణానికి బ్యాంకు, బ్యాంకింగే తర ఆర్థిక సంస్థల వద్ద ఉండాల్సిన పెట్టుబడిని 100 శాతం నుంచి 125 శాతానికి పెంచింది. క్రెడిట్ కార్డుల రుణాలు కూడా బ్యాంకుల వద్ద ఉండాల్సిన పెట్టుబడిని 125 శాతం నుంచి 150 శాతానికి పెంచింది. బ్యాంకింగే తర సంస్థలలో దాన్ని వంద నుంచి 125 శాతానికి పెంచింది. బ్యాంకింగేతర సంస్థలు బ్యాంకుల నుంచి సమకూర్చుకునే నిధుల రిస్క్ వెయిట్ ను 25 శాతానికి తీసుకెళ్లింది. ఈ చర్యల వల్ల వ్యక్తిగత రుణాలు ఇవ్వడం తగ్గుతుందన్న విశ్లేషణలు వినిపిస్తున్నాయి . అధిక వడ్డీ వచ్చే ఈ రుణాలకు వాణిజ్య బ్యాంకులు అధిక ప్రాధాన్యతనిస్తున్నాయి. 1999 -2000 ఆర్థిక సంవత్స రంలో రూ 1.31 లక్షల కోట్ల వ్యక్తిగత రుణాలు ఇచ్చారు. 2023 మార్చి నాటికి అవి రూ. 41.80 లక్షల కోట్లకు చేరాయి. వ్యక్తిగత రుణాలు ఇబ్బడి ముబ్బడిగా పెరిగిపోవడం ప్రమాద సంకేతం. మున్ముందు ఆర్థిక వ్యవస్థ మాంద్యానికి లోనైతే వ్యక్తులు, కుటుంబాల ఆదాయాలు పడిపోయి బ్యాంకు రుణాలను తీర్చలేని పరిస్థితులు ఏర్పడే ప్రమాదం ఉంది. అంతేకాక చాలామంది రూ. 50 వేల లోపు రుణాలను ఒకటికి మించి కూడా తీసుకుంటున్నారు. చాలా సందర్భాల్లో ఒకే వ్యక్తికి నాలుగు వరకు ఇలాంటి రుణాలు ఉంటున్నాయని క్రెడిట్ బ్యూరో నివేదికలు వెల్లడిస్తున్నాయి. పెరుగుతున్న జీవన వ్యయాలు, ఉద్యోగాలు కోల్పోవడం, ఆర్థిక మందగమనం లాంటి కారణాలతో వాయిదాలు చెల్లించడంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఫలితంగా ఉద్దేశపూర్వక ఎగవేత దారులుగా మారుతున్నారని నివేదికలు పేర్కొంటు న్నాయి. దీంతో పెద్ద బ్యాంకులు, బ్యాంకింగేతర ఆర్థిక సంస్థలకు ఈ మొండి బకాయిలు పేరుకు పోతున్నాయి. విలువపరంగా చిన్నవే అయినా కష్టం మాత్రం ఎక్కువే ఉంటుందని రుణ దాతలు భావిస్తున్నారు. రెండో త్రైమాసికంలో పలు బ్యాంకులు వెల్లడించిన ఫలితాల్లో రిటైల్ ఎన్పీఏలు తగ్గాయని ప్రకటించాయి. దీనికి ప్రధాన కారణం రుణాలను గతంలో ఇచ్చినంత వేగంగా ఇవ్వకపోవడమే. దానివల్ల ఎన్పిఏ లు ఒక పెట్టున విజృంభించి దేశ ఆర్థికానికి చేటు తెస్తాయి. కరోనా తర్వాత బ్యాంకింగ్ వ్యవస్థలో వేగంగా మార్పులు వచ్చాయి. ఆర్థిక సంస్థలకు కొత్త సాంకేతికతను మరింత అభివృద్ధిచేసి క్షణాల్లో అప్పులు ఇస్తున్నాయి. ఇటీవల కాలంలో బ్యాంకులు ఇదే విధానాన్ని అనుసరిస్తున్నాయి. ఫలి తంగా బ్యాంకుల దగ్గర రుణాలు వేగంగా వృద్ధి చెందాయి. బ్యాంకులు అందిస్తున్న మొత్తం రుణాల్లో ఈ హామీలేని రుణాలవాటా మూడేళ్ల క్రితం 4.5 శాతం ఉండగా గత ఆర్థిక సంవత్సరం చివరి నాటికి 7.4 శాతానికి చేరింది. రిటైల్ రుణాల్లోనూ 2019లో 18.6 శాతం వృద్ధి ఉంటే అందు లో హామీలేని రుణాలు 20.6 శాతం వరకు పెరిగాయి. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సూచనలు, స్థూల ఆర్థిక పరిస్థితుల నేపథ్యంలో ఇప్పుడు బ్యాంకులు కాస్త అప్రమత్తంగా వ్యవహరిస్తున్నాయి. ట్రాన్స్ యూనియన్ సిబిల్ నివేదిక ప్రకారం చూస్తే కొత్త వారి రుణదరఖాస్తులను ఆమోదిం చడం 2020లో 34 శాతం, 2021లో 28 శాతం వరకు ఉండగా, 2023చివరి త్రైమాసికం నాటికి 23 శాతానికి తగ్గాయి. దీన్ని బట్టి కొత్త రుణ గ్రహీతలను బ్యాంకులు కాస్త దూరం పెట్టాయి అని అర్థం చేసుకోవచ్చు.

గోపాలుని రాధాకృష్ణ
సెల్: 9885390232

కనిష్ఠ స్థాయికి దారిద్ర్యం- నిజమా, కలా!

మక్కెన సుబ్బారావు

మన దేశంలో నిరుపేదల సంఖ్య దేశ జనాభాలో 5 శాతం దిగువకు తగ్గినట్లు నేషనల్ శాంపిల్ సర్వే ఆర్గనైజేషన్ (ఎన్ఎస్ఎస్ఒ) గణాంకాలు తెలియజేస్తున్నాయి. నమ్మక తప్పదు. తమ పదేళ్లపాలనలో 20 కోట్లు మందిని దారిద్ర్యం నుండి బైటకు తెచ్చామని ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఇటీవల ప్రకటించాక మీరు 5 శాతం సంఖ్యను నమ్మనంటే మీలో ఏదో లోపం ఉన్నట్లే! ఎన్ఎస్ఎస్ఒ సర్వే ఫలితాలను గణాంక మంత్రిత్వశాఖ అసాధారణంగా శనివారం (24వ తేదీ) పొద్దుగుంకాక విడుదల చేసింది. తెల్లవారితే ఆదివారం సెలవుదినం. కాబట్టి దేశ ప్రజలకు ఈ శుభవార్త చెప్పడానికి సోమవారం దాకా ఆగటం మహాపరాధమవుతుందని సంబంధీకులు భావించి ఉండవచ్చు. 2022-23 సంవత్సరంలో నెలసరి తలసరి వ్యయం(ఎంపీసీఇ) ప్రాతిపదికగా ఈ నిర్ధారణ చేశారు. నీతి ఆయోగ్ సీఇఓ బివిఆర్ సుబ్రహ్మణ్యం దీన్ని సమర్థిస్తూ, చూశారా ఆహార ద్రవ్యోల్బణం అదుపు అంటూ రిజర్వుబ్యాంక్ దాని అమలుపైనే దృష్టిపెట్టింది. తాజా గణాంకాల ప్రకారం, ద్రవ్యోల్బణ స్థాయి తగ్గుతుంది. ఆర్‌బీఐ దీన్ని పరిగణలోకి తీసుకుని వృద్ధి ప్రోత్సాహంపై అనగా 'వడ్డీరేట్లు తగ్గింపుపై దృష్టి సారించాలి' అన్నారు. అంటే దేశ ప్రజలు బ్యాంకుల్లో పోగుచేసుకున్న డబ్బును నామమాత్రపు వడ్డీరేటుకు పెట్టుబడిదారులకు ధారపోయాలి, వారు అది భోంచేసి తనకు పరిశ్రమలు/కంపెనీలు దివాలా ప్రకటిస్తే, వాటిని ఐబిసి (ఇన్‌సాల్వెన్సీ-దివాలా) అండ్ బ్యాంక్ ట్రప్సీ కోడ్‌కు నివేదించి, రూపాయికి 10-25పైసలు కాబట్టి బ్యాంకుల కొంపముంచాలి. మోదీ ప్రభుత్వం 2016లో ఐబిసి తెచ్చింది. ఈ అప్పులుమారి కొంపను రిపేరు చేసుకునేందుకు, సామాన్య రుణగ్రహీతల నుండి వడ్డీ రుపేణా పిండిన లాభాన్ని ఆ నష్టాలకు సర్దుబాటుచేసి తమ ఆర్థిక నిర్వహణ సమర్థవంతమైనదిగా పాలకులు చాటుకునే అవకాశం కల్పించాలి. ఇదీ ఇప్పుడు సాగుతున్న, మున్ముందు సాగే రుణభాగోతం. మోదీ ప్రభుత్వం పదేళ్ల పాలనలో దాదాపు 15 లక్షల కోట్లు మొండి బాకీలను మాఫీ చేసింది. ఆ నష్టాన్ని బ్యాంకులు పైన చెప్పిన పద్ధతిలో భర్తీ చేసుకున్నాయి. నష్టపోయిందెవరు? ప్రజలు. లాభపడిందెవ్వరు కార్పొరేట్‌లు, ఇతర పారిశ్రామిక, వర్తక-వాణిజ్యవేత్తలు ఎగనామంపెట్టిన అప్పుల ముద్దుపేరు ఎన్‌పీఏలు (నిరర్థక ఆస్తులు). ఆశ్రిత పెట్టుబడిదారీ విధానంలో ఇదొక పార్శ్వం. అలా లక్షల కోట్లు దోచుకున్నవారికి శిక్షలేమీ ఉండవు. కొందరు ఘరానా పెద్దలు విదేశాలకు పోయినా ఏమీ చేయలేని నిస్సహాయత ప్రభుత్వానిది.ఇక అసలు విషయంలోకి వద్దాం. ఎన్ఎస్ఎస్ఓ ప్రతి ఐదేళ్లకు తలసరి గృహవినియోగం వ్యయం సర్వే గణాంకాలు ప్రచురించాలి. 2011-12 తర్వాత ఆ పద్ధతికి బ్రేకుపడింది. ఇప్పుడు 2022 ఆగస్టు-2023 జులై మధ్య సర్వే గణాంకాలు ప్రచురించారు. ఆ లెక్కలు ఎన్నికలకు ముందు ప్రభుత్వానికి అనుకూలంగా ఉన్నాయి కాబట్టి, 2012-18లో వినిమయం, ఉపాధిపై సర్వేలు నిర్వహించినా, ఫలితాలు మోదీ ప్రభుత్వానికి ఇబ్బందికరంగా ఉన్నందున ప్రభుత్వం వాటిని తొక్కిపెట్టింది. 2016 చివరిలో పెద్ద కరెన్సీనోట్ల చలామణీ రద్దుచేశాక ఆర్థికవ్యవస్థపై చూపిన దుష్ప్రభావాలు ఆ సర్వేలో ప్రతిఫలించినందున ప్రభుత్వం దాన్ని బుట్టలో పడేసింది. ఆ తర్వాత కాలంలో ప్రవేశపెట్టిన గూడ్స్ అండ్ సర్వీస్ టాక్స్ (జీఎస్టీ) విధానం కూడా ఆర్థిక వ్యవస్థను కుళ్లబొడిచింది. పెద్దనోట్ల రద్దు, జీఎస్టీలను తమ ఘనకార్యాలుగా (తప్పు ఒప్పుకునే అలవాటు లేదుకదా!) చెప్పుకునే మోదీ ప్రభుత్వం నల్లేరుపై నడకగా సాగుతున్న తమ ప్రయాణానికి భంగకరమైన వాస్తవాలను వెల్లడించే సర్వేలను ఎలా అనుమతిస్తుంది. మన భ్రమ, అత్యాశ కాకుంటే! పేదరికం, దారిద్ర్య నిర్మూలన పథకాల రూపకల్పన నిమిత్తం ప్రభుత్వాలు ప్రపంచవ్యాప్తంగా వాస్తవాల అధ్యయనానికై కమిటీలు వేస్తుంటాయి. మన దేశంలో కూడా వివిధ కాలాల్లో నియమించిన లక్డావాలా, సురేశ్ తెండూల్కర్, సి.రంగరాజన్ కమిటీలు అటువంటివే. అవి ఆహార, వినిమయం, వ్యయం ప్రాతిపదికంగా దారిద్ర్యరేఖ నిర్ణయిస్తుంటాయి. ప్రపంచబ్యాంక్ అంతర్జాతీయ దారిద్ర్యరేఖ నిర్ణయిస్తుంటుంది. కనీస ఆహారం, దుస్తులు, ఆవాసం నీటిపై వ్యయమే ప్రాతిపదిక. వైద్యం, విద్య రవాణా వగైరా పరిగణనలోకి తీసుకోదు. 2015 అంచనా ప్రకారం రోజుకు వ్యయం 1.25 డాలర్లు, 2022లో దాన్ని 2.15 డాలర్లకు సవరించారు. 2012లో ప్రపంచబ్యాంకు అంచనాల ప్రకారం ప్రపంచంలో 89.7 మిలియన్ నిరుపేదలున్నారు. 2022 నాటికి ఆ సంఖ్య 68.5 కోట్లకు తగ్గుతుంది. ఆదాయంలో కొద్దిపాటి పెరుగుదల ఒక వ్యక్తి జీవన నాణ్యతలో గణనీయమైన వ్యత్యాసం తీసుకురాదనేది దీనిపై ఉన్న విమర్శ. విద్య, ఆరోగ్యంపై వ్యయాన్ని నిర్దిష్టంగా అంచనా వేసేందుకు పారిశుద్ధ్యం, తాగునీరు, విద్యుచ్ఛక్తి ఆ వ్యక్తుల జీవితాలపై చూపే ప్రభావాన్ని కలుగజేసే అవకాశాలను పరిమాణాత్మకంగా లెక్క కట్టలేము. 2011లో సురేశ్ తెందుల్కర్ కమిటీ గ్రామీణ ప్రాంతాల్లో రోజుకు రూ.27.20, పట్టణప్రాంతాల్లో రూ.33.30 పైసలను దారిద్ర్యరేఖగా సిఫారసు చేసింది. 2014 జూన్‌లో నివేదిక సమర్పించిన రంగరాజన్ కమిటీ గ్రామీణ ప్రాంతాల్లో రోజుకు రూ.32.24 లోపు పట్టణప్రాంతాల్లో రూ.47లోపు ఆదాయార్జనను దారిద్ర్యరేఖగా నిర్ణయించింది. అంటే ఐదుగురి సభ్యుల కుటుంబానికి పట్టణాల్లో నెలకు కనీసం రూ.7035, గ్రామాలలో రూ.4860 ఆదాయం మించితే వారు దారిద్ర్యరేఖను అధిగమించినట్లే! ఆ లెక్కన పట్టణ జనాభాలో 26.4 శాతం మంది గ్రామీణ జనాభాలో 30.9శాతం దారిద్ర్యరేఖ దిగువన ఉన్నారు. అఖిలభారత సగటు 29.5శాతం. 2011, 2012 లో దేశం మొత్తం మీద 36.3 కోట్ల నుండి దారిద్ర్యరేఖ దిగువన ఉన్నారు. దీని ప్రకారం, 2009-2010లోని 39.6శాతం నుండి 2011-12 లోని 30.9శాతాన్ని తీసివేసే రెండేళ్లపైబడిన కాలంలో బిపిఎల్ కుటుంబాలు 8.7శాతం తగ్గాయి. అంటే 9.16 కోట్ల మందిని దారిద్ర్యం నుండి పైకి తెచ్చామని యుపిఏ ప్రభుత్వం చెప్పుకున్నది.. ఇప్పుడు మోదీ ప్రభుత్వమే దారిద్ర్యరేఖ నుండి 20 కోట్లమందిని గట్టెక్కించామంటోంది. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రీసెర్చర్స్ నెలకు తలసరి ఆదాయం గ్రామీణ ప్రాంతాల్లో రూ.1662, పట్టణప్రాంతాల్లో రూ.1929 కొత్త దారిద్ర్యరేఖగా అంచనావేశారు. గ్రామీణ దారిద్ర్యం 2011-12లో 25.7శాతం నుంచి 7.2శాతానికి, పట్టణాల్లో దారిద్ర్యం 4.6 శాతానికి తగ్గినట్లు వీరి అంచనా. కనీస ఆహారం, దుస్తులు, ఆవాసం మాత్రమే ఈ రేఖ నిర్ణయానికి ప్రమాణం అని మరిచిపోరాదు.

ఎన్ఎస్ఎస్ఒ ఏమి చెబుతున్నదంటే, 2011-12లో ఆమోదించిన దారిద్ర్యరేఖ రోజుకు. రూ.32కు అప్పటినుంచీ ఉన్నా ద్రవ్యోల్బణ ధోరణులను లెక్కలోకి తీసుకుంటే అది రోజుకు రూ.60 అవుతుంది. అప్పుడు దారిద్ర్యం 10శాతం లోపు ఉంటుంది. ఎందుకంటే, గ్రామీణ భారత్‌లోని దిగువ 5శాతం నుండి 10శాతం జనాభా సగటు వ్యయం రూ.1782 ఉంటుంది. నీతి ఆయోగ్ సీఈఓ సుబ్రహ్మణ్యం అవగాహన ప్రకారం, పీఎం గరీబ్ కల్యాణ్ అన్న యోజన లేదా సబ్సిడీకి గ్యాస్ సిలిండర్‌లు వంటి వాటి ద్వారా అందుకున్న ఆహార బదిలీలు, సబ్సిడీలను పరిగణనలోకి తీసుకుంటే, దారిద్ర్య బాధితులు 5శాతం లోపే ఉంటారు. అంతేగాక ఆరోగ్య సంరక్షణ, ఉచిత విద్య వంటి అంశాలను కూడా కలిపి చూడాలి అంటారు. ఎన్ఎస్ఎస్ఓ వారి తాజా కుటుంబ వినిమయ వ్యయం సర్వే (హెచ్‌సిఇఎస్) ప్రకారం, ఆహారం, పానీయాల మీద పేదలు పెడుతున్న ఖర్చు గ్రామీణ ప్రాంతాల్లో 52.9శాతం నుంచి 46.4 శాతానికి తగ్గింది. అదే విధంగా పట్టణప్రాంతాల్లో అది 39.2 శాతానికి తగ్గింది. దీన్నిబట్టి వినియోగదారుల ధరల సూచీ (సీపీఐ) ని సమూలంగా మార్చాల్సి ఉంటుంది. అందువల్ల రిజర్వుబ్యాంకు రిటైల్ ద్రవ్యోల్బణం గూర్చి పునరాలోచించాలి. దాని ప్రాతిపదికగా ఉన్న వడ్డీరేట్లను తగ్గించి వృద్ధి వేగం పెంపుదలకు తోడ్పడాలి. ఇదీ సుబ్రహ్మణ్యం ధోరణి. అయితే నిత్య జీవితావసర వస్తువుల ధరల పెరుగుదలను, ఆహారోత్పత్తుల ధరల్లో ఆకస్మిక ఎగుడు దిగుళ్లకు, పెరిగి కూర్చున్న విద్యుత్, ఆయిల్, వంటగ్యాస్ రేట్లు, విద్య, వైద్యం, రవాణా, ఇంటి అద్దెలు పెరుగుదల వగైరాలను పరిగణనలోకి తీసుకుని జీవన వ్యయాన్ని లెక్కిస్తే దారిద్ర్యరేఖను పెంపు చేయాల్సి ఉంటుంది. కాలంతోపాటు మనుషుల అవసరాలు వారు అట్టడుగువారైనా, మధ్య తరగతులైనా పెరుగుతూ ఉంటాయి. కేవలం కూడు, గుడ్డ, గూడు మాత్రమే మనిషిని ఈ 21 వ శతాబ్దంలో సంతృప్తి పరచవు. అంతేగాక తొందరపడి దారిద్ర్యరేఖ, ద్రవ్యోల్బణం, జీడీపీ అంచనాలను సవరించకూడదు. కుటుంబ వ్యయం ధోరణులు స్థిరంగా బలంగా ఉన్నాయో లేదో తెలుసుకునేందుకు ఈ జులైలో సమాప్తం కానున్న తాజా సర్వే కోసం వేచిచూడటం మంచిది. ఎందుకంటే, దారిద్ర్యం తగ్గుదల ప్రభావం కాగితాలపై లెక్కల్లోగాక ఆ శ్రేణి ప్రజల జీవనంలో ప్రతిఫలించాలి.

సీనియర్ జర్నలిస్టు, సెల్: 9390683756

సిక్కులను అవమానించిన బీజేపీ

సిక్కులంతా ఖలిస్థానీలని ఆర్ఎస్ఎస్, బీజేపీ నాయకులు అవమానిస్తోంది. తమ భావజాలం పరిధిలోకి సిక్కులు రాకపోవడం వల్లనే అవమానిస్తున్నారు. కాషాయ దళాలకు అంగీకృతులు కావాలంటే మోహన్ భగవత్, నరేంద్ర మోదీలు చెప్పినవి వినాలి. హిందూత్వను అనుసరించాలి. అయితే ఆర్ఎస్ఎస్, బీజేపీలు తమ అభిప్రాయాలకు అనుగుణంగా మెజారిటీ హిందూత్వ సమాజంలోకి కలుపులోకి పోయాయి. దేశంలోనేగాక, ప్రపంచవ్యాప్తంగా సిక్కులను ఖలిస్థానీలుగానే కాషాయదళాలు భావిస్తాయి. వాస్తవంగా ప్రపంచమంతటా సిక్కులపై ఇదేవిధమైన ప్రచారం సాగిస్తున్నారు.



నరేంద్ర మోదీపైన ఏమైనా వ్యాఖ్యానిస్తే వారిని ఖలిస్థానీలని పిలుస్తారు. ఈ కారణంగానే మనదేశానికి కెనడాతో సంబంధాలు దెబ్బతిన్నాయి. దేశంలో ప్రధాన స్రవంతి నుంచి సిక్కులను వేరుగా ప్రభుత్వం చూస్తోంది. రైతులు ఈ నెల 13న పంటలకు కనీసమద్దతు ధరను చట్టబద్ధం చేయాలని రైతులు మరోసారి పోరాటం ప్రారంభించారు. ఇతర రైతుల నుంచి సిక్కు రైతులను వేరు చేయాలని మోదీ ప్రభుత్వం కుట్రపన్నుతోంది. సిక్కులు దేశవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నారని వారు ఖలిస్థానీలుగా పిలుస్తున్నారు. పశ్చిమబెంగాల్‌లో సందేశ్‌ఖలీ పోలీసుస్టేషన్‌లో పనిచేస్తున్న స్పెషల్ ఎస్పీ జస్‌ప్రీత్‌సింగ్‌ను సీనియర్ బీజేపీ నాయకుడు సుబేందు అధికారి నాయకత్వంలో కొంతమంది బీజేపీ నాయకులు పోలీసుల ఉన్నతాధికారి అని కూడా చూడకుండా ఖలిస్తానీ అని అన్నారు. అంతేకాదు, ఆయన ఫొటోతీసి సోషల్ మీడియాలో పెట్టారు. ఆ తరువాత సింగ్‌ను బసిర్‌హట్ పోలీసు స్టేషన్‌లో ఇంటలిజెన్స్ విభాగంలో స్పెషల్ ఎస్పీగా పోస్టు చేశారు. వైరల్ అయిన వీడియోలో సింగ్ గుమిగూడిన సమూహానికి సమాధానం చెబుతూ కనిపించారు. "ఈ విషయంలో చర్య తీసుకోగలను అయితే తలమీద టర్బన్ పెట్టుకున్నాంగనుక వెనుకాడుతున్నాం. మీరునన్ను ఖలిస్థానీ అని పిలిచారా? అంతేగాని, నామతాన్ని గురించి ఏమీ చెప్పలేరుగదా...మీ మతంపైన ఎవరైనా, ఏమైనా వ్యాఖ్యానించారా? మరి నా మతంపై ఎందుకు వ్యాఖ్యానించారు? ఏ పోలీసు అయినా వ్యక్తిగతంగా టర్బన్‌ను ధరిస్తే అలాంటివారిని ఖలిస్తానీయులని అంటారా? మీ స్థాయి ఇదేనా? అని సుబేందు అధికారిని ప్రశ్నించారు. నిజంగా ఇది సిగ్గుచేటు. మంచి సంస్కృతి గలిగిన బెంగాలీ పౌరుడు ఇలా చేసినందుకు సిగ్గుతో తలవంచుకోవాలి. అని సింగ్ వ్యాఖ్యానించారు. ఇలాంటి ఘటనలు అనేకం జరుగుతున్నాయి. అయితే తాను అలా అనలేదని సుబేందు అధికారి సమాధానం చెప్పారు.

అరుణ్ శ్రీ వత్సవ

మహా పంచాయత్ జయప్రదం చేయాలి


కె.వి.వి. ప్రసాద్

పంటలకు కనీస మద్దతు ధరకు చట్టం చేయాలని ప్రధాని మోదీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ, మార్చి 14వ తేదీన న్యూఢిల్లీ రామ్‌లీలా మైదాన్‌లో కిసాన్ మజ్దూర్ మహాపంచాయత్‌ను నిర్వహించనున్నారు. రైతు, కార్మిక ప్రజాసంఘాల ఐక్యవేదిక పిలుపుమేరకు ఈ మహాపంచాయత్ జరుగుతోంది. వేలాదిమంది రైతులు, కార్మికులు పాల్గొని మోదీ కళ్లు తెరిపించి డిమాండ్ చేయాలని కిసాన్ సంయుక్త మోర్చా, కార్మిక, ప్రజాసంఘాలు పిలుపునిచ్చాయి. 2021లో కేంద్ర ప్రభుత్వం రూపొందించిన మూడు వ్యవసాయ నల్లచట్టాల రద్దు కోసం రైతాంగం 13 మాసాలపాటు నిర్వహించిన చారిత్రాత్మకమైన పోరాట విరమణ సందర్భంగా ప్రధాని నరేంద్రమోదీ రైతాంగానికి, దేశ ప్రజలకు క్షమాపణ చెప్పింది. కానీ కేంద్ర ప్రభుత్వం లిఖితపూర్వకంగా ఇచ్చిన హామీలు ఇప్పటి వరకు అమలు చేయలేదు. ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలుచేయాలని డిమాండ్ చేస్తూ మార్చి 14న మహాపంచాయత్ నిర్వహించాలని కిసాన్ సంయుక్త మోర్చా, కేంద్ర కార్మిక, ప్రజాసంఘాల సమన్వయ సమితులు నిర్ణయించాయి. న్యూ ఢిల్లీలోని రామ్‌లీలా మైదాన్‌లో మార్చి 14న జరిగే భారీ కిసాన్ మజ్దూర్ బహిరంగ సభ జరగనుంది. మహాపంచాయత్ జయప్రదం చేసేందుకు అన్ని రకాల ప్రయత్నాలు జరుగుతున్నట్లు ఉత్తర భారతదేశంలోని అన్ని రాష్ట్రాల నుండి రైతులు, కార్మికులను పెద్ద ఎత్తున సమీకరించే ప్రయత్నాలు జరుగుతున్నట్లు ఆయా సంఘాల నేతలు ఇప్పటికే ప్రకటించారు. ఫిబ్రవరి 22న ఢిల్లీలో పశ్చిమ బెంగాల్, ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, ఆంధ్రప్రదేశ్, కేరళ, హర్యానా, జార్ఖండ్, ఉత్తరాఖండ్, ఢిల్లీ, పంజాబ్ తదితర రాష్ట్రాలకు చెందిన 100 మందికిపైగా రైతుసంఘాల ప్రతినిధులు పాల్గొని ఐక్య కార్యాచరణ రూపొందించారు. 14వ తేదీకి ముందుగా అన్ని రాష్ట్రాల రాజధానులు, జిల్లా కేంద్రాల్లో పాదయాత్రలు, ర్యాలీలు నిర్వహించి కిసాన్ మహాపంచాయత్‌కు తరలి రావాల్సిన ఆవశ్యకతను తెలియచేప్పే ప్రయత్నాలు చేస్తున్నారు. మరోవైపు ఫిబ్రవరి 26 నుండి 29 వరకు అబూదాబీలో జరిగిన ప్రపంచ వాణిజ్య సంస్థ (డబ్ల్యు.టి.ఒ.) సమావేశాల ప్రారంభాన్ని పురస్కరించుకొని ఫిబ్రవరి 26న క్విట్ డబ్ల్యుటీఒ దినోత్సవాన్ని దేశవ్యాప్తంగా నిర్వహించారు. రైతు, కార్మిక, ప్రజాసంఘాల కార్యకర్తలతోపాటు ప్రజానీకం పెద్దయెత్తున పాల్గొన్నారు. పల్లె నుండి ఢిల్లీ దాకా ట్రాక్టర్లు, ఎడ్లబండ్లు, మోటార్ సైకిల్ ర్యాలీలు, కేంద్ర ప్రభుత్వ కార్యాలయాల వద్ద నిరసనలు వెల్లువెత్తాయి. డబ్ల్యు.టి.ఒ. నుండి వ్యవసాయాన్ని దూరంగా ఉంచాలని భారతదేశ ఆహార భద్రతను తాకట్టుపెట్టే చర్యలను కేంద్ర ప్రభుత్వం విడనాడాలని, వ్యవసాయ ఉత్పత్తులకు మద్దతు ధరల గ్యారంటీ చట్టం తేవాలని, రైతుల రుణభారాన్ని తగ్గించేందుకు దేశవ్యాప్తంగా ఒక్క పర్యాయం రుణమాఫీ చేయాలని, రుణవిమోచన చట్టం తేవాలని అభివృద్ధి చెందిన దేశాలు డిమాండు చేస్తున్న విధంగా సుంకాలను తగ్గించడం ద్వారా మార్కెట్ ఎగుమతిదారులకు అందుబాటును పెంచే ప్రతిపాదనలను భారత ప్రభుత్వం వ్యతిరేకించాలని సంయుక్త కిసాన్ మోర్చా భాగస్వామ్య సంఘాలు డిమాండు చేశాయి. నరేంద్ర మోదీ ప్రభుత్వం రాబోయే పార్లమెంటు ఎన్నికల్లో గెలిచి తిరిగి అధికారం దక్కించుకోవాలనే తపనతో ప్రముఖ రైతు నాయకులు, మాజీ ప్రధాని చౌదరి చరణ్ సింగ్, ప్రముఖ వైద్యులు, వ్యవసాయ శాస్త్రవేత్త డా॥ యం.యస్. స్వామినాథన్‌లకు భారత రత్న పురస్కారాలను ఇచ్చింది. కానీ దేశ రైతాంగం కోరుతున్న గిట్టుబాటు ధరల గ్యారంటీ చట్టం, రుణ మాఫీ, వ్యవసాయ సబ్సిడీల కొనసాగింపు తదితర డిమాండ్లతోపాటు రైతు చట్టాల ఉపసంహరణ సందర్భంగా కేంద్రం ఇచ్చిన ఏ ఒక్క హామీని అమలుచేసేందుకు సిద్ధంగా లేదు. గతంలో రైతాంగ ఆత్మహత్యలను నిరోధిస్తామని, రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేస్తామని, స్వామినాథన్ కమిషన్ సిఫార్సుల అమలులాంటి వాగ్దానాలను మోదీ అటకెక్కించారు. రైతుల మనసుల్లో మోసకారిగా ముద్ర వేసుకున్నారు. కార్పొరేట్లకు ఊడిగం చేసే జీతగాడిగా మారిపోయారు. ఈ దశలో రైతులకిచ్చిన హామీల అమలుకోసం కిసాన్ సంయుక్త మోర్చా, కేంద్ర కార్మిక సంఘాల ఐక్య వేదిక కేంద్ర ప్రభుత్వ దుర్నీతిని ఎండగడుతూ మరో ఉద్యమానికి శ్రీకారం చుట్టాయి. వివిధ దశలలో ఆందోళనలు కొనసాగుతున్న నేపథ్యంలో కొన్ని రైతు సంఘాలు ఫిబ్రవరి 13న ఛలో ఢిల్లీ నిర్వహించాయి. రైతులు ఢిల్లీకి రాకుండా మోదీ నరహంతక ప్రభుత్వం మరోమారు హర్యానా సరిహద్దుల్లోనే రైతాంగాన్ని నిలిపివేసింది. రైతుల ఉద్యమంపై అవాకులు, చెవాకులు పేలుతూ రహదారులపై పలు రూపాల్లో అడ్డంకులు సృష్టించింది. శాంతియుతంగా సమస్యను పరిష్కరిద్దామన్న మంచి మనసు మోదీ ప్రభుత్వానికి లేక పోవడం దురదృష్టకరం. కేంద్ర ప్రభుత్వ ఆదేశాలతో హర్యానా ప్రభుత్వం రైతాంగంపై దమనకాండకు పూనుకొని కాల్పులు జరిపింది. పంజాబ్‌కు చెందిన యువ రైతు శుభకరణ్ సింగ్ నేలకొరిగారు. మరో నలుగురు రైతులు ఉద్యమస్థలిలో గుండెపోటుతో మరణించారు. వందలాదిమంది గాయాలపాలయ్యారు. అనేక ట్రాక్టర్లు పోలీసులు జరిపిన దాడిలో ధ్వంసమయ్యాయి. మొదటి దశ ఉద్యమంలో సుమారు 740 మందికి పైగా రైతులు అమరులయ్యారు. వేలాదిమంది రైతులపై కేసులు పెట్టబడ్డాయి. అయినా నరేంద్రమోదీ కార్పొరేట్ గుండె ఏ మాత్రం కరగలేదు. చలించలేదు. ఇక మిగిలింది రైతులకు పోరాటమే మార్గం.

ఏపీ రైతు సంఘం ప్రధానకార్యదర్శి,
సెల్:9490952737

టీఎంసీ నేత షాజహాన్ అరెస్టు

- 10 రోజుల పోలీస్ కస్టడీ... పార్టీ నుంచి ఆరేళ్లు బహిష్కరణ
- 'సందేశ్‌ఖలీ' కేసులపై బెంగాల్ సీఐడీ దర్యాప్తు
- తృణమూల్-బీజేపీ మాటల యుద్ధం

కోల్‌కతా: పశ్చిమబెంగాల్‌లోని సందేశ్‌ఖలీలో మహిళలపై లైంగిక వేధింపులకు పాల్పడిన్నట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న టీఎంసీ నాయకుడు షేక్ షాజహాన్‌ను పోలీసులు ఎట్టకేలకు అరెస్టు చేశారు. ఉత్తర 24 పరగణాల జిల్లా మినాఖాలోని ఓ ఇంట్లో ఉన్న షాజహాన్‌ను గురువారం ఉదయం అదుపులోకి తీసుకుని బసిర్‌హాట్ కోర్టుకు తరలించినట్లు పోలీసులు వెల్లడించారు. న్యాయస్థానం షాజహాన్‌కు 10 రోజుల పోలీసు కస్టడీ విధించింది. రాష్ట్ర పోలీసులు 14 రోజుల కస్టడీ కోరగా కోర్టు 10 రోజులు కస్టడీ విధించింది. షాజహాన్‌ను బెంగాల్ పోలీసులు కోల్‌కతాలోని భబానీ భవన్‌కు తరలించారు. కాగా షాజహాన్‌పై నమోదైన కేసులపై బెంగాల్ సీఐడీ దర్యాప్తు చేపట్టింది. అయితే షేక్ షాజహాన్‌ను లైంగిక వేధింపుల కేసులో అరెస్ట్ చేయలేదని దక్షిణ బెంగాల్ అడిషినల్ డీజీ సుప్రతిమ్ సర్కార్ తెలిపారు. ఈడీ అధికారులపై దాడి చేసిన కేసులో అరెస్ట్ చేసినట్లు చెప్పారు. జనవరి 5న జరిగిన ఈ దాడి ఘటనలో షాజహాన్ ప్రధాన నిందితుడని పేర్కొన్నారు. 'ఈ కేసు సెక్షన్ 354కి సంబంధించినది కాదు. షాజహాన్‌పై చాలా కేసులు ఉన్నాయి. ఫిబ్రవరి 8, 9న నమోదైన కేసులన్నీ రెండు నుంచి మూడేళ్ల క్రితం జరిగిన ఘటనలకు సంబంధించినవి. ముఖ్యంగా రెండేళ్ల క్రితం జరిగిన వాటిని దర్యాప్తు చేయడానికి, సాక్ష్యాలను సేకరించడానికి సమయం పడుతుంది' అని ఏడీజీ తెలిపారు. కాగా షాజహాన్ కు వ్యతిరేకంగా నమోదైన కేసులపై సీఐడీ దర్యాప్తు చేయనుంది. అతడిని ప్రశ్నించేందుకు పోలీస్ ప్రధాన కార్యాలయం భవానీభవన్‌కు తరలించినట్లు సీఐడీ అధికారి తెలిపారు. కాగా పోలీసులు అరెస్టు చేసిన కొన్ని గంటల తర్వాత షేక్ షాజహాన్‌ను ఆరేళ్ల పాటు పార్టీ నుంచి సస్పెండ్ చేస్తున్నట్లు తృణమూల్ కాంగ్రెస్ ప్రకటించింది. షాజహాన్ షేక్ ఇంట్లో జనవరి 5న తనిఖీల కోసం వెళ్లిన ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ)బృందంపై ఓ మూక దాడి చేసినప్పటి నుంచి ఆయన కనిపించకుండా పోయారు. అప్పటి నుంచి దాదాపు 50 రోజులకు పైగా ఆయన పరారీలో ఉన్నారు. కాగా సందేశ్‌ఖలి ప్రాంతంలో అనేక మంది మహిళలపై రోజుల తరబడి లైంగిక వేధింపులకు పాల్పడి వారి భూమిని లాక్కున్న కేసులో షేక్ షాజహాన్ ప్రధాన నిందితుడు. ఆయన అరెస్టును డిమాండ్ చేస్తూ సందేశ్‌ఖలీ ప్రాంత ప్రజలు హింసాత్మక నిరసనలు చేపట్టారు. ఈడీ, సీబీఐ సైతం ఆయన్ను అరెస్టు చేయొచ్చని కలకత్తా హైకోర్టు బుధవారమే స్పష్టం చేసింది.

'ప్రజాస్వామ్యం అంటే ఇదే'

షేక్ షాజహాన్ అరెస్టుపై పశ్చిమ బెంగాల్ గవర్నర్ సీవీ ఆనంద బోస్ స్పందించారు. 'ప్రజాస్వామ్యం అంటే ఇదే. దీని కోసమే ఇప్పటి వరకు ఎదురు చూశాం. అది ఇప్పుడు జరిగింది. ఇది అందరికీ గుణపాఠాన్ని నేర్పిస్తుంది. ఇప్పటి నుంచైనా బెంగాల్‌లో చట్టబద్ధమైన పరిపాలన ఉంటుందని ఆశిస్తున్నా' అని గవర్నర్ ఆనంద బోస్ అన్నారు. షాజహాన్ షేక్‌ను 72 గంటల్లోగా అరెస్టు చేయాలని.. లేనిపక్షంలో అందుకు కారణాలను తనకు నివేదించాలని గవర్నర్ సోమవారం రాత్రి రాష్ట్ర ప్రభుత్వానికి లేఖ రాశారు. లేదంటే తానే సందేశ్‌ఖలీకి మకాం మారుస్తానన్నారు. ఉత్తర 24 పరగణాల జిల్లాలో దుండగులు ఓ చిన్నారిని విసిరేశారన్న ఘటనపై విచారణ జరపాలని, అది నిజమని తేలితే కఠిన చర్యలు తీసుకోవాలని కూడా గవర్నర్ లేఖలో పేర్కొన్నారు. షాజహాన్‌ను అరెస్టు చేయాలని సోమవారం కోల్‌కతా హైకోర్టు ఆదేశాలు జారీ చేసిన విషయం తెలిసిందే.

మా నిరసనల వల్లే అరెస్ట్: బీజేపీ

షేక్ షాజహాన్ అరెస్ట్ ఓ స్క్రిప్ట్ అని పశ్చిమబెంగాల్ బీజేపీ అధికార ప్రతినిధి సమిక్ భట్టాచార్య పేర్కొన్నారు. 'టీఎంసీ, రాష్ట్ర పోలీసులు దోషులను రక్షించారు. అధికార పార్టీ రాసుకున్న స్క్రిప్ట్‌లో భాగంగా ఇప్పుడు అరెస్టు చేశారు' అని భట్టాచార్య విమర్శించారు. బీజేపీ నిరంతర ఆందోళన కారణంగానే టీఎంసీ ప్రభుత్వం షేక్ షాజహాన్ అరెస్ట్ చేసిందని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు సువేందు అధికారి అన్నారు. 'బీజేపీ, సందేశ్‌ఖలీలోని మహిళల నిరసనల కారణంగానే మమతా బెనర్జీ ప్రభుత్వం షాజహాన్‌ను అరెస్ట్ చేయాల్సి వచ్చింది' అని సువేందు తెలిపారు. కాగా సీబీఐ, ఈడీ అరెస్టు నుంచి కాపాడటానికే రాష్ట్ర పోలీసులు షాజహాన్‌ను అరెస్టు చేసిందని పశ్చిమబెంగాల్ బీజేపీ సహ-ఇన్‌ఛార్జి అమిత్ మాలవ్య 'ఎక్స్' వేదికగా ఆరోపించారు. ఇకమీదట సీఎం మమతాబెనర్జీకి రక్షణగా ఉన్నట్లు వారు షాజహాన్‌కు కూడా రక్షణగా ఉంటారని ఎద్దేవా చేశారు.

'రాష్ట్ర పోలీసులపై మాకు నమ్మకం ఉంది'

మరోవైపు షేక్‌షాజహాన్‌ను అరెస్ట్ చేసిన బెంగాల్ పోలీసులను టీఎంసీ నేతలు ప్రశంసిస్తున్నారు. 'మొదట కోర్టు స్టే ఆర్డర్ కారణంగా షాజహాన్‌ను పోలీసులు అరెస్టు చేయలేకపోయారు. అరెస్టుపై ఎటువంటి స్టే లేదని కోర్టు స్పష్టం చేయటం వల్ల బెంగాల్ పోలీసులు తమ పని పూర్తి చేశారు. రాష్ట్ర పోలీసుల సామర్థ్యంపై మాకు నమ్మకం ఉంది. అందుకే ఏడు రోజుల్లో షాజహాన్‌ను అరెస్ట్ చేస్తామని చెప్పాం. కానీ, స్టే ఆర్డర్ తొలగించిన రెండు మూడు రోజుల్లోనే షాజహాన్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు' అని టీఎంసీ అధికార ప్రతినిధి కునాల్ ఘోష్ పేర్కొన్నారు.

షాజహాన్‌పై 100 ఫిర్యాదులు

షాజహాన్ అరెస్టు చేయాలని మహిళలు నిరసన తెలుపుతున్నప్పటి నుంచి ఆయనపై, ఆయన సహచరులపై 100కు పైగా ఫిర్యాదులు నమోదైనట్లు పోలీసులు తెలిపారు. ఫిర్యాదుల ఆధారంగా కొన్ని కేసుల్లో 376డి (గ్యాంగ్ రేప్) సెక్షన్ కూడా పెట్టినట్లు తెలిపారు. ఇటువంటి అభియోగాలపైనే షాజహాన్ సహచరులు షిబాప్రసాద్, ఉత్తమ్‌సర్దార్‌ను ఇంతకుముందు అరెస్టయ్యారు. భూకబ్జాల కేసులో మరో సహచరుడు అజిత్ మైతీని అరెస్టు చేసినట్లు పోలీసులు తెలిపారు.

స్థానికుల సంబరాలు

షాజహాన్ అరెస్టు నేపథ్యంలో సందేశ్‌ఖలీలో స్థానికులు సంబరాలు చేసుకున్నారు. ఒకరికొకరు స్వీట్లు తినిపించుకుని నృత్యాలు చేస్తూ హర్షం వ్యక్తం చేశారు. "చివరికి అతడి అరెస్టుతో మేం చాలా సంతోషంగా ఉన్నాం. అతడిని కటకటాల వెనక్కి నెడితే ఎప్పటికీ తిరిగి ఈ ప్రాంతానికి రాడన్న నమ్మకం ఉంది. ఈ ప్రాంతంలో చాలామంది జీవితాలను నాశనం చేశాడు" ఒక స్థానికుడు తెలిపారు. ఓ మహిళ మాట్లాడుతూ షాజహాన్ ఇతర సహచరులను కూడా జైల్లో వేస్తారన్న నమ్మకం ఉందన్నారు.

కొత్త పార్లమెంటు భవనం ఫైవ్ స్టార్ జైలు

సంజయ్ రౌత్

ముంబై : కొత్త పార్లమెంటు భవనం ఫైవ్ స్టార్ జైలు అని మహారాష్ట్రకు చెందిన శివసేన (యూబీటీ) నేత, ఆ పార్టీ ఎంపీ సంజయ్ రౌత్ వ్యాఖ్యానించారు. పార్లమెంటు పని తీరు తీవ్రంగా దెబ్బతిన్నదని విమర్శించారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ న్యూఢిల్లీలోని సెంట్రల్ విస్తా పరిస్థితిని ప్రతి ఒక్కరూ చూడాలన్నారు. ఎంపీలు ఎదుర్కొంటున్న సమస్యలపై అసంతృప్తి వ్యక్తం చేశారు. 'కొత్త పార్లమెంటు పని చేయలేని ఫైవ్ స్టార్ జైలు లాంటిది' అని వ్యాఖ్యానించారు. ప్రతిపక్ష 'ఇండియా కూటమి' కేంద్రంలో అధికారంలోకి వస్తే చారిత్రక పాత పార్లమెంటు భవనానికి పార్లమెంటు సమావేశాలను మార్చాలన్నది తమ పార్టీ ఉద్దేశమని తెలిపారు. 'మేము ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసినప్పుడు, మన చారిత్రక పార్లమెంటులో సమావేశాలు నిర్వహిస్తాం' అని అన్నారు. కాగా, రాబోయే లోక్‌సభ ఎన్నికల్లో ఎన్‌డీఏ కూటమి 400 కంటే ఎక్కువ సీట్లు గెలుచుకుంటుందన్న ప్రధాని మోదీ వ్యాఖ్యలకు సంజయ్ రౌత్ కౌంటర్ ఇచ్చారు. 543 లోక్‌సభ స్థానాలకుగాను 600 సీట్లు గెలుచుకుంటామని ప్రగల్భాలు పలికితే మహారాష్ట్ర ప్రజలు చప్పట్లు కొడతారని అన్నారు. 2024 ఎన్నికల్లో 400కు బదులు 600 సీట్లు టార్గెట్‌గా ప్రధాని మోదీ పెట్టుకోవాలని ఎద్దేవా చేశారు.

సివిల్, క్రిమినల్ కేసుల్లో స్టే ఆర్డర్ ఆటోమేటిక్‌గా రద్దు కాదు : సుప్రీం



న్యూఢిల్లీ : సివిల్, క్రిమినల్ కేసుల్లో దిగువ కోర్టు లేదా హైకోర్టు ఇచ్చిన స్టే ఆర్డర్ ఉత్తర్వులు ఆరు నెలల తర్వాత ఆటోమేటిక్‌గా రద్దు కావని సుప్రీం కోర్టు తెలిపింది. ప్రధాన న్యాయమూర్తి డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని ఐదుగురు న్యాయమూర్తులతో కూడిన రాజ్యాంగ ధర్మాసనం గురువారం ఈ మేరకు స్పష్టం చేసింది. దిగువ కోర్టుల స్టే ఆర్డర్లను ప్రత్యేకంగా పొడిగించకపోతే అవి రద్దు అవుతాయన్న 2018 నాటి సుప్రీం కోర్టు తీర్పుతో తాము ఏకీభవించడం లేదని రాజ్యాంగ ధర్మాసనం తెలిపింది. కాగా, కేసుల పరిష్కారానికి కాలక్రమాన్ని నిర్ణయించడం రాజ్యాంగ ధర్మాసనం, సుప్రీం కోర్టు, హైకోర్టులు మానుకోవాలని సూచించింది. కేవలం అసాధారణ పరిస్థితులలో మాత్రమే అలా చేయవచ్చని పేర్కొంది. ఈ మేరకు వేర్వేరుగా రెండు ఏకకాల తీర్పులను గురువారం ప్రకటించింది. సివిల్, క్రిమినల్ కేసుల్లో స్టే ఆర్డర్ ఆటోమేటిక్‌గా రద్దు కాదని న్యాయమూర్తి ఎ.ఎస్.ఓఖా తెలిపారు. అలాగే మార్గదర్శకాలకు సంబంధించి విడిగా, ఏకకాలిక తీర్పును న్యాయమూర్తి పంకజ్ మిథాల్ వెల్లడించారు.

'ఆయనపై 43 కేసులు... మీరు పదేళ్లు బిజీ'

షాజహాన్ బెయిల్ పిటిషన్‌పై హైకోర్టు

కోల్‌కతా : ఉత్తర 24 పరగణాల జిల్లాకు చెందిన సందేశ్‌ఖలీలో గిరిజన మహిళలపై వేధింపులు, భూ ఆక్రమణల్లో ప్రధాన నిందితుడు, టీఎంసీ నాయకు షాజహాన్ షేక్ బెయిల్ పిటిషన్‌పై కలకత్తా హైకోర్టు తీవ్ర వ్యాఖ్యలు చేసింది. 'ఆయనపై 43 కేసులు... మీరు పదేళ్లు బిజీ... ఆయనపై ఎలాంటి సానుభూతి లేదు' అని న్యాయస్థానం స్పష్టం చేసింది. షాజహాన్‌ను పశ్చిమ బెంగాల్ పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. గురువారం షాజహాన్ బెయిల్ పిటిషన్‌పై హైకోర్టులో విచారణ జరిగింది. 'నా క్లైంట్ ముందస్తు బెయిల్ తిరస్కరణకు గురైంది. ఆయన్ను నిన్న రాత్రి అరెస్టు చేశారు' అని నిందితుడు తరపు న్యాయవాది వాదనలు వినిపించారు. ఈ సందర్భంగా ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ టి.ఎస్.శివజ్ఞానం మాట్లాడుతూ 'ఈ వ్యక్తిపై 43 కేసులు ఉన్నాయి. మరో 10 సంవత్సరాలు ఆయన మిమ్మల్ని బిజీగా ఉంచుతారు. మీరు మళ్లీ సోమవారం రండి. తీవ్ర నేరారోపణలు ఎదుర్కొంటోన్న ఈ వ్యక్తిపై ఎలాంటి సానుభూతి లేదు' అని వ్యాఖ్యానించారు.

ఏ పథకాన్ని అడ్డుకున్నామో మోదీ చెప్పాలి

ఓటమి భయంతో డీఎంకేపై బురదజల్లే యత్నం: స్టాలిన్

చెన్నై: కేంద్రప్రభుత్వ పథకాల్లో ఏ పథకాన్ని రాష్ట్రంలో అమలు చేయలేదో ప్రధాని మోదీ చెప్పాలని తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ సవాల్ చేశారు. ఓటమి భయంతో డీఎంకేపై బురదజల్లేందుకు ప్రయత్నించారని దుయ్యబట్టారు. నీట్, సీఏఏ, ఎన్ఈపీ (నూతన విద్యా విధానం), వివాదాస్పద మూడు సాగు చట్టాలు మినహా దేనినీ డీఎంకే ప్రభుత్వం అడ్డుకోలేదని స్టాలిన్ తెలిపారు. జాలి లేని ప్రభుత్వానికి నాయకుడు మోదీ అని విమర్శించారు. రాష్ట్రాలకు నిధులు నిరాకరిస్తుందని, అప్పు కూడా చేయనివ్వదని, కనీసం వరద సహాయ నిధిని విడుదల చేయదని కేంద్రాన్ని దుయ్యబట్టారు. ఇలాంటి ప్రభుత్వానికి డీఎంకేను విమర్శించే హక్కు లేదని స్టాలిన్ అన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించేందుకు ఫాసిజాన్ని, మతవాదాన్ని ఓడించడంతో పాటు విపక్ష ఇండియా కూటమి గెలిపించే బాధ్యత డీఎంకేపై ఉందన్నారు. తమిళనాడులో 39, పుదుచ్చేరిలో ఒకటి కలిపి మొత్తం 40 లోక్‌సభ స్థానాలను గెలుచుకునేందుకు ప్రతి కార్యకర్త కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఇదే తన పుట్టినరోజుకు మధుర కానుక, డీఎంకే వ్యవస్థాపకుడు ఎం.కరుణానిధి జయంతికి నిజమైన నివాళి అని స్టాలిన్ అన్నారు. కాగా, మోదీ బుధవారం తిరునెల్వేలి సభలో డీఎంకే ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు.

కేంద్ర పథకాల అమలుకు సహకరించడం లేదని ఆరోపించారు.

కార్మిక సంఘాల సూచనలు కేంద్రానికి పట్టడంలేదు

కార్మిక చట్టాల సవరణలపై పినరయి విజయన్



తిరువనంతపురం: కార్మిక చట్టాలకు సవరణలపై కార్మిక సంఘాల అభిప్రాయాలను కేంద్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదని కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ విమర్శించారు. ముఖ్యమంత్రితో ముఖాముఖి కార్యక్రమంలో భాగంగా ఆయన గురువారం కొల్లాంలో కార్మికులతో మాట్లాడారు. 'కార్మిక చట్టాలను సవరించే దశలో కార్మిక సంఘాల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోవాలని కేంద్రం భావించడం లేదు. టీయూల సలహాలు, సూచనలను పట్టించుకోవడం లేదు. ఇలా ఏకపక్షంగా కార్మిక చట్టాలను సవరిస్తేగనుక ఇప్పటివరకు సాధించుకున్నవన్నీ తుంగలో తొక్కబడతాయి. కార్మిక రంగానికి జరిగిన మంచి మిగలదు' అని విజయన్ అన్నారు. కేంద్రప్రభుత్వ చర్యకు వ్యతిరేకంగా కార్మిక సంఘాలన్నీ ఏకతాటిపైకి రావడాన్ని మెచ్చుకున్నారు. ఎక్కువ జీతాలు, మెరుగైన పని పరిస్థితుల సాధనలో కార్మిక సంఘాలు విఫలమైతే... సమాజంలో అసమానత్వం పెరుగుతుందని, వేతనాలు తగ్గుతాయని హెచ్చరించారు. గత పదేళ్లుగా దేశంలో జరుగుతున్నది ఇదేనని, ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాలు వేతనాల్లో తగ్గుదల నమోదవుతున్నట్లు ఇండియా లేబర్ బ్యూరో పేర్కొన్నదని విజయన్ చెప్పారు. జీడీపీలో వృద్ధి గురించి కేంద్రప్రభుత్వం మాట్లాడుతోందని కానీ దాని వల్ల ప్రజల జీవితాల్లో ప్రయోజనాలు ప్రతిబింబించడం లేదన్నారు. కేంద్రప్రభుత్వ చట్టాల ప్రభావం కార్మికులపై పడకుండా నివారించేందుకు దీటుగా రాష్ట్ర చట్టాలు రూపొందుతున్నట్లు తెలిపారు. కార్మికుల ప్రయోజనాల పరిరక్షణకు కేరళ ప్రభుత్వం కట్టుబడి ఉందని విజయన్ నొక్కిచెప్పారు.

ఎయిరిండియాకు రూ.30 లక్షల జరిమానా

వీల్‌చైర్ లేక వృద్ధుడి మృతి ఘటనపై డీజీసీఏ చర్యలు

ముంబై : వీల్‌చైర్ సదుపాయం కల్పించకపోవడంతో ఓ వృద్ధుడు నడుచుకుంటూ వెళ్లి కుప్పకూలిపోయిన ఘటన ముంబై విమానాశ్రయంలో ఇటీవల చోటుచేసుకున్న విషయం తెలిసిందే. ఈ ఘటనను తీవ్రంగా పరిగణించిన డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (డీజీసీఏ) ఎయిరిండియాపై చర్యలు తీసుకుంది. విమాన సేవల్లో అలసత్వం వహించినందుకు రూ.30 లక్షల జరిమానా విధించింది. అమెరికా నుంచి ఎయిరిండియా విమానంలో భారత్‌కు వచ్చిన వృద్ధ దంపతులు ముంబైలోని ఛత్రపతి శివాజీ మహరాజ్ విమానాశ్రయంలో ఫిబ్రవరి 12న దిగారు. సిబ్బంది వీల్‌చైర్ సదుపాయం కల్పించకపోవడంతో ఆ వృద్ధుడు (80) విమానం నుంచి టెర్మినల్ వరకు నడుచుకుంటూ వెళ్లాడు. ఇమిగ్రేషన్ విభాగం వద్దకు చేరుకున్న ఆయన ఒక్కసారిగా కుప్పకూలిపోయాడు. వెంటనే ఆస్పత్రికి తీసుకెళ్లగా మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. ఈ ఘటనపై వివరణ ఇవ్వాలని ఎయిరిండియాకు డీజీసీఏ షోకాజ్ నోటీసులు జారీ చేసింది. దీనిపై ఎయిరిండియా వివరణ ఇచ్చింది. ప్రయాణికుడి భార్యకు వీల్‌చైర్ సమకూర్చామని ఎయిరిండియా పేర్కొంది. వీల్‌చైర్లకు భారీ డిమాండు ఉన్నందున మరొకటి సమకూర్చేవరకు కొద్దిసేపు వేచి ఉండాలని వారిని విజ్ఞప్తి చేసినట్లు తెలిపింది. బాధితుడు మాత్రం తన భార్యతో కలిసి టెర్మినల్ వరకు నడుచుకుంటూ వచ్చాడని... ఇమిగ్రేషన్ తనిఖీ కోసం వేచి చూస్తుండగా తీవ్ర అనారోగ్యానికి గురైనట్లు వివరించింది. ఎయిరిండియా స్పందనను పరిశీలించిన డీజీసీఏ... వీల్‌చైర్ సమకూర్చడంలో విమానయాన సంస్థ అలసత్వం వహించిందని తేల్చింది. ఇందుకు రూ.30 లక్షల జరిమానా విధించింది. ఈ సందర్భంగా ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా తగిన సంఖ్యలో వీల్‌చైర్లను అందుబాటులో ఉంచుకోవాలని అన్ని విమానయాన సంస్థలకు డీజీసీఏ అడ్వైజరీ జారీ చేసింది.

స్ట్రీట్ ఛాయ్‌ను ఆస్వాదించిన బిల్‌గేట్స్



న్యూఢిల్లీ : మైక్రోసాఫ్ట్ సహ వ్యవస్థాపకులు బిల్ గేట్స్ తన భారత పర్యటన నుంచి ఓ వీడియోను షేర్ చేశారు. టీని ఆస్వాదిస్తూ ఆయన స్థానిక సంస్కృతిని అనుభూతి చెందారు. సామాజిక మాధ్యమాల్లో ప్రస్తుతం తెగ వైరలవుతున్న ఈ వీడియోలో డాలీ ఛాయ్‌వాలా నిర్వహిస్తున్న టీ స్టాల్‌లో బిల్ గేట్స్ సందడి చేశారు. భారత్‌లో దైనందిన జీవితంలో వినూత్నత ఉట్టిపడుతుందని ఇన్‌స్టాగ్రాం పోస్ట్‌లో గేట్స్ పేర్కొన్నారు. ఈ వీడియో క్లిప్ గేట్స్ వన్ ఛాయ్ ప్లీజ్ అని కోరుతుండటంతో ప్రారంభమవుతుంది. టీ విక్రేత ప్రత్యేకమైన బండిలో టీ తయారు చేసే వినూత్న పద్ధతి ఆకట్టుకుంటుందని గేట్స్ పేర్కొన్నారు. భారత్‌కు తిరిగి రావడం పట్ల ఉద్వేగంగా ఉందంటూ వేడివేడి టీని ఆస్వాదిస్తూ గేట్స్ చెబుతుండటం ఈ వీడియోలో ఉంది. జీవితాలను మెరుగుపరుచుకునేందుకు భారత్‌లో ఎందరో అద్భుతమైన ఆవిష్కర్తలు ఉన్నారని కొనియాడారు. తేనీరును తయారుచేసే సరళమైన పనిని కూడా కళాత్మకంగా చేయడం భారతీయుల గొప్పతనమని ప్రశంసించారు. టీ విక్రేత పక్కనే నిల్చుని మరిన్ని ఛాయ్ పే చర్చల కోసం వేచిచూస్తున్నానని గేట్స్ చెప్పడంతో వీడియో ముగుస్తుంది.

యూపీలో దారుణం

చెట్టుకు వేలాడుతూ బాలికల మృతదేహాలు

లక్నో : యూపీలో దారుణ ఘటన వెలుగు చూసింది. ఇద్దరు బాలికల మృతదేహాలు చెట్టుకు వేలాడుతూ కనిపించాయి. వారితో బలవంతంగా మద్యం తాగించి ఆపై లైంగిక దాడికి పాల్పడినట్లు బాలికల కుటుంబం ఆరోపించింది. దీంతో నిందితులైన ఇద్దరు యువకులతో పాటు కాంట్రాక్టర్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. ఉత్తర ప్రదేశ్‌లోని కాన్పూర్ జిల్లాలో ఈ సంఘటన జరిగింది. బుధవారం అర్ధరాత్రి కొత్వాలి ప్రాంతంలోని గ్రామంలో ఒక చెట్టుకు వేలాడుతున్న 16, 14 ఏళ్ల వయసున్న బాలికల మృతదేహాలను స్థానికులు గుర్తించారు. కాంట్రాక్టర్ కుమారుడు, మేనల్లుడు వారిద్దరికి మద్యం తాగించి అత్యాచారానికి పాల్పడ్డారని ఇటుక బట్టీలో పని చేసే బాలికల కుటుంబం ఆరోపించింది. దీనిని వీడియో తీయడంతో అవమానం తట్టుకోలేక ఇద్దరు బాలికలు చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడి ఉంటారని పోలీసులకు ఫిర్యాదు చేశారు. కాగా, పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. ఇద్దరు బాలికల మృతదేహాలను పోస్ట్‌మార్టం కోసం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కాంట్రాక్టర్, 18 ఏళ్ల అతడి కుమారుడు, 19 ఏళ్ల మేనల్లుడిని అరెస్ట్ చేశారు. సామూహిక అత్యాచారం, ఆత్మహత్యకు ప్రేరేపించడం, పోక్సో చట్టం సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. నిందితుల నుంచి స్వాధీనం చేసుకున్న మొబైల్ ఫోన్లలో ఉన్న వీడియో క్లిప్స్‌ను పరిశీలిస్తున్నట్లు పోలీస్ అధికారి తెలిపారు. ఇటుక బట్టీకి సుమారు 400 మీటర్ల దూరంలోని చెట్టుకు వేలాడుతూ బాలికల మృతదేహాలు కనిపించాయని వెల్లడించారు.

ప్రత్యేక దేశం వ్యాఖ్యలపై

ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఆగ్రహం

బెంగళూరు : దేశ విభజన వ్యాఖ్యలు చేసిన కర్నాటకకు చెందిన కాంగ్రెస్ ఎంపీ డీకే సురేశ్‌పై కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ మండిపడ్డారు. ఆ వ్యాఖ్యలను ఖండించారు. బడ్జెట్ కేటాయింపుల్లో తమకు అన్యాయం జరుగుతోందని, ఇదే కొనసాగితే దక్షిణాది రాష్ట్రాలతో ప్రత్యేక దేశం ఏర్పాటు చేయాలనే డిమాండ్ పెరుగుతుందని ఇటీవల సురేశ్ వ్యాఖ్యానించడం దుమారానికి దారి తీసింది. ఒక కార్యక్రమంలో పాల్గొన్న నిర్మలా సీతారామన్ నిధుల కేటాయింపుపై వివరణ ఇచ్చారు. 'నిధుల కేటాయింపులో కేంద్ర ప్రభుత్వం ఆర్థిక సంఘానికి కట్టుబడి ఉంది. దాని పాత్ర అంతవరకే ఉంటుంది. ఒక వేళ నిధులు పొందాలనుకుంటే కమిషన్‌కు రాష్ట్రాలు తమ సమస్యలు చెప్పుకోవాల్సి ఉంటుంది. అప్పుడు నిధులు మంజూరవుతాయి. ఒక్కో రాష్ట్రానికి ఒక్కో బలం ఉంటుంది. అందువల్ల దక్షిణాది రాష్ట్రాలను వేరుగా పరిగణించలేము. వాటన్నింటిని ప్రత్యేక దేశంగా ఏర్పాటు చేయడమన్న డిమాండ్ ప్రమాదకర పరిస్థితులకు దారి తీస్తుంది' అని ఆగ్రహం వ్యక్తం చేశారు. 'దక్షిణాది రాష్ట్రాలు ఇండెక్స్‌లో మెరుగైన పనితీరు కనబరుస్తున్నాయి. రాష్ట్రానికి ఎక్కువగా నిధులు కావాలంటే కమిషన్‌ను సంప్రదించాల్సిందే. మీరు ఒక బాధ్యతాయుతమైన పార్లమెంటు సభ్యుడిగా ఉంటూ దేశ విభజన డిమాండ్ చేస్తున్నారు. మీ వ్యాఖ్యలు తప్పు' అని ఆమె అన్నారు.

దేశంలోనే ధనిక పార్టీ బీజేపీ...

రూ.2,361 కోట్ల ఆదాయం

న్యూఢిల్లీ : దేశంలోనే ధనిక పార్టీగా బీజేపీ నిలిచింది. ఆరు ప్రధాన జాతీయ పార్టీలు తమ ఆదాయాన్ని వెల్లడించాయి. 2022-23 ఆర్థిక సంవత్సరానికి 3,077 కోట్ల ఆదాయం ఉన్నట్లు తెలుపగా, అందులో కేవలం బీజేపీకే 2,361 కోట్ల ఆదాయం వచ్చిందని అసోసియేషన్ ఫర్ డెమొక్రటిక్ రిఫార్మర్స్ (ఏడీఆర్) బుధవారం వెల్లడించింది. మొత్తం ఆదాయంలో బీజేపీ వాటా 76.73 శాతం కాగా, 452.375 కోట్ల వార్షిక ఆదాయం పొంది 14.70 శాతంతో కాంగ్రెస్ రెండో స్థానంలో నిలిచింది. అలాగే బీఎస్‌పీ, ఆప్, ఎన్‌పీపీ, సీపీఎం తమ ఆదాయాన్ని వెల్లడించాయి. 2021-22, 2022-23 ఆర్థిక సంవత్సరాల మధ్య బీజేపీ ఆదాయం 23.16 శాతం పెరిగి రూ.2,360.844 కోట్లకు చేరింది. ఇదే వ్యవధిలో కాంగ్రెస్, సీపీఎం, బీఎస్‌పీ ఆదాయం వరుసగా 16.42, 12.68, 33.14 శాతం తగ్గుతూ వచ్చాయి.

ప్రభుత్వ ఉద్యోగాలకు ఇద్దరు పిల్లల నిబంధన సరైనదే: సుప్రీం కోర్టు

న్యూఢిల్లీ : ప్రభుత్వ ఉద్యోగాలకు ఇద్దరు పిల్లల నిబంధనను సుప్రీం కోర్టు గురువారం సమర్థించింది. రాజస్తాన్‌లో ఇద్దరి కంటే ఎక్కువ సంతానం ఉన్న వ్యక్తులు ప్రభుత్వ ఉద్యోగాలకు అనర్హులు. కొన్నేళ్ల నుంచి రాష్ట్రంలో ఈ నిబంధన అమలులో ఉండగా తాజాగా దేశ అత్యున్నత న్యాయస్థానం సమర్థించింది. ఇందులో ఎలాంటి వివక్ష గానీ, రాజ్యాంగ ఉల్లంఘన గానీ లేదని తెలిపింది. ఈ మేరకు దీనిని సవాల్ చేస్తూ వేసిన పిటిషన్‌ను కొట్టివేసింది. రాజస్తాన్‌కు చెందిన రామ్‌జీ లాల్ జాట్ గతంలో సైన్యంలో పని చేసి 2017లో పదవీ విరమణ పొందారు. అనంతరం కానిస్టేబుల్ ఉద్యోగం కోసం 2018లో దరఖాస్తు చేసుకున్నారు. అయితే రామ్‌జీకి ఇద్దరు కంటే ఎక్కువ సంతానం ఉండటంతో ఆయన దరఖాస్తును అధికారులు తిరస్కరించారు. దీనిపై ఆయన న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. ఆయన పిటిషన్‌ను 2022లో రాజస్తాన్ హైకోర్టు కొట్టివేసింది. ఇది విధానపరమైన నిర్ణయమని, ఇందులో తాము జోక్యం చేసుకోలేమని తెలిపింది. దీంతో ఆయన సుప్రీం కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై తాజాగా విచారణ జరిపిన అత్యున్నత న్యాయస్థానం... 'ఇద్దరు పిల్లల' నిబంధనను సమర్థించింది. 'ఇందులో ఎలాంటి వివక్ష లేదు. కుటుంబ నియంత్రణను ప్రోత్సహించే లక్ష్యంతో తీసుకొచ్చిన ఈ నిబంధన రాజ్యాంగ ఉల్లంఘన కిందకు రాదు. గతంలో కొన్ని రాష్ట్రాల్లో పంచాయతీ ఎన్నికల కోసం ఈ నిబంధన తీసుకురాగా మేం దాన్ని ఆమోదించాం' అని వెల్లడించింది.

ఈ పిటిషన్‌ను కొట్టివేస్తున్నట్లు తెలిపింది. రాజస్థాన్ పోలీస్ సబ్‌ఆర్డినేట్ సర్వీస్ రూల్స్-1989 ప్రకారం... జూన్ 1, 2002 తర్వాత ఇద్దరు, అంతకంటే ఎక్కువ మంది సంతానం కలిగిన అభ్యర్థులు నియామకాలకు అనర్హులు. ఆ తర్వాత రాష్ట్రంలోని ప్రభుత్వ ఉద్యోగాలన్నింటికీ ఈ 'ఇద్దరు పిల్లల' నిబంధనను అమలుచేస్తూ రాజస్తాన్ వేరియస్ సర్వీస్ రూల్స్ చట్టానికి 2001లో సవరణలు చేశారు.

బీజేపీని ఓడిద్దాం... దేశాన్ని రక్షించుకుందాం

మోదీకి మద్దతిచ్చే పార్టీలకు బుద్ధి చెబుదాం

రాజ్యాంగ పరిరక్షణ సదస్సులో వక్తల పిలుపు

విశాలాంధ్ర-విశాఖ: మోదీ ప్రభుత్వాన్ని గద్దె దించుదాం, రాజ్యాంగ హక్కులకు తూట్లు పొడుస్తున్న బీజేపీ విధానాలను బలపరుస్తున్న పార్టీలను ఓడిద్దామని, మతోన్మాదం నుంచి దేశాన్ని రక్షించుకుందామని వక్తలు పిలుపునిచ్చారు. విశాఖలో 'బీజేపీ హఠావో, దేశ్ కో బచావో' నినాదంతో రాజ్యంగ హక్కుల పరిరక్షణ కోసం ప్రాంతీయ సదస్సు మాజీ మంత్రి, కిసాన్ సంయుక్త మోర్చా రాష్ట్ర కన్వీనర్ వడ్డే శోభనాదీశ్వరరావు అధ్యక్షతన గురువారం జరిగింది. ముఖ్య వక్త, కాంగ్రెస్ నాయకుడు మణిశంకర్ అయ్యర్ మాట్లాడుతూ బీజేపీ నుంచి దేశాన్ని రక్షించడమే ఇండియా కూటమి ధ్యేయమన్నారు. లౌకిక ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. గాంధీ నాయకత్వ నిర్ణయాలను నాడు ఆర్ఎస్ఎస్, సావార్కర్ వ్యతిరేకించినట్లు గుర్తుచేశారు. మోదీకి మించిన రామ భక్తుడు... హిందూ, ముస్లింల ఐక్యత కోరిన వ్యక్తి గాంధీ అని చెప్పారు. హిందూ, ముస్లింల ఐక్యతే ఉద్దేశంగా నెహ్రూని తన వారసుడిగా ఆయన ప్రకటించారన్నారు. సావర్కర్ ఆశీస్సులు పొందిన గాడ్సే ఆనాడు గాంధీని హతమార్చాడని అన్నారు. అంబేద్కర్ సహకారంతో నెహ్రూ పాలన సాగిందని, మతాలకతీతంగా భారతదేశం లౌకిక రాజ్యంగా ఉండాలని నెహ్రూ భావిస్తే, నేడు రామాలయ ప్రారంభోత్సవానికి హాజరైన ప్రధాని ఓ పూజారిగా వ్యవహరించారని విమర్శించారు. దేశం ఒక మతానికి పరిమితం అన్నట్లు వ్యవహరించడం తగదన్నారు. భిన్నత్వంలో ఏకత్వం అనే భావనను మోదీ ప్రభుత్వం తిరస్కరించే పరిస్థితి ఉందని, భిన్నత్వాలను పునరుద్ధరించాలనేది ఇండియా కూటమి ఉద్దేశమని చెప్పారు. ప్రతిపక్ష నాయకులను ఈడీ పేరుతో ఇబ్బంది పెడుతున్నారని, సొంత పార్టీల అవినీతి నాయకులు దర్జాగా తిరుగుతున్నా పట్టించుకోవడం లేదని మోదీ పాలనను విమర్శించారు. త్వరలో జరగబోయే ఎన్నికలు దేశ భవిష్యత్తును నిర్ణయించబోతున్నాయని మణిశంకర్ అయ్యర్ తెలిపారు. ఇండియా కూటమిని గెలిపించాలని పిలుపునిచ్చారు. వడ్డే శోభనాదీశ్వరరావు మాట్లాడుతూ దేశంలో పౌరుల హక్కులు, పత్రికా స్వేచ్ఛ, లౌకికతత్వానికి ముప్పు వాటిల్లుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. విభజన చట్టంలోని హామీలను కేంద్రప్రభుత్వం బుట్ట దాఖలు చేసిందని, విభజన హామీలపై అధికార, విపక్షాలను ప్రజలు ప్రశ్నించాలన్నారు. స్వరాజ్య పార్టీ నాయకుడు యోగేంద్ర యాదవ్ మాట్లాడుతూ రైతుల ఆందోళనలో తన పాత్రను వివరించారు. బీజేపీ మళ్లీ అధికారంలోకి వస్తే రాజ్యాంగం, స్వేచ్ఛ, సమానత్వం, లౌకికతత్వం భూస్థాపితం అవుతాయని హెచ్చరించారు. అభివృద్ధిపై శ్వేత పత్రం విడుదల చేయాలని మోదీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నిత్యావసర ధరలు పెరిగి సామాన్యులు అష్టకష్టాలు పడుతున్నారని, మోదీ గద్దె దిగితే మంచి రోజులు వస్తాయని ప్రజలు ఆశిస్తున్నారని చెప్పారు. వ్యాపారంలో 'మోదానీ' (మోదీ, అదానీ) భాగస్వామ్యం కొనసాగుతోందన్నారు. రాజ్యాంగ విలువలను రక్షించుకోవడానికి జరుగుతున్న పోరాటంలో అన్ని రాజకీయ పార్టీలు పాల్గొనాలని, 'సేవ్ ఇండియా' నినాదంతో ముందుకు వెళ్లాలని యోగేంద్ర యాదవ్ సూచించారు. జైభారత్ నేషనల్ పార్టీ నాయకులు వీవీ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ ద్వారక సముద్ర గర్భంలో పర్యటించిన మోదీ... బంగాళాఖాతంలో కూడా మునిగితే సముద్ర గర్భంలో ఆంధ్రప్రదేశ్ ప్రత్యేక విభజన హామీలు, హోదా ఉన్నాయా? లేదా? తెలుస్తుందని ఎద్దేవా చేశారు. ప్రత్యేక హోదా ముగిసిన అధ్యాయమని రాజకీయ పార్టీలు చెప్పాలని చూస్తున్నాయన్నారు. హోదా ఇవ్వవద్దని 14 ఫైనాన్స్ కమిషన్ చెప్పలేదని గుర్తుచేశారు. కేంద్రం మెడలు వంచుతామని చెప్పిన నాయకుడు ఢిల్లీ వెళ్లి తనమెడలు వంచడం సిగ్గుచేటన్నారు. సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణ మూర్తి, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ కేంద్రప్రభుత్వం వినాశనానికి విశాఖ కేంద్ర బిందువుగా ఉందని విమర్శించారు. ఉత్తరాంధ్రలో అభివృద్ధి లేదు, రైల్వేజోన్ లేదని అన్నారు. మోదీ పాలనలో వికసిత భారత్ కాదు విషాద భారత్ నిర్మాణం జరుగుతోందని వ్యాఖ్యానించారు. భీమిలి 'సిద్ధం' సభలో విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ గురించి ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి మాట్లాడకపోవడం బాధాకరమన్నారు. రుషికొండకు గుండు కొట్టించి 500 కోట్ల ప్రజాధనంతో విశాల నిర్మాణాలు దేనికోసమని ప్రశ్నించారు. ముఖ్యమంత్రి, ప్రతిపక్ష నాయకులు మోదీ భజన చేస్తున్నారని, రానున్న ఎన్నికల్లో ఓటు ద్వారా బీజేపీకీ, దానికి మద్దతు ఇచ్చే పార్టీలకు బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.ఓబులేసు మాట్లాడుతూ రాష్ట్రంలో బాబు, జగన్, పవన్‌ల బీజేపీ ఉందని విమర్శించారు. గతంలో ప్రారంభించిన మంగళగిరి ఎయిమ్స్‌ని మోదీ మరోమారు వర్చువల్‌గా ప్రారంభించి హడావిడి చేశారని విమర్శించారు. హంద్రీనీవాను చంద్రబాబు-జగన్ దెబ్బతీశారని విమర్శించారు. ఇలాంటి మోసగాళ్లకు ఎన్నికల్లో బుద్ధి చెప్పాలని ఓబులేసు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ప్రత్యేక హోదా సాధన సమితి కన్వీనర్ చలసాని శ్రీనివాసరావు, ఆప్ నేతలు శీరం రమేశ్, డాక్టర్ షీతల్, సీపీఐ నాయకులు మానం ఆంజనేయులు, సీపీఐ-సీపీఎం జిల్లా కార్యదర్శులు ఎం.పైడిరాజు ఎం.జగ్గునాయుడు, ఎంసీపీఐ జిల్లా కార్యదర్శి కె.శంకరరావు, సీపీఐ(ఎంఎల్) ప్రజాపోరు కార్యదర్శి దేవా, సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి కుమార్, మాజీ ఎమ్మెల్సీ ఎంవీఎస్ శర్మ, సీపీఎం నేత కొత్తపల్లి లోకనాథం, ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక కన్వీనర్ ఎ.అజశర్మ, గిరిజన సంఘం నాయకుడు కిల్లో సురేంద్ర, మహిళా సంఘాల నేతలు విమల, సత్యవతి పాల్గొన్నారు.

జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా

శ్రీనివాసరెడ్డి హామీ

మీడియా అకాడమీ చైర్మన్‌గా బాధ్యతల స్వీకరణ

విశాలాంధ్ర-హైదరాబాద్: జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలంగాణ మీడియా అకాడమీ నూతన చైర్మన్ కె.శ్రీనివాసరెడ్డి హామీనిచ్చారు. రాష్ట్ర జర్నలిస్టుల అవసరాలు, సమస్యలు, సంక్షేమం గురించి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి అవగాహన ఉందని, ఇప్పటికే కొన్ని అంశాలను ఆయన దృష్టికి తీసుకెళ్లామని చెప్పారు. జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇచ్చేందుకు ప్రభుత్వ భూములు గుర్తించాలని అన్ని జిల్లాల కలెక్టర్లకు ప్రభుత్వం ఆదేశాలు ఇస్తున్నట్లు తెలిపారు. శ్రీనివాసరెడ్డి గురువారం తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్, సురవరం ప్రతాపరెడ్డి ఆడిటోరియంలో జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతూ హైదరాబాద్‌లోని జవహర్ లాల్ నెహ్రూ జర్నలిస్టు హౌసింగ్ సొసైటీ సభ్యులు ఒక్కొక్కరు తమకు రావలిసిన ఇళ్ల స్థలాల కోసం 17 ఏళ్ల కిందట రెండున్నర లక్షల రూపాయలు కట్టారని, వారికి ఇంటి స్థలాలు వెంటనే ఇవ్వడానికి కృషి చేస్తానని హామీనిచ్చారు. 17ఏళ్లలో 60 మంది జర్నలిస్టులు ఇంటి స్థలాలు అందకుండానే చనిపోయారన్నారు. హైదరాబాద్‌లో పనిచేస్తున్న జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలను ఒకే చోట కాకుండా ఎవరికి ఎక్కడ కావాలంటే అక్కడ ఇస్తే బాగుంటుందని శ్రీనివాసరెడ్డి అన్నారు. జర్నలిస్టుల హెల్త్ కార్డులు అన్ని ఆసుపత్రులలో పనిచేసేలా చూడాలని ప్రభుత్వాన్ని కోరారు. జర్నలిస్టు కొంత చెల్లించడం ద్వారా హెల్త్ కార్డు ద్వారా అన్ని ఆసుపత్రులలో మంచి వైద్యం పొందే విధంగా కృషి చేస్తానన్నారు. అర్హులైన ప్రతి జర్నలిస్టుకు అక్రెడిటేషన్, ఇంటి స్థలం, హెల్త్ కార్డు వచ్చేలా కృషి చేస్తామని శ్రీనివాసరెడ్డి తెలిపారు. ముఖ్యమంత్రి ముఖ్య పౌర సంబంధాల అధికారి, అయోధ్య రెడ్డి జర్నలిస్ట్ పక్షపాతని, ఆయన సహకారంతో జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. పత్రిక యాజమాన్యాలను పక్కనపెట్టి జర్నలిజం ప్రమాణాలను పెంచడానికి పత్రికా విలేకరులు కృషి చేయాలని అన్నారు. జాగ్రత్తగా రిపోర్టింగ్ చేసి ప్రజా పక్షపాతిగా పని చేయాలన్నారు. ఇళ్ల స్థలాల విషయంలో న్యాయపరమైన ఇబ్బందులుంటే అడ్వకేట్ జనరల్ సలహాతో పరిష్కరించుకోవాలని ముఖ్యమంత్రి సలహా ఇచ్చారని తెలిపారు. మీడియా అకాడమీకి కావాల్సిన బడ్జెట్, కార్యాలయానికి కావాల్సిన భవనం, అవసరమైన సిబ్బంది, అన్ని సౌకర్యాలు అందించే ఏర్పాట్లు చేయాలని ముఖ్యమంత్రి తన ముఖ్య కార్యదర్శిని ఆదేశించారని శ్రీనివాసరెడ్డి చెప్పారు. జర్నలిస్టులకు త్వరలోనే ఇళ్ల స్థలాలు ఇవ్వాలని ప్రభుత్వ యోచిస్తోందని అయోధ్యరెడ్డి చెప్పారు. సమాచార పౌర సంబంధాల శాఖ ప్రత్యేక కమిషనర్ హనుమంతరావు మాట్లాడుతూ జర్నలిజంలో పుట్టి, పెరిగి వారి అవసరాల గురించి ప్రతిక్షణం ఆలోచించే వ్యక్తి శ్రీనివాసరెడ్డి మీడియా అకాడమీ చైర్మన్‌గా రావడం జర్నలిస్టుల అదృష్టమన్నారు. సమాజం కోసం తపించే వ్యక్తి జర్నలిస్టు... మానవీయ కథనాలు రాసి సమాజం ఉన్న లోటుపాట్లను ప్రభుత్వం దృష్టికి తెచ్చేవాడు జర్నలిస్టు... అట్టి సమాజ సేవకుడికి సదుపాయాలు కల్పించడానికి, అధికారిగా తన బాధ్యతలు నిర్వర్తిస్తానని హనుమంతరావు అన్నారు. కార్యక్రమంలో సీనియర్ సంపాదకులు రామచంద్ర మూర్తి, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ జాతీయ మీడియా సలహాదారు దేవులపల్లి అమర్, ఆంధ్రజ్యోతి సంపాదకులు శ్రీనివాస్, సియాసత్ ఉర్దూ దిన పత్రిక సంపాదకులు అమీర్ అలీ ఖాన్, అకాడమీ కార్యదర్శి నాగులపల్లి వెంకటేశ్వర రావు పాల్గొన్నారు. కార్యక్రమానికి వ్యాఖ్యాతగా యూనియన్ నాయకులు విరాహత్ అలీ వ్యవహరించారు.

సీఎం జగన్‌ను గద్దె దించేందుకు సిద్ధం

మహిళా సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుర్గాభవానీ

విశాలాంధ్ర-విజయవాడ(వన్‌టౌన్): గత ఎన్నికల ముందు దశలవారీగా మద్య నియంత్రణ చేస్తానన్న హామీని అమలు చేయకుండా మహిళలను నమ్మించి మోసం చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌ను గద్దె దించేందుకు మహిళలు సిద్ధంగా ఉన్నారని ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెన్మెత్స దుర్గాభవాని హెచ్చరించారు. మద్య నిషేధం అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఎన్టీఆర్ జిల్లా మహిళా సమాఖ్య (ఎన్ఎఫ్ఐడబ్ల్యూ) అధ్వర్యంలో గురువారం విజయవాడ వైఎస్సార్ కాలనీ వద్ద ఉన్న బార్ ఎదుట నిరసన ప్రదర్శన నిర్వహించారు. శాంతి యుతంగా నిరసన తెలియజేస్తున్న మహిళలతో బార్ నిర్వాహకులు వాగ్వాదానికి దిగారు. పోలీసుల జోక్యంతో పరిస్థితి అదుపులోకి వచ్చింది. ఈ సందర్భంగా దుర్గాభవానీ మాట్లాడుతూ అధికారంలోకి రాకముందు వైఎస్ జగన్ ప్రతి ఊరికి వెళ్లి దశల వారీగా మద్య నిషేధం అమలు చేస్తామని హామీ ఇచ్చారని చెప్పారు. అధికారంలోకి వచ్చాక మద్య నియంత్రణ అంశాన్ని నవరత్నాలలో చేర్చి బెల్ట్ షాపులు రద్దు చేశారని... ఆ మరుసటి ఏడాది నుంచి మద్య నియంత్రణను గాలికొదిలేసి ప్రభుత్వానికి ప్రధాన ఆదాయ వనరుగా మార్చుకున్నారని విమర్శించారు. గత ప్రభుత్వం దిగిపోయే నాటికి మద్యంపై ఏడాదికి రూ.16వేల కోట్లు ఆదాయం ఉండగా, దాన్ని రూ.36వేల కోట్లకు జగన్ ప్రభుత్వం పెంచిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. మొదట్లో బెల్ట్ షాపులు నిలిపేసినా ఇప్పుడు అనధికారికంగా రాష్ట్రంలో 70వేలకు పైగా ఉన్నాయన్నారు. వైఎస్ జగన్ ఇప్పటికైనా మద్య నిషేధం అమలు చేయాలని, లేకపోతే రానున్న ఎన్నికల్లో ఆయనకు తగిన బుద్ధి చెప్పేందుకు మహిళలు సిద్ధంగా ఉన్నారని హెచ్చరించారు. అదేవిధంగా రానున్న ఎన్నికలలో ప్రతి పార్టీ మద్య నిషేధం చేస్తామని ఎన్నికల మేనిఫెస్టోలో చేర్చాలని, అధికారంలోకి వచ్చిన వెంటనే అమలు చేయాలని, లేకపోతే మహిళా సమాఖ్య ఉద్యమిస్తుందని స్పష్టం చేశారు. మహిళా సమాఖ్య నగర ప్రధాన కార్యదర్శి పంచదార్ల దుర్గాంబ, ఎన్టీఆర్ జిల్లా మహిళా సమాఖ్య కార్యదర్శి బంకా ఝాన్సీ లక్ష్మి మాట్లాడుతూ మద్య నిషేధంపై మాట తప్పిన సీఎం జగన్... ఎన్నికలవేళ సిద్ధం అంటూ ప్రతిచోట బోర్డులు పెడుతున్నారన్నారు. 'మద్యంపై యుద్ధానికి మేము సిద్ధమే మద్య నిషేధానికి మీరు సిద్ధంగా ఉన్నారా? ఓడిపోవడానికి సిద్ధంగా ఉన్నారా' అని ఎద్దేవా చేశారు. ఈ కార్యక్రమంలో మహిళా సమాఖ్య నాయకులు ఓర్చు భారతి, మేకల కుమారి, చింతాడ పార్వతి. జ్యోతి, కొట్టు విజయలక్ష్మి, ఆది, కొట్టు దుర్గ, ఆర్.బుజ్జి, పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

'సూర్యఘర్'కు కేబినెట్ ఆమోదం

సోలార్ ప్యానళ్ల ఏర్పాటుకు రూ.78వేల వరకు..

పీ & కే ఎరువులపై రూ.24,420 కోట్ల సబ్సిడీ

న్యూఢిల్లీ: 'పీఎం సూర్యఘర్: ఉచిత సౌర విద్యుత్ యోజన'కు కేంద్ర కేబినెట్ గురువారం ఆమోదం తెలిపింది. ఇంటి పైకప్పుపై సోలార్ ప్యానళ్ల ఏర్పాటుకు రూ.78వేల వరకు సబ్సిడీ ఇచ్చేందుకు అంగీకరించింది. కోటి ఇళ్లకు నెలకు 300 యూనిట్ల ఉచిత విద్యుత్ అందించేందుకు ఈ పథకం దోహదమవుతుందని పేర్కొంది. అదే సమయంలో ఖరీఫ్ సీజన్ కోసం ఫాస్ఫేటిక్, పొటాసిక్ (పీ&కే) ఎరువులపై రూ.24,420 కోట్ల సబ్సిడీని మంజూరు చేసింది. ప్రధాని మోదీ నేతృత్వ కేంద్ర కేబినెట్ గురువారం సమావేశమై ఈ మేరకు నిర్ణయాలు తీసుకున్నట్లు కేంద్రమంత్రి అనురాగ్ ఠాకూర్ తెలిపారు. రూ.75,021 కోట్లతో ఈ పథకాన్ని చేపట్టినట్లు వెల్లడించారు. 2025 నాటికి అన్ని కేంద్ర ప్రభుత్వ కార్యాలయాలపై రూఫ్‌టాప్ సోలార్ వ్యవస్థను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. సోలార్ ప్యానళ్ల ఏర్పాటు చేసుకొనేందుకు అధికారిక వెబ్‌సైట్‌లో గృహ వినియోగదారుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు చెప్పారు. రెండు కిలోవాట్ల వ్యవస్థల కోసమయ్యే ఖర్చులో 60శాతం కేంద్ర ఆర్థిక సాయం (సీఎఫ్ఏ)గా పొందవచ్చు. 2-3 కిలోవాట్ల కోసం మరో 40శాతం పొందవచ్చు. ప్రస్తుత ధరల ప్రకారం కిలోవాట్ సామర్థ్యంగల సోలార్ ప్యానళ్ల కోసం రూ.30వేల వరకు సబ్సిడీ పొందొచ్చు. రెండు కిలోవాట్‌లకైతే రూ.60 వేలు, మూడు లేక అంతకంటే ఎక్కువ కిలోవాట్లకు రూ.78వేల వరకు రాయితీగా ఇస్తారు. ప్రతి జిల్లాలో ఒక మోడల్ సోలార్ విలేజ్ (నమూనా సౌరశక్తి గ్రామం) అభివృద్ధి జరుగుతుంది. పట్టణ స్థానిక సంఘాలు, పంచాయతీ రాజ్ వ్యవస్థలు కూడా రూఫ్‌టాప్ సోలార్ (ఆర్‌టీఎస్) ద్వారా లబ్ధి పొందవచ్చు. 'హెచ్‌టీటీపీఎస్://పీఎంసూర్యఘర్. జీవోవీ.ఇన్' వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోచ్చని వెల్లడించింది. ఉత్పత్తి, లాజిస్టిక్స్, సరఫరా గొలుసులు, సేల్స్, ఇన్‌స్టాలేషన్లలో 17 లక్షల ఉద్యోగాల సృష్టి సాధ్యమని ప్రకటన తెలిపింది. అలాగే, పీ&కే ఎరువుల కోసం రూ.24,420 కోట్ల సబ్సిడీని కేంద్ర కేబినెట్ ఆమోదించిందని అనురాగ్ ఠాకూర్ తెలిపారు. డీఏపీ (డై అమోనియం ఫాస్పేట్)తో పాటు ఇతర పీ&కే ఎరువుల రీటైల్ ధరలు స్థిరంగా ఉంటాయన్నారు. 2024-25 ఖరీఫ్ సీజన్ కోసం పీ & కే ఎరువుల ఎన్‌బీఎస్ రేట్లను ఖరారు చేయాలన్న ఎరువుల శాఖ ప్రతిపాదనను కేబినెట్ ఆమోదించిందని చెప్పారు. ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి సెప్టెంబరు 30 వరకు ఖరీఫ్ కోసం పీ & కే ఎరువులపై రూ.24,420 కోట్ల సిబ్సిడీని కేంద్ర కేబినెట్ ఆమోదించిందన్నారు. నైట్రోజన్ (ఎన్) సబ్సిడీ కేజీకి రూ.47.02, ఫాస్ఫేటిక్ (పీ) రూ.28.72 (గ్రాముకు), పొటాసిక్ (కే) కేజీకి రూ.2.38, సల్ఫర్ (ఎస్) కేజీకి రూ.1.89 చొప్పున ఉన్నట్లు ఆయన వెల్లడించారు. తాజా సబ్సిడీలతో ప్రస్తుతం 50కేజీల డీఏపీ బస్తా రూ.1,350కే ఖరీఫ్ సీజన్‌లోనూ లభిస్తుందని చెప్పారు. మురియేట్ ఆఫ్ పొటాష్ (ఎంఓపీ) ధర యథాతథంగా రూ.1,670 ఉంటుందని, ఎన్‌పీకే బస్తా రూ.1,470కు లభిస్తుందని అన్నారు. డీఏపీ దిగుమతులపై ఆధారాన్ని తగ్గించేందుకు ఎన్‌బీఎస్ పథకం కింద మూడు కొత్త ఎరువుల గ్రేడ్‌లు చేర్చడానికీ కేబినెట్ ఆమోదం తెలిపిందని ఠాకూర్ వెల్లడించారు.

అనకాపల్లిలో విశాలాంధ్ర జిల్లా కార్యాలయం ప్రారంభం

విశాలాంధ్ర బ్యూరో-అనకాపల్లి: నూతనంగా ఏర్పడిన అనకాపల్లి జిల్లాలో విశాలాంధ్ర జిల్లా కార్యాలయాన్ని జనరల్ మేనేజర్ పి.హరినాథ రెడ్డి గురువారం ప్రారంభించారు. పట్టణంలోని నర్సింగరావుపేట, దుర్గాలాడ్జి వీధిలో ఏర్పాటు చేసిన కార్యాలయాన్ని జనరల్ మేనేజర్ రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. అనంతరం రోటరీ సమావేశ మందిరంలో జరిగిన ఉమ్మడి విశాఖ జిల్లా విలేకరుల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. జిల్లా బ్యూరో బి.కొండలరావు అధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో విశాఖ ఎడిషన్ సెంటర్ మేనేజర్ ససపల నర్సింహులు, విశాఖ బ్యూరో రామకృష్ణ, అల్లూరి జిల్లా బ్యూరో యర్రారెడ్డితో పాటు ఉమ్మడి జిల్లాలోని విలేకరులు పాల్గొన్నారు.

కుకీ-జో గ్రూపులతో కాల్పుల విరమణ ముగించండి

న్యూఢిల్లీ: జాతుల మధ్య ఘర్షణలతో హింసకు గురైన మణిపూర్ లో దాదాపు 25 కుకీ-జో తిరుగుబాటు గ్రూపులతో ఉన్న వివాదాస్పదమైన కాల్పుల విరమణ ఒప్పందాన్ని విరమించుకోవాలని కేంద్రాన్ని కోరుతూ ఆ రాష్ట్ర అసెంబ్లీ గురువారం ఏకగ్రీవంగా తీర్మానాన్ని ఆమోదించింది. ఈ ఒప్పందం పొడిగింపు గడువు ఫిబ్రవరి 29తో ముగిసింది. కుకీ-జో తిరుగుబాటు గ్రూపులు 2008లో కేంద్రం, మణిపూర్ ప్రభుత్వంతో త్రైపాక్షిక కాల్పుల విరమణ ఒప్పందంపై సంతకాలు చేశాయి. ప్రతి సంవత్సరం ఉమ్మడి పర్యవేక్షణ గ్రూప్ ఈ ఒప్పందాన్ని సమీక్షించి... దానిని ముగించడమా లేదా పొడిగించాలా అనేది నిర్ణయిస్తుంది. స్థూలంగా, ఒప్పందం ప్రకారం తిరుగుబాటుదారులు నిర్ణీత శిబిరాల్లో ఉండాలి. వారి ఆయుధాలను లాక్ చేసిన నిల్వలో ఉంచుతారు. క్రమం తప్పకుండా పర్యవేక్షించాల్సి ఉంటుంది.

'93 పేలుళ్ల కేసులో తుండా నిర్దోషి

జైపూర్: 1993 నాటి రైళ్లలో వరుస పేలుళ్ల కేసులో ప్రధాన నిందితుడు అబ్దుల్ కరీం తుండా (81)కు రాజస్థాన్, అజ్మీర్‌లోని ప్రత్యేక న్యాయస్థానం ఊరటనిచ్చింది. ఆయనను నిర్దోషిగా పేర్కొంటూ ఉత్తర్వులను జారీచేసింది. ఆయనపై ఆరోపణలను నిరూపించేందుకు సరైన సాక్ష్యాధారాలను న్యాయవాది కల్పించలేకపోయినట్లు వెల్లడించింది. ఇదే కేసులో నిందితులుగా ఉన్న ఇర్ఫాన్, హమీదుద్దీన్‌కు యావజ్జీవ శిక్ష విధిస్తూ టాడా కోర్టు తీర్పునిచ్చింది. తుండాపై ఉన్న అన్ని ఆరోపణలను కోర్టు కొట్టివేసింది. ఆయనను ప్రతి చట్టంలోని ప్రతి సెక్షన్ నుంచి విముక్తి కల్పించి నిర్దోషిగా పేర్కొంది. ప్రాసిక్యూషన్ నేరం రుజువు చేయలేక పోయినట్లు తుండా తరపు న్యాయవాది షఫ్కతుల్లా సుల్తానీ తెలిపారు. తుండాను చూసి ఇతర నిందితులు బాంబులు తయారు చేసినట్లు దర్యాప్తు సంస్థలు సృష్టించాయని చెప్పారు. వాస్తవాలను కోర్టు ముందర డిఫెన్స్ ఉంచిందని, తుండా నేరం చేసినట్లు రుజువులు లేవన్నారు. బాంబులు అమర్చినందుకు ఇర్ఫాన్, హమీదుద్దీన్‌కు జీవత ఖైదు పడినట్లు వారి తరపు న్యాయవాది అబ్దుల్ రషీద్ వెల్లడించారు. హమీదుద్దీన్ 14ఏళ్లుగా, ఇర్ఫాన్ 17 ఏళ్లుగా జైల్లో ఉన్నారని చెప్పారు.

మతతత్వ బీజేపీని ఓడించాలి

విశాలాంధ్ర-విజయవాడ (గాంధీనగర్): మతతత్వ బీజేపీని, దాని మిత్రపక్షాలను ఓడించటానికి రానున్న ఎన్నికలలో ప్రతి ఒక్కరు ఓటు వేయాలని సీపీఐ(ఎం-ఎల్) కేంద్ర కార్యవర్గ సభ్యులు అరవింద్ సిన్హా పిలుపు నిచ్చారు. గురువారం విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత పదేళ్ల బీజేపీ ప్రభుత్వ విధానాల ఫలితంగా దేశ ప్రజల జీవితాలు అతలాకుతలమయ్యాయన్నారు. అప్పులపై అప్పులతో పరిపాలన సాగిస్తున్న ప్రభుత్వం అప్పుల ఊబిలో కూరుకుపోయి ప్రజలపై అప్పుల భారాన్ని మోపిందన్నారు. నిరుద్యోగుల సంఖ్య పెరిగిపోతూ, నిత్యావసర ధరలు ఆకాశాన్నంటుతున్నాయని, పారిశ్రామిక రంగం కుదేలైందన్నారు. ప్రభుత్వ రంగాన్ని బడా బూర్జువా సామ్రాజ్యవాద దళారీలకు విక్రయించటం, విద్య, వైద్య రంగాలను ప్రైవేటీకరిస్తున్నారన్నారు. బీజేపీ అభివృద్ధికర భావజాలాన్ని తుడిచిపెట్టి పెట్టుబడిదారీ, మతతత్వభావాలను నెలకొల్పేందుకు యత్నిస్తోందని... నిజమైన ఫాసిస్టు ధోరణి ఇదేనని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీజేపీ ఫాసిస్టు పోకడలకు అడ్డుకట్ట వేయడానికి ఎన్నికల ప్రక్రియ ఒక పరిమిత మార్గమేనన్నారు. కమ్యూనిస్టు శక్తులు, అభ్యుదయవాదులు, విప్లవ శక్తులు తమ భూమికను విస్తృత పరచుకోవాలని, దృఢపరచుకోవాలని... అప్పుడే అభివృద్ధి నిరోధక, ఫాసిస్టు రాజకీయ, ఆర్థిక, సాంస్కృతిక విధానాలను ఓడించగలుగుతారన్నారు. ఈ సమావేశంలో కేంద్ర కమిటీ సభ్యులు గుర్రం విజయ్‌కుమార్, సెంట్రల్ కమిటీ నాయకులు గణేష్ పండా, కిషోర్ బాబు పాల్గొన్నారు.

నాటు సారా తాగి ఒకరి మృతి

విశాలాంధ్ర-రాజాం : పాలకొండలో జరిగిన ఓ వివాహ విందు వేడుకలో విషాదం చోటు చేసుకుంది. విందులో నాటుసారా తాగి ఒకరు మృతి చెందగా, మరో ఇద్దరు అపస్మారక స్థితికి చేరుకున్నారు. విజయనగరం జిల్లా మెరకముడిదాం మండలం గొల్లలవలస పంచాయతీ రాచపేట గ్రామానికి చెందిన ముగ్గురు వ్యక్తులు పాలకొండలో జరిగిన ఓ వివాహ వేడుక విందుకు హాజరయ్యారు. గురువారం భోజనాల సమయంలో నాటుసారా తాగారు. అనంతరం భోజనం చేసిన తరువాత ఆటోలో తిరిగి ఇంటికి ప్రయాణమయ్యారు. మార్గమధ్యలో రేగిడి మండలం మజ్జిరామునిపేట వద్దకు వచ్చేసరికి వారు అనారోగ్యానికి గురయ్యారు. వెంటనే 108 వాహనానికి సమాచారం అందించారు. 108 వాహనం వచ్చేటప్పటికి రౌతు సత్యంనాయుడు (60) మృతి చెందాడు. మిగిలిన ఇద్దరు చిలకలపల్లి అప్పారావు, అదపాక సూర్యనారాయణ అపస్మారక స్థితిలో ఉన్నారు. వారిని వైద్య చికిత్స నిమిత్తం రాజాం సామాజిక ఆసుపత్రిలో చేర్చారు. ప్రస్తుతం వారి పరిస్థితి విషమంగా ఉంది.

జీవీఎంసీ కమిషనర్‌పై చర్యలు తీసుకోవాలి

వేధింపుల వల్లే ఎన్విరాన్మెంట్ సెక్రటరీ ఆత్మహత్యాయత్నం

జీవో 423 రద్దు చేయాలి: ఈశ్వరయ్య డిమాండ్

విశాలాంధ్ర బ్యూరో-విశాఖపట్నం: రాష్ట్రంలో జగన్ పాలనలో మరో సచివాలయ శానిటేషన్-ఎన్విరాన్మెంట్ సెక్రటరీ ఆత్మహత్యాయత్నంకు పాల్పడిన ఘటన విశాఖలో విషాదాన్ని నింపింది. ఉద్యోగుల సమయపాలన అమలుచేయండి, మేస్త్రి జాబ్‌చార్ట్‌ను మాపై రుద్దకండి అని అడిగిన పాపానికి, పది నెలలుగా సస్పెండ్‌లు, సర్వీస్ నుంచి తొలగింపు పేరుతో జీతాలు లేక తీవ్రమానసిక వేదనకు గురిచేసిన జీవీఎంసీ కమిషనర్ సాయి కాంత్ వర్మను క్షమించమని కాళ్లావేళ్లా పడినా కనికరించకపోవడంతో తీవ్ర మానసిక వేదనకు గురైన శానిటేషన్-ఎన్విరాన్మెంట్ సెక్రటరీ బుధవారం రాత్రి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఈ ఘటనపై అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు గుజ్జుల ఈశ్వరయ్య గురువారం మండిపడ్డారు. చెత్తపన్ను వసూలు పేరుతో సెక్రటరీలను శానిటరి ఇన్‌స్పెక్టర్లు, కమిషనర్ వేధిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇదే విషయమై గతంలో కమిషనర్ వేధింపులతో ఓ శానిటేషన్ సెక్రటరీ ఆత్మహత్య చేసుకోవడంతో కుటుంబం రోడ్డున పడిందన్నారు. వేధింపులు ఆపాలని, సస్పెన్షన్ ఎత్తివేయాలని ఈశ్వరయ్య డిమాండ్ చేశారు. కమిషనర్‌పై సీఎం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సీఎం మానసపుత్రికైన సచివాలయం వ్యవస్థలో నాలుగేళ్లుగా శానిటేషన్-ఎన్విరాన్మెంట్ సెక్రటరీతో ఎనిమిది నుంచి 12 గంటల వరకు మురికి కాలువల వద్ద, రోడ్లు ఊడిపిస్తూ మేస్త్రీ కంటే దారుణంగా పనులు చేయిస్తున్నారన్నారు. సెలవులు ఇవ్వకుండా మానసిక ఒత్తిడికి గురిచేస్తుండడంతో సెక్రటరీ శివ ఆదిమూర్తి అలియాస్ పీటర్... ఇదేంటి అని కమిషనర్‌ను ప్రశ్నించినందుకు మెమోలు, షోకాజ్ నోటీసులు, సస్పెండ్ పేరుతో తీవ్ర మానసిక వేదనకు గురిచేస్తుండడంతోనే బుధవారం రాత్రి జీవీఎంసీ ప్రధాన కార్యాలయం ముందు మణికట్టు వద్ద బ్లేడ్‌తో కోసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడని, సెక్యూరిటీ సిబ్బంది అతడిని కేజీహెచ్‌కు తరలించి ప్రాణాపాయ స్థితి నుంచి కాపాడారు. ఆత్మహత్య చేసుకునేలా ప్రేరేపించిన కమిషనర్‌పై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని గుజ్జుల డిమాండ్ చేశారు. ఎంతోమంది ఉద్యోగాలకు రాజీనామాలు చేశారనీ, మరికొందరు బీపీ, గుండెపోటుతో ఉద్యోగంలో కొనసాగుతున్నారన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న శానిటేషన్ ఎన్విరాన్మెంట్ సెక్రటరీలంతా విజయవాడలో ధర్నా చేసి సమస్యలు పరిష్కరించండని ప్రాధేయపడినా సీఎం కనికరించలేదని అన్నారు. జీవో 423 విడుదల చేసి ఉదయం 5.30 గంటలకే డ్యూటీ కి రావాలని హుకుం జారీచేశారని గుర్తు చేశారు. ప్రభుత్వం స్పందించి సస్పెండైన శివ ఆదిమూర్తి ని విధుల్లోకి తీసుకోవాలని, వేధింపుల నుంచి రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. జీవో 423ను రద్దు చేయాలన్నారు.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2024-26, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.